భర్తృహరి నీతి శతకము
రూ॥40/-
పేజీలు:48

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

అమెరికా సాయం అసలు కథేంటి?
మోదీ సర్కార్ మౌనం వీడాలి!

రాజీనామాకు సిద్ధం : జెలెన్‌స్కీ

అమెరికా నుండి
స్వాతంత్య్రం పొందుదాం

లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 88 | మంగళవారం | 25-02-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## ఆర్థిక హక్కుల కోసం.. ‘దళితులు ఏకం కావాలి’

- దళిత సంక్షేమానికి సరిపడా నిధులు కేటాయించాలి
- సిపిఐ రాష్ట్రకార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని

3

## మైనింగ్ చరిత్రలో కీలక మైలురాయిగా తెలంగాణ



## అసంపూర్తిగా ముగిసిన కెఆర్‌ఎంబి సమావేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

కృష్ణా నదీ యాజమాన్య బోర్డ్ (కెఆర్‌ఎంబి) సమావేశం అసంపూర్తిగా ముగిసింది. హైదరాబాద్‌లోని జలసౌధలో సోమవారం కెఆర్ ఎంబి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల శాఖ అధికారులు తమ వాదనను వినిపించగా, ఎపి జలవనరుల శాఖ అధికారులు ఎటువంటి వాదనలు వినిపించకుండానే వెళ్లిపోయారు. దీంతో మంగళవారం మరోసారి సమావేశం కానున్నారు. శ్రీశైలం, సాగర్ ప్రాజెక్ట్‌ల కింద ఉన్న పంటలు, తాగునీటి అవసరాలకు సంబంధించిన వివరాలతో ఇరు రాష్ట్రాల అధికారులు రావాలని కెఆర్‌ఎంబి కోరింది.



## బిఆర్‌ఎస్, బిజెపి చీకటి ఒప్పందం

- ఫోన్‌ట్యాపింగ్ కేసులో నిందితులుగా ఉన్న ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావును దేశానికి రప్పించండి
- ఏం చేయాలో అది చేస్తాం
- కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్
- అరెస్టుల నుంచి తప్పించుకోవడానికి తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కెటిఆర్, హరీశ్‌రావు, కవిత ఎవరికి మద్దతిస్తారో వెల్లడించాలి
- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభల్లో ముఖ్యమంత్రి డిమాండ్

‘ జాతీయస్థాయిలో జనగణలోనే కులగణన తేల్చాలి. 1979లోనే మండల్ కమిషన్ బిసిలలో ముస్లింలను చేర్చిందో లేదో బండి సంజయ్ తెలుసుకోవాలి. బిజెపి పాలిత రాష్ట్రాలైన గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, బీహార్‌లలో ముస్లిం ఉపకులాలు బిసి రిజర్వేషన్లు అనుభవించడం లేదా? పార్లమెంటులో ఎస్‌సి వర్గీకరణ బిల్లు పెట్టారా? చట్టం చేశారా? ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్రంలో ఎస్‌సి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వమే. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బిసి అభ్యర్థి బండారు దత్తాత్రేయ సీటును గుంజుకున్నారు, అదే విధంగా బిసి రాష్ట్ర అధ్యక్ష పదవిని సైతం గుంజుకున్న ఆయన బిసి పక్షపాతి ఎలా అవుతారు?. - సిఎం రేవంత్‌రెడ్డి ’

# కాంగ్రెస్‌ను ఓడించే కుట్ర

ప్రజాపక్షం / కరీంనగర్ /నిజామాబాద్/ మంచిర్యాల

‘గొర్రెల స్కామ్, ఫార్ములా ఈ –రేసు కేసులు పెడితే.. పేపర్లన్నింటినీ ఇడి తీసుకెళ్లింది. ఫోన్ ట్యాపింగ్ కేసును అడ్డుపెట్టుకుని లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి గెలిచింది. ఆ కేసులో నిందితులుగా ఉన్న ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావును కేంద్రమంత్రి బండి సంజయ్ ఎందుకు భారత్‌కు రప్పించడం లేదు? వాళ్లని మన దేశానికి రప్పించండి.. ట్యాపింగ్ కేసులో ఏం చేయాలో మేం అది చేస్తాం’ అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. బిఆర్‌ఎస్, బిజెపి చీకటి ఒప్పందంలో భాగంగానే కాంగ్రెస్‌ను ఓడించాలనే కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. అరెస్టులను తప్పించుకోవడానికే ఢిల్లీ ముందు సాగిలబడి తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రధాని మోదీకి తాకట్టుపెట్టారని విమర్శించారు. ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం నిజామాబాద్, మంచిర్యాల, కరీంనగర్‌లో పాల్గొని అక్కడ ఏర్పాటు చేసిన సభల్లో ప్రసంగించారు. కరీంనగర్‌లోని ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ సంకల్పసభలో మాట్లాడుతూ బిఆర్‌ఎస్, బిజెపి చీకటి ఒప్పందంలో భాగంగానే కాంగ్రెస్‌ను ఓడించాలనే కుట్రలు జరుగుతున్నాయన్నారు. బిఆర్‌ఎస్ నుంచి అభ్యర్థిని బరిలో నిలపకుండా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలంటున్న బిఆర్‌ఎస్ నేతలు కెటిఆర్, హరీష్‌రావు, కవితలు ఎవరికి మద్దతిస్తున్నారో తెలపాలని డిమాండ్ చేశారు. గత పార్లమెంటు ఎన్నికల్లో 8 ఎంపి సీట్లు గెలుచుకున్న బిజెపి సీట్లలో బిఆర్‌ఎస్ డిపాజిట్ గల్లంతు అయ్యిందని గుర్తు చేశారు. అదే చీకటి ఒప్పందాన్ని కొనసాగిస్తూ కాంగ్రెస్‌ను ఓడించేందుకు కంకణం కట్టుకున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే ఉప ఎన్నికల్లో గెలుపు దేవుడెరుగు కానీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు ఎవరికో కెసిఆర్ నీతి నిజాయితీని తరువాయి 2లో

## ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు

- మార్చి 3 నుంచి నామినేషన్లు
- 20న పోలింగ్
- షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల కమిషన్
- రాష్ట్రంలో ఐదు స్థానాలకు ఎన్నికలు

ప్రజాపక్షం / హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో ఎంఎల్‌ఎ కోటా ఎంఎల్‌సి ఎన్నికలకు కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను సోమవారం విడుదల చేసింది. మార్చి 29వ తేదీ నాటికి పదవీ కాలం ముగియనున్న మొత్తం ఐదు ఎంఎల్‌సి స్థానాలకు మార్చి 3వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఆ రోజు నుంచి మార్చి 10వ తేదీ వరకు తరువాయి 2లో




## పాకిస్థాన్‌లో హై అలర్ట్

### ఛాంపియన్స్ ట్రోఫీకి ఉగ్రదాడి గండం?

**కరాచీ:** శ్రీలంక జట్టుపై పాకిస్థాన్‌లో జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత.. ఆ దేశంలో పర్యటించేందుకు ఇతర దేశాల క్రికెట్ జట్లన్నీ వెనకడుగు వేశాయి. అయితే ఆ తర్వాత పాకిస్థాన్ చేసిన చాలా ప్రయత్నాల కారణంగా పలు జట్లు పాకిస్థాన్‌లో సిరీస్‌లు ఆడాయి. దాదాపు 26 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత పాకిస్థాన్‌లో తొలి ఐసిసి టోర్నమెంట్ ఛాంపియన్స్ ట్రోఫీ జరుగుతోంది. భారత్ మి నహా మిగితా జట్లు అన్నీ పాకిస్థాన్‌లోనే ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నాయి.అయితే టోర్నమెంట్ ప్రారంభమై తరువాయి 2లో





## జూన్ 6న లాసెట్, పిజి లాసెట్

- మార్చి 1వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ
- మే 12న ఇసెట్ పరీక్ష

ప్రజాపక్షం/హైదరాబాద్

లాసెట్ (3,5 సంవత్సరాల డిగ్రీ), పిజి లాసెట్ పరీక్షలను జూన్ 6న నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మంగళవారం విడుదల చేయనుంది. మార్చి 1వ తేదీ నుంచి దరఖాస్తులను ఆహ్వానించగా, ఏప్రిల్ 15 వరకు ఎటువంటి ఆలస్య తరువాయి 2లో

## అమెరికా డబ్బులు భారత్‌కు కాదు..
# బంగ్లాదేశ్ ఎన్నికల కోసమా?

**న్యూఢిల్లీ :** అమెరికాకు అంతర్జాతీయ అభివృద్ధి ఏజెన్సీ యుఎస్‌ఎయిడ్ నుంచి భారతదేశం ఎన్నికల్లో ప్రభావితం చేసేందుకు నిధులు ఇవ్వడంపై రాజకీయ దుమారం రేగుతున్న తరుణంలోనే, నిధులకు సంబంధించి తాజాగా ఆర్థిక మంత్రిత్వ శాఖ నివేదిక వెలువడింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో యుఎస్ ఎయిడ్ కింద ఏడు ప్రాజెక్టులకు 750 మిలియన్ అంచనాతో నిధులు ఇవ్వనున్నట్లు నివేదికలో బైటపడింది. ఆ నివేదికలో ‘‘ప్రస్తుతం ఆ ఏడు ప్రాజెక్టులు సుమారు 750 మిలియన్ డాలర్ల బడ్జెట్‌తో యుఎస్‌ఎయిడ్– భారత ప్రభుత్వ భాగస్వామ్యంతో అమలు చేస్తుంద’’ని పేర్కొన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 97 మిలియన్ డాలర్లు(సుమారు రూ.825 కోట్లు) యుఎస్‌ఎయిడ్ ఏడు ప్రాజెక్టుల కింద ఇచ్చిందని తెలిపింది. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్ ఎఫైర్స్ నోడల్ ఏజెన్సీగా ఉభయపక్షాల నిధుల విడుదలకు సంబంధించి 2023–24లో వెలువరించిన నివేదికల్లో కేటాయించిన ఆయా ప్రాజెక్టుల వివరాలు ఉన్నాయి. ఆ ఏడాదిలో యుఎస్‌ఎయిడ్ నిధులు అందించిన ప్రాజెక్టులలో ఓటర్ల శాతం పెంచడానికి సంబంధించి ఎలాంటి నిధులు ఇవ్వకపోగా, వ్యవసాయం, ఆహార భద్రత కార్యక్రమం, వాటర్ , సానిటైజేషన్, హైజిన్ (వాష్), పునరుత్పాదక విద్యుత్, విపత్తు నిర్వహణ,




ఆరోగ్యం, ప్రాజెక్టులకు నిధులు ఇచ్చారు. వాటితో పాటు సుస్థిర అడవులు, వాతావరణ అడాప్టేషన్ ప్రోగ్రామ్, విద్యుత్ ఆదా టెక్నాలజీ వ్యాపారీకరణ; ఇన్నోవేషన్ ప్రాజెక్టులు ఉన్నాయి.
భారత్‌లో రాజకీయ వివాదం : ఈ నెల తొలినాళ్ళలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెట్ ఎఫిషియెన్సీ (డోజ్)కి నేతృత్వం వహిస్తున్న ఎలన్ మస్క్ గతంలో భారతదేశంలో ఓటర్‌ల శాతం పెంచేందుకు కేటాయించిన 21 మిలియన్ డాలర్‌ల గ్రాంట్‌ను రద్దు చేసినట్లు ప్రకటించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైతం పదే పదే గత బైడెన్ పాలనలో 21 మిలియన్ డాలర్లు భారత్‌లో ఓటర్ల శాతం పెంచేందుకు ఇచ్చారని చెబుతూ వస్తున్నారు. విదేశాంగ వ్యవహారాల తరువాయి 12లో



# సవాళ్లను ఎదుర్కొంటూ ముందుకు

- ఎస్‌ఎల్‌బిసి టన్నెల్‌లో చిక్కుకున్న 8 మంది కార్మికులను రక్షించేందుకు ముమ్మరంగా సహాయక చర్యలు
- ఘటనాస్థలిలో పరిస్థితిని పర్యవేక్షించిన మంత్రి కోమటిరెడ్డి, మాజీమంత్రి కె. జానారెడ్డి

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి

ఎస్‌ఎల్‌బిసి టన్నెల్‌లో చిక్కుకున్న 8 మంది కార్మికులను రక్షించేందుకు మూడో రోజు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. అయితే పెద్ద ఎత్తున ఊటనీరు ఉబికి వస్తుండటంతో నీరు బురదతో కలిసి పెద్ద ఎత్తున బయటకొస్తుంది. దీంతో ఆదివారం నాడు 13 కిలోమీటర్ల లోపలికి చేరుకున్న రెస్క్యూ బృందం.. సోమవారం నాడు 11 కిలోమీటర్ల వరకు మాత్రమే వెళ్లగలిగింది. అక్కడి నుంచి బురద నీరు పెద్ద మొత్తంలో వస్తుండటంతో సహాయక చర్యలు చేపట్టడానికి వీలు కావడం లేదు. 24 గంటల్లోనే నీటి ధారలు ఎక్కువ కావడాన్ని గుర్తించారు. దీంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ఫలితంగా లోపలికి రెస్క్యూ బృందం వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. వీటన్నింటినీ అధిగమించేందుకు మద్రాస్ ఐఐటీ నిపుణులు తీసుకువచ్చిన కొత్త పరికరాలపైనే ఆశలు నెలకొన్నాయి. వీరితో పాటు ఆర్మీ ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ టీమ్‌తో పాటు మిగతా బృందాలు నిర్విరామంగా సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. డిజాస్టర్ మేనేజ్మెంట్ చీఫ్ కమిషనర్ అరవింద్ కుమార్, హైడ్రా కమిషనర్ తరువాయి 2లో





## రైతుల ఖాతాల్లోకి పిఎం కిసాన్ నిధులు

- 19వ విడత నిధులను విడుదల చేసిన ప్రధాని మోదీ
- 9.8 కోట్ల మందికి లబ్ధి

**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్రమోదీ ‘పిఎం కిసాన్ సమ్మాన్ నిధి’ స్కీమ్ కింద 19వ విడత నిధులను విడుదల చేశారు. బిహార్ రాష్ట్రంలోని భాగల్పూర్‌లో జరిగిన సమావేశం నుంచి ఈ నిధుల విడుదల చేశారు. ఈ ఏడాది ఆఖరులో బిహార్ అసెంబ్లీ తరువాయి 2లో

## జర్మనీ ఎన్నికల్లో కన్జర్వేటివ్ సిడియు గెలుపు

- ఫ్రెడరిక్ మెర్జ్ భాగస్వామి పార్టీగా షుల్జ్ ఎస్‌డియు?
- మితవాద పార్టీ ఎఫ్‌డిని తిరస్కరించిన ఓటర్లు
- 64 సీట్లు గెలిచిన వామపక్ష డీ లింకే

**బెర్లిన్ :** జర్మనీ పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో సంప్రదాయ కన్జర్వేటివ్ సిడియు–సిఎస్‌యు సోదర పార్టీలు విజయం సాధించాయి. ఈ గెలుపుతో యూరో కరెన్సీ భారీగా పుంజుకుంది. జర్మనీ స్టాక్‌మార్కెట్ కూడా బాగా లాభపడింది. ఛాన్స్‌లర్, ఎస్‌డియు నాయకుడు ఓలాఫ్ షుల్జ్ ఎన్నికల్లో తన ఓటమి అంగీకరించారు. ఈ ఎన్నికలు తమకు చేదు అనుభవాన్ని మిగిల్చాయన్నారు. పార్లమెంటులో సిడియు–సిఎస్‌యు సోదర పార్టీలు ఒకే పార్లమెంటరీపార్టీగా వ్యవహరిస్తాయి. సర్వేల్లో ముందస్తు అంచనాల ప్రకారమే సిడియు–సిఎస్‌యు పార్టీ నాయకుడు ఫ్రెడరిక్ మెర్జ్ ఛాన్సలర్ కాబోతున్నారు. పచ్చిమితవాద, ఫాసిస్టు అనుకూల ఎఎఫ్‌డి అధికార కాంక్షలను ప్రజలు తిరస్కరించారు. ఎఎఫ్‌డిని మెర్జ్ దూరం పెట్టడంవల్ల తదుపరి భాగస్వామ్యపార్టీని ఎంచుకునే చర్చల ప్రక్రియ సిడియు–సిఎస్‌యులకు సంక్లిష్టంగా మారే అవకాశం ఉంది. 630 స్థానాలున్న బుందేస్టాగ్ ప్రజాప్రతినిధులసభలో ఈ పార్టీ 28.6 శాతం ఓట్లు సాధించి 208 స్థానాలు గెలుచుకుంది. ఈ పార్టీకి తరువాయి 12లో



## టచ్‌లో 32 మంది ఆప్ ఎమ్మెల్యేలు!

### పంజాబ్ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు ప్రతాప్ సింగ్ బజ్వా సంచలన వ్యాఖ్యలు

**చండీగఢ్ :** కాంగ్రెస్, ఆప్ నేతల మధ్య పరస్పర ఆరోపణలు పంజాబ్ రాజకీయాల్లో ప్రకంపనలు రేపుతున్నాయి. అధికార ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 32మంది ఎమ్మెల్యేలు, మంత్రులు తనతో టచ్‌లో ఉన్నట్లు ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ప్రతాప్ సింగ్ బజ్వా సంచలన వ్యాఖ్యలు చేశారు. మరికొందరు ఆప్ ఎమ్మెల్యేలు బిజెపితో కూడా టచ్‌లో ఉండే అవకాశం ఉందని ఆరోపించారు. ‘ఇదే విషయం మళ్లీ చెబుతున్నా.. తరువాయి 12లో

# అమెరికా నుండి స్వాతంత్య్రం పొందుదాం



## యూరప్‌కు జర్మనీ గొప్పనాయకత్వానిస్తుంది

### సిడియు నేత ఫ్రెడరిక్ మెర్జ్ పిలుపు

**బెర్లిన్ :** యూరప్‌ను నిర్లక్ష్యం చేసిన అమెరికా నుండి దశలవారీగా స్వాతంత్య్రం పొందాలని జర్మనీ ఎన్నికల్లో విజయం సాధించిన కాబోయే ఛాన్సలర్, సిడియు–సిఎస్‌యు నాయకుడు ఫ్రెడరిక్ మెర్జ్ పిలుపు ఇచ్చారు. జర్మనీ నుండి యూరప్‌కు బ్రహ్మాండమైన నాయకత్వాన్ని అందిస్తామన్నారు. యూరప్ ఎప్పుడూ ఉక్రేన్ పక్షానే ఉంటుందని, ఉక్రేన్‌కు ఇచ్చే నిధులను భారీగా పెంచుతామని మెర్జ్ ఉద్ఘాటించారు. అమెరికా–యూరప్ సంబంధాల్లో భూప్రకంపనలస్థాయి మార్పులు సంభవిస్తాయన్న సంకేతాలు ఇచ్చారు. యూరప్ ఖండాన్ని అమెరికా నిర్లక్ష్యం చేస్తోందనీ, అందరితో సమానంగానే చూస్తోందనీ, అందువల్ల యూరప్‌ఖండ దేశాలు రక్షణరంగం విషయంలో అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని ఫ్రెడరిక్ మెర్జ్ కోరారు. నాటో కూటమి ఇప్పుడున్నవిధంగా భవిష్యత్తులో కొనసాగుతుందన్న భరోసా లేదని, అందువల్ల రక్షణ విషయంలో కూడా ఆయన అన్నారు. ఐతే భవిష్యత్తులో నాటో సభ్యత్వాన్ని జర్మనీ తోసిపుచ్చేందుకు మాత్రం ఆయన తిరస్కరించారు. ఎన్నికల్లో విజయానంతరం మెర్జ్ చెప్పిన మాటలు అమెరికా–యూరప్ మధ్య సంబంధాల్లో రాబోయే కాలంలో భారీ మార్పులకు దారితీసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడుగా డోనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టిన తర్వాత సుంకాల విషయంలో, ఉక్రేన్‌లో యుద్ధాన్ని ముగించే విషయంలో తలెత్తిన విభేదాలు రియాద్‌లో చర్చల అనంతరం మరింత ముదిరాయి. రాబోయేకాలంలో ప్రపంచ పరిణామాలలో మార్పులు సంభవిస్తాయని, ఉక్రేన్‌పక్షాన బలమైన మద్దతుదారుగా ఉండాలని పారిస్‌లో యూరోపియన్ యూనియన్ నాయకులు సమావేశమై ఒక అభిప్రాయానికి వచ్చిన తర్వాత జర్మనీ ఎన్నికల ఫలితాలు మరిన్ని మార్పులకు దారితీస్తాయని భావిస్తున్నారు.

**వలసల శాశ్వత నియంత్రణ**

**పన్నులభారాల్లో కోత**

సరిహద్దుల వెలుపలి నుండి జర్మనీలోకి అక్రమంగా వలసల చొరబాట్లను శాశ్వతంగా నియంత్రిస్తానని ఫ్రెడరిక్ మెర్జ్ ప్రజలకు హామీ ఇచ్చారు. ఎన్నికల్లో విజయానంతరం ఆయన మాట్లాడుతూ, అక్రమంగా ఎవ్వరినీ దేశంలోకి రానివ్వబోమన్నారు. ఆర్థిక సమస్యలను పరిష్కరిస్తామని, ప్రజలపై ధరల భారాలు లేకుండా చూస్తామని భరోసా ఇచ్చారు. పన్నులలో కోతలు విధిస్తామని, పన్నుల భారం తగ్గించి సంక్షేమపథకాల ఖర్చులను 41 బిలియన్ పౌండ్ల మేరకు తగ్గించేస్తామని చెప్పారు. దేశ ఆర్థిక సంక్షోభ నియంత్రణ చర్యలు ఇకమీదట ప్రారంభం అవుతాయన్నారు. ఐతే ఆర్థిక విశ్లేషకులు మాత్రం మెర్జ్ మాటలకు భిన్నంగా స్పందిస్తున్నారు. అమెరికా నుండి స్వతంత్రంగా బతకడం అంత సులభం కాదని అంటున్నారు. జర్మనీలో గడచిన రెండు సంవత్సరాలుగా ఆర్థిక సంక్షోభం ఉంది. ఈ ఏడాది ఆర్థికవృద్ధి కేవలం .0.3 శాతంగానే కనిపిస్తోంది. కరోనా తర్వాత చిన్న, మధ్యతరహా పరిశ్రమలు దెబ్బతిన్నాయి. దీనికితోడు కొత్త ప్రభుత్వం పన్నుల భారాలు పెంచుతానని స్పష్టం చేసింది. జర్మనీ నుండి ఎగుమతులతోపాటు లాభాలు కూడా తగ్గుముఖం పట్టాయి. నిరుద్యోగం పెరిగింది.

ప్రపంచం

# రాజీనామాకు సిద్ధం:జెలెన్‌స్కీ




## కీవ్ వెళ్ళి సంఘీభావం ప్రకటించిన యూరప్ నేతలు

**కీవ్ :** యుద్ధం సమసిపోయి శాంతి చేకూరుతుందని చెబితే రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అన్నారు. నాటో సభ్యత్వం ఇస్తామని నాటో కూటమి తమకు భరోసా ఇవ్వాలని ఆయన కోరారు. ఉక్రేన్‌లో రష్యా యుద్ధం ప్రారంభించి సోమవారంనాటికి మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జరిగిన సదస్సులో జెలెన్‌స్కీ మాట్లాడారు. తమ సార్వభౌత్వంకోసం, ఉనికిని కాపాడుకోవడంకోసం మూడు సంవత్సరాలపాటు ఉక్రేన్ విజయవంతంగా రష్యాతో పోరాటం పూర్తిచేసిందని అన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని యూరోపియన్ దేశాల నాయకులు కూడా కీవ్‌కు చేరుకున్నారు. జెలెన్‌స్కీకి సంఘీభావం ప్రకటించారు. అక్కడి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పుతిన్ తమకు శాంతిని ఇవ్వరనీ, బదులుగా ఏదైనా తీసుకునే నాగానీ ఆయన మనకు శాంతి చేకూర్చరనీ, మనందరం ఐక్యంగా తెలివితేటలతో మసలుతూ శాంతిని సాధించుకోవాలని జెలెన్‌స్కీ అన్నారు. ఈ కొత్త సంవత్సరం దీర్ఘకాలిక, సంపూర్ణశాంతికి ఒక ఆరంభంగా మారాలని ఆయన కోరారు. యూరోపియన్ యూనియన్ కమిషన్ అధినేత్రి ఉర్సులా వాండర్ లేయన్ మాట్లాడుతూ, రష్యాకు మద్దతు ఇవ్వడానికి బదులుగా శాంతిసాధనకు ట్రంప్ కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఉక్రేన్‌కు యూరోపియన్ యూనియన్ నుండి 35 బి.డాలర్ల సహాయ ప్రకటన లభించింది. కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో, స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో శాంఛెజ్, డెన్మార్క్, స్వీడన్, నార్వే, లిథుయేనియా, లాత్వియా, ఎస్తోనియా దేశాల నాయకులు కూడా ఉక్రేన్ రాజధాని కీవ్‌కు వెళ్ళి జెలెన్‌స్కీకి తమ సంఘీభావం ప్రకటించారు. 14 దేశాల నాయకులు ఈ సదస్సులో పాల్గొంటారనీ, మరో 20 దేశాల నాయకులు దృశ్యమాధ్యమ పద్ధతులలో పాల్గొంటారని తొలుత జెలెన్‌స్కీ ప్రకటించారు. జెలెన్‌స్కీని నియంతగా పేర్కొంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విమర్శలు గుప్పించడం, ఉక్రేన్‌లో శాంతికి సంబంధించి రష్యాతో జరిగిన అమెరికా చర్చల్లో జెలెన్‌స్కీని భాగస్వామిగా చేయకపోవడం, ఈ చర్చల్లో ఉక్రేన్ భాగస్వామ్యం అవసరం లేదని ట్రంప్ నిర్మొహమాటంగా చెప్పడం వంటి పరిణామాల నేపథ్యంలో యూరప్ నాయకులు ఉక్రేన్‌పై మరింత శ్రద్ధ చూపిస్తున్నారు. జర్మనీ కొత్త నాయకుడు ఫ్రెడరిక్ మెర్జ్ కూడా ఉక్రేన్‌కు పూర్తి అండగా ఉంటామని, ఆ దేశానికి సహాయం పెంచుతామని ప్రకటించారు.

**రష్యాపై 16వ విడత ఆంక్షలు అమలు**




రష్యాపై యూరప్ దేశాలు విధించిన మరిన్ని ఆంక్షలు సోమవారం నుండీ అమలులోకి వచ్చాయి. పారిస్‌లో యూరోపియన్ యూనియన్ నాయకుల సమావేశంలో నిర్ణయించిన ప్రకారం ఫిబ్రవరి 24 నుండి 16వ విడత ఆంక్షలు రష్యాపై అమలులోకి వచ్చాయి. గడచిన మూడు సంవత్సరాలుగా రష్యాపై అనేక రకాల ఆంక్షలను ప్రపంచవ్యాప్తంగా యూరోపియన్ యూనియన్ అమలు చేస్తున్నది. రష్యా నుండి అల్యూమినియం దిగుమతులపై తాజా ఆంక్షలు అమలులోకి వచ్చాయి. రష్యా నౌకలు ఇతర దేశాల నౌకల ముసుగులో వారి జెండాలతో రహస్యంగా సరుకులను నౌకల్లో తరలిస్తూ మోసపూరితంగా ప్రవర్తిస్తోందనీ, ఆంక్షలు తప్పించుకుంటున్నదని యూరోపియన్ దేశాలు విమర్శిస్తున్నాయి. దీంతో ఇప్పటివరకూ రష్యాపై విధించిన ఆంక్షలసంఖ్య 153కు చేరింది.

# నరేందర్‌రెడ్డికి వామపక్షాల మద్దతు

## సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ



**ప్రజాపక్షం/నిజామాబాద్‌ప్రతినిధి :** కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి వామపక్షాల మద్దతు ఉంటుందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని భూమారెడ్డి కన్వెన్షన్‌లో జరిగిన ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా సిఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సమ్మేళనంలో పశ్య పద్మ మాట్లాడుతూ నిధులు, నియామకాలు అని చెప్పి పదేళ్లు మభ్యపెట్టిన బిఆర్ఎస్‌ను ప్రజలు ఓడించారని, మతం పేరిట రాజకీయాలు చేసే బిజెపి అభ్యర్థులను ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓడించాలన్నారు. మన భవిష్యత్‌ను మనమే నిర్మించుకుందామని అందుకు నిరుద్యోగులు, ఉద్యోగులు ఒక్కటై మతతత్వ పార్టీలను ఓడించాలన్నారు. పట్టభద్రులు ఓటును ఆయుధంగా మలుచుకుని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. సిపిఐతో పాటు సిపిఐ(ఎం) వామపక్ష పార్టీలు నరేందర్‌రెడ్డికి మద్దతుగా ఆయన గెలుపును కాంక్షిస్తూ పని చేయాలని నిర్ణయం తీసుకున్నాయన్నారు. వామపక్ష భావాలున్న ప్రతిఒక్కరూ నరేందర్‌రెడ్డికి ఓటు వేయడమే కాకుండా ఓటు వేయించాలని వామపక్ష పార్టీగా కోరుతున్నామన్నారు. మన జీవితాలు బుగ్గిపాలు కాకుండా ఉండాలంటే రాజ్యాంగం మనకు కల్పించిన హక్కు ఓటు అని, ఆ ఓటు ద్వారా బిజెపి నాయకులకు బుద్ధి చెప్పాలన్నారు. నరేందర్‌రెడ్డి విజయం కోసం పని చేయాలన్నారు.

# 2000 మంది యుఎస్ఎయిడ్ ఉద్యోగులపై ట్రంప్ వేటు




**వాషింగ్టన్ :** ప్రపంచంలో వివిధ దేశాల అభివృద్ధికి,మానవతా సహాయ కార్యక్రమాలకు ఉద్దేశించిన యుఎస్ఎయిడ్ (యునైటెడ్ స్టేట్స్ ఏజన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డవలప్‌మెంట్)ను నిలిపివేసిన తర్వాత అందులో పనిచేసే దాదాపు 2000 మంది ఉద్యోగులపై అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వేటు వేశారు. ఎంపికచేసిన కొంతమంది ఉద్యోగులను తప్ప ప్రపంచవ్యాప్తంగా యుఎస్ఎయిడ్ సంస్థలో పనిచేస్తున్న వేలాదిమంది ఉద్యోగులను సెలవుమీద పంపించారు. అమెరికా ప్రభుత్వం పనితీరు సామర్థ్యాన్ని పెంచేందుకు ఎలాన్‌మస్క్ సారథ్యంలో ఏర్పాటు చేసిన కొత్త మంత్రిత్వశాఖ సలహాల మేరకు ట్రంప్ ఈ తాజా నిర్ణయం తీసుకున్నారు. పొదుపు చర్యల్లో భాగంగా ఫెడరల్ ఉద్యోగులను స్వచ్ఛంధ పదవీ విరమణ పథకాన్ని తీసుకోవాలని ప్రోత్సహించారు. వివిధ దేశాలు వసూలు చేస్తున్న సుంకాలతో సమానంగా కొత్త సుంకాల విధింపు విధానం అమలు చేసినందువల్ల రాబోయేకాలంలో భారీ ఎత్తున అమెరికాకు టారిఫ్‌ల రూపంలో పెద్దమొత్తంలో కరెన్సీ వచ్చి చేరుతుందని ట్రంప్ ఎంతో ఆశాభావంతో ఉన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో అమెరికాలో పనిచేసే యుఎస్ఎయిడ్ ఉద్యోగులపై ట్రంప్ వేటు వేశారు. ఫెడరల్ న్యాయమూర్తి ఒకరు గడచిన శుక్రవారంనాడు అనుమతి ఇవ్వడంతో ట్రంప్ ప్రభుత్వం ఇక ఆలస్యం చేయకుండా తన నిర్ణయాన్ని అమలు చేసింది.

# ఇజ్రాయెల్–హమాస్ మధ్య మళ్ళీ ఉద్రిక్తత

## యుద్ధానికి సిద్ధం: చర్చలు ఉండవ్

### నేతన్యాహూ, హమాస్ పరస్పర ప్రకటనలు



**టెల్‌అవీవ్ :** ఏక్షణంలోనైనా గాజాలో తిరిగి యుద్ధం చేపట్టేందుకు వీలుగా తమ సైన్యాలను సిద్ధం చేశామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నేతన్యాహూ ప్రకటించారు. ఒప్పందం ప్రకారం 620 మంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేసేవరకూ తదుపరి ఒప్పందంపై చర్చలకు తావు లేదని హమాస్ కూడా ప్రకటించింది.ఉద్దేశపూర్వకంగానే ఖైదీల విడుదలను ఇజ్రాయెల్ జాప్యం చేస్తోందని హమాస్ విమర్శించింది. దీంతో మళ్ళీ యుద్ధ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. హమాస్–ఇజ్రాయెల్ మధ్య మొదటి విడత కాల్పుల విరమణ ఒప్పందం మార్చి 2వ తేదీతో ముగుస్తున్న తరుణంలో ఖైదీల మార్పిడి విషయంలో హమాస్‌తో నేతన్యాహూ కొత్త షరతులు విధించారు. దీంతో అంతంతమాత్రంగా ఉన్న ఒప్పందం అమలు పూర్తిగా సంక్షోభంలో పడింది. హమాస్ ఉగ్రవాద సంస్థ ఆరుగురు బందీలను విడుదల చేసినప్పటికీ అందుకు ప్రతిగా 620 మంది ఖైదీలను శనివారంనాడు నేతన్యాహూ విడుదల చేయకుండా కొత్త షరతు విధించారు. దీంతో హమాస్ సంస్థ తీవ్ర ఆగ్రహంతో ఉంది. ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘించిందని విమర్శించింది. ఈ పరిస్థితుల్లో నేతన్యాహూ సోమవారంనాడు మాట్లాడుతూ, అసలు హమాస్ ఉగ్రవాద సంస్థే ఒప్పందాన్ని పదే పదే ఉల్లంఘించిందనీ, అందువల్లనే 620 మంది బందీలను శనివారంనాడు విడుదల చేసే ప్రక్రియలో జాప్యం జరిగిందని అన్నారు. ఎలాంటి షరతులూ లేకుండా హమాస్ వద్ద ఉన్న మొత్తం బందీలందరినీ విడుదల చేయాలని, గాజాను హమాస్ పరిపాలించడానికి వీలులేదని నేతన్యాహూ అన్నారు. ఇంకా హమాస్ వద్ద 60 మంది ఇజ్రాయెలీ బందీలు ఉన్నట్లు సమాచారం. ఐతే వీరిలో కేవలం 30 మంది మాత్రమే సజీవంగా ఉన్నారని ఇజ్రాయెల్ కూడా గట్టిగా నమ్ముతున్నది. బందీలందరినీ విడుదల చేస్తేనే గాజా నుండి తమ సైన్యాన్ని ఉపసంహరిస్తామని నేతన్యాహూ చెప్పారు. ఇదిలా ఉండగా, ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయెల్ దాడులు ఉధృతం అయ్యాయి. ప్రజల ఇళ్ళను, ప్రభుత్వ, సామూహిక నిర్మాణాలను ధ్వంసం చేసే కార్యక్రమాన్ని బుల్‌డోజర్లతో నిరాఘాటంగా కొనసాగిస్తున్నది. ఈ ప్రక్రియలో ఇప్పటివరకూ అనేక మంది పాలస్తీనయన్లు మరణించారు.

## పిఎం కిసాన్ నిధులు

**(మొదటి పేజీ తరువాయి)**

ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పిఎం కిసాన్ నిధుల విడుదలకు బిహార్‌ను వేదికగా చేసుకున్నట్లు తెలుస్తోంది. తాజాగా ప్రధాని విడుదల చేసిన పిఎం కిసాన్ నిధులతో దేశవ్యాప్తంగా 9.8 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. 19వ విడత పిఎం కిసాన్ స్కీమ్ కింద ప్రధాని మొత్తం రూ.22,700 కోట్ల నిధులను విడుదల చేశారు. కాగా, ప్రధాని పర్యటన నేపథ్యంలో బిహార్‌లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. భాగల్‌పూర్ జిల్లా కలెక్టర్, ఎస్‌పి, సీనియర్ అధికారులు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రధాని సమక్షంలో జరిగిన ఈకార్యక్రమానికి పలువురు కేంద్ర మంత్రులు, బిహార్ ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలు **(మొదటి పేజీ తరువాయి)**

నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుంది. మార్చి 11వ తేదీన నామినేషన్ల పరిశీలన, 13వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ, అవసరమైతే మార్చి 20వ తేదీన పోలింగ్ జరుగుతుంది. ఓట్ల లెక్కింపు మార్చి 20వ తేదీన జరుగుతుందని ఎన్నికల కమిషన్ వివరించింది. రాష్ట్రంలో బిఆర్ఎస్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మహ్మద్ మహమూద్ అలీ, శేరి సుభాష్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, కొద్ది నెలల కింద బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎగ్గె మల్లేశం, ఎమ్ఐఎమ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మీర్జా సహన్ పదవీ కాలం మార్చి 29వ తేదీ నాటికి ముగియనుంది. తాజా రాజకీయ పరిణామాలు, ఎంఎల్‌ఎల సంఖ్య బలాన్ని పరిశీలిస్తే ఈ ఎన్నికల్లో నాలుగు సీట్లను అధికార కాంగ్రెస్, ఒక స్థానాన్ని ప్రతిపక్ష బిఆర్ఎస్ దక్కించుకునే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా మరో తెలుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ఐదు ఎంఎల్‌సి స్థానాలకు కూడా తెలంగాణాతో పాటే ఎన్నికల నిర్వహణకు కమిషన్ షెడ్యుల్‌ను విడుదల చేసింది. ఎపిలో యనమల రామకృష్ణుడు, జంగా కృష్ణమేర్తి, పి.అశోక్‌బాబు, తిరుమల నాయుడు, దువ్వారపు రామారావు ల పదవీకాలం కూడా మార్చి 29వ తేదీతోగా ముగియనుంది.

## లాసెట్, పిజి లాసెట్ **(మొదటి పేజీ తరువాయి)**

రుసుము లేకుండా దరఖాస్తులను స్వీకరించనున్నారు. రూ.500ల ఆలస్య రుసుముతో ఏప్రిల్ 25 వరకు, ఆ తర్వాత రూ. వెయ్యి ఆలస్య రుసుముతో మే 5వ తేదీ వరకు, రూ. 2వేలతో మే 15 వరకు, రూ. 4వేల ఆలస్యరుసుముతో మే 25వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. దరఖాస్తులను సవరించుకునేందుకు మే 20వ తేదీ నుంచి 25వ తేదీ వరకు అవకాశం కల్పించారు. మే 30న హాల్ టికెట్లను విడుదల చేస్తారు. జూన్ 6న కీ విడుదల, దీనిపైన జూన్ 14లోపు అభ్యంతరాల స్వీకరణ, జూన్ 25న ఫలితాలను వెల్లడించనున్నారు. కాగా టిజి పిజి ఇసెట్ పరీక్షను మే 12న నిర్వహించనున్నారు. మార్చి 3 నుంచి ఏప్రిల్ 19 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. మే 12న పిజిఇసెట్ పరీక్ష జరగనుంది. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షను నిర్వహించనున్నారు. ఈసెట్ నోటిఫికేషన్ మంగళవారం విడుదల కానుంది.

## పాకిస్థాన్ హైఅలర్ట్ **(మొదటి పేజీ తరువాయి)**

వారం రోజులు కూడా కాకముందే పాక్‌లో ఉగ్రవాద సంస్థలు తమ వక్రబుద్ధిని బయటపెట్టాయి. ఛాంపియన్స్ ట్రోఫీని టార్గెట్ చేస్తూ ఉగ్రదాడి జరిగే అవకాశం ఉందని పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ బ్యూరో ప్రకటన విడుదల చేసింది. దీంతో పాకిస్థాన్ మొత్తం హైఅలర్ట్‌లోకి వెళ్లిపోయింది. ఓ ఆంగ్ల పత్రిక కథనం ప్రకారం ఛాంపియన్స్ ట్రోఫీ చూసేందుకు వచ్చే అతిథులను తరీక్‌ఏతాలిబన్, ఐసిస్‌తో పాటు బలుచిస్థాన్‌కు సంబంధించిన పలు ఉగ్రమూకలు కిడ్నాప్ చేసే ప్రమాదం ఉందని సమాచారం. దీంతో పాకిస్థాన్‌లోని ప్రధాన ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ఇక ఛాంపియన్స్ ట్రోఫీకి అతిథ్యమిస్తున్న పాకిస్థాన్ జట్టు టోర్నమెంట్‌లో మాత్రం పేలవ ప్రదర్శన చేస్తోంది. న్యూజిలాండ్‌తో జరిగిన ఆరంభ మ్యాచ్‌లో 60 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఆ తర్వాత ఆదివారం భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ అద్భుతమైన బ్యాటింగ్‌తో చెలరేగిపోవడంతో ఆ మ్యాచ్‌ను కూడా చేజార్చుకొని సెమీస్ ఆశల్ని కోల్పోయింది.

## ముందుకు

**(మొదటి పేజీ తరువాయి)**

రంగనాథ్, నాగర్ కర్నూల్ ఎస్పీ గైక్వాడ వైభవ్ నిపుణులతో చర్చించి ఎప్పటికప్పుడు సహాయక చర్యలను సమీక్షిస్తున్నారు. మంత్రి కోమటిరెడ్డి ఇతర ప్రజాప్రతినిధులు కూడా ఘటనా స్థలిలో పర్యటించారు. లోపల చిక్కుకున్న వారిని ఎట్టి పరిస్థితుల్లో బయటికి తీసుకొస్తామని మంత్రి కోమటిరెడ్డి ప్రకటించారు.

**ఆక్వా ఐ.. ఫ్లెక్సీ ప్రోబ్ పరికరాల మీదే ఆశలు...**

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు అత్యాధునిక పరికరాలను వాడుతున్నారు. మద్రాస్ ఐఐటీకి చెందిన సాంకేతిక నిపుణుల సహకారంతో లోపల చిక్కుకున్న వారిని గుర్తించి రెస్క్యూ చేయనున్నారు. ఐఐటి నిపుణులు ప్రత్యేకంగా తీసుకువచ్చిన ఆక్వా ఐ కెమెరా హై రిజల్యూషన్ ది. ఇది నీటిలో సుమారు 50 మీటర్ల చుట్టుపక్కల ఉన్న వాటిని గుర్తిస్తుంది. బురద ఇతర ఏమున్నప్పటికీ కూడా గుర్తించి రికార్డింగ్ చేస్తుంది. ఈ కెమెరా వల్ల లోపల చిక్కుకున్న వారి పరిస్థితిని గమనించనున్నారు. గతంలో చాలా చోట్ల ఇలాంటి టెక్నాలజీనే వాడారు. ప్రస్తుతం ఎస్ఎల్‌బీసీ సొరంగంలో కూడా ఇలాంటి టెక్నాలజీ ఉపయోగించి రెస్క్యూ ఆపరేషన్ చేపడుతున్నారు. ఉత్తరాఖండ్‌లో జరిగిన ప్రమాదంలో ఇదే టీం దాదాపు 34 మందిని రక్షించింది. ఇదే టెక్నాలజీ ద్వారా సహాయక చర్యలు వేగవంతం చేయాలని భావిస్తున్నారు. ఈ కెమెరా లోపలికి పంపించి ఆ చిత్రాల ఆధారంగా ఏం చేయాలని దానిపై నిపుణులు ఇచ్చిన సూచనలను పాటించి రెస్క్యూ చేసే అవకాశం ఉంది. మరోవైపు హై రిజల్యూషన్ కలిగిన కెమెరాలను కూడా పంపిస్తున్నారు. ఈ కెమెరాలు లోపల ఉన్న ప్రతి అంగుళాన్ని కూడా చిత్రీకరించి బయట ఉన్న వారికి లైవ్ గా అందిస్తోంది. మరోవైపు ఎనిమిది మందిని చిక్కుకున్న వారిని గుర్తించేందుకు ప్రత్యేక జాగిలాలను కూడా రంగంలో దించారు.

**టన్నెల్లో చిక్కుకున్నవారిని గుర్తించేందుకు స్లీపర్‌డాగ్‌ల సేవలు** ...ఎస్ఎల్‌బిసి దోమలపెంటవద్ద జరిగిన ప్రమాదంలో చిక్కుకున్నవారిని వెలికితీయడానికి కేంద్ర,రాష్ట్రవిపత్తు బృందాలతోపాటు ఆర్మీ, నేవీ, సింగరేణి, కేంద్రప్రభుత్వ రహదారుల విభాగం, జెపి, నవయుగలకు చెందిన ఉన్నతాధికారుల బృందం ఇప్పటివరకు ఏడుసార్లు టన్నెల్‌లో తనిఖీలు నిర్వహించాయి. వీరిబృందంలో దాదాపు 584 నిపుణులైన సిబ్బంది ఉన్నారు. ఉత్తరాఖండ్‌లో జరిగిన విపత్తులలో ఈబృందాలు రెస్క్యూ ఆపరేషన్‌లను సమర్థవంతంగా నిర్వహించాయి. వీరితోపాటు 14మంది ర్యాట్‌మైనర్స్‌ల సేవలను ముమ్మరంగా ఉపయోగిస్తున్నారు. టన్నెల్‌లో ఉన్నవారి ఆచూకి తెలుసుకునేందుకు స్నిఫర్‌డాగ్స్‌లను కూడా రప్పించారు. అయితే నీరు ఉన్నందున ఈ స్నిఫర్‌డాగ్స్ లోపలికి వెళ్లలేకపోయాయి. ఇప్పటికే డ్యామేజైన కన్వేర్ బెల్ట్‌కు మరమ్మతులు చేపట్టారు. టన్నెల్‌లో లోపలికి పైనుండి రంధ్రంచేసి లోపలికి వెళ్లాలన్న ప్రతిపాదనను తోసిపుచ్చారు. ఐదుగ్యాస్ కట్టింగ్‌మిషన్లు రేయింబవళ్లు పనిచేస్తున్నాయి. టన్నెల్‌లో సహాయ కార్యక్రమాలను రాష్ట్రరోడ్లు, భవనాలశాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉదయంనుండి దోమలపెంట ప్రాజెక్టుసైట్‌లో ఉండి పర్యవేక్షిస్తున్నారు. జెపి కార్యాలయంలో సహాయ కార్యక్రమాలపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

**కార్మికుల సంరక్షణ ప్రభుత్వధ్యేయం : కోమటిరెడ్డి**

నాగర్‌కర్నూల్ జిల్లా శ్రీశైలం ఎడమగట్టు ఎస్ఎల్‌బిసి ప్రమాదఘటనపై సోమవారం కొనసాగుతున్న సహాయక చర్యలను మాజీమంత్రి జానారెడ్డితోకలిసి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే వీరారెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్‌లు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో సహాయక చర్యలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్ఎల్‌బిసి సంఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందర్శించలేదని కెటిఆర్ సంస్కారహీనమైన మాటలు మాట్లాడుతున్నారని మంత్రి ఘాటుగా విమర్శించారు. మీతండ్రిలాగా ఫామ్‌హౌస్‌లో పడుకునే నైజం మానాయకుడిది కాదని, 15నెలలనుండి రాష్ట్రంలో ఎక్కడ ఏ చిన్న సమస్య ఉన్న 24గంటలు స్పందించే చురుకైన మహానాయకుడు సిఎం అని గుర్తుచేశారు. ప్రతిపక్షపాత్ర పోషించడంలోకూడా టిఆర్ఎస్ పార్టీ నాయకత్వం విఫలంచెందిందని, కెసిఆర్ సొంత నియోజకవర్గ ప్రజలను కూడా పట్టించుకోవడంలేదని, కేవలం ఫామ్‌హౌస్‌కి పరిమితమై ప్రజా సమస్యలపై మాట్లాడే సోయిలేదని మండిపడ్డారు. మాజీమంత్రి జానారెడ్డి మాట్లాడుతూ ఎస్ఎల్‌బిసి సంఘటన విచారకరమన్నారు. గత మూడురోజులుగా జరుగుతున్న పరిణామాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రమంత్రులను ఉన్నతాధికారులను నిత్యంఫోన్ ద్వారా వివరాలు సేకరిస్తూ పలు సూచనలు సలహాలు అందిస్తూ సహాయక చర్యలను మరింత ముమ్మరం చేయాలని ఆదేశిస్తున్నారని చెప్పారు. ఎస్ఎల్‌బిసి సొరంగంలో ఇరుక్కుపోయిన ఎనిమిదిమందిని కూడా రక్షించేందుకు ప్రభుత్వం తరపున సర్వశక్తులు ఒడ్డి కాపాడేందుకు రెస్క్యూటీమ్ నిర్విరామంగా పనిచేస్తుందన్నారు. మీడియాకూడా వాస్తవాలను తెలిపేలా ముందుకు వెళ్లాలన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమావేశంలో ఉన్నప్పటికి కూడా ఇక్కడి సంఘటనపై తగిన సలహాలు ఇస్తున్నామన్నారు. నిత్యం మంత్రులను ఘటనస్థలానికి వెళ్లి పర్యవేక్షించి సహాయక చర్యలు మరింతవేగం చేసేలా, రెస్క్యూ ఆపరేషన్ వేగవంతం చేసేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

## ఓడించే కుట్ర

**(మొదటి పేజీ తరువాయి)**

నిరూపించుకోవాలన్నారు. పదేళ్ల కెసిఆర్, పన్నెండేళ్ల మోదీ పాలనలో చేసిన నిర్లక్ష్యాన్ని పది నెలల్లోనూ ప్రజల ఆకాంక్షలను, ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. 35 వేల టీచర్ల బదిలీలు, 22 వేల ప్రమోషన్లు కల్పించామన్నారు. పదేళ్లలో కెసిఆర్ డీఎస్సీ, టెట్ నిర్వహించలేదని, సింగిల్ టీచర్ పాఠశాలలు మూసివేస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే పదకొండు వేల టీచర్ ఉద్యోగాలు నియామకం చేసింది నిజం కాదా? అని ఆలోచించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తారీకునే జీతాలు ఇస్తున్నది నిజం కాదా? అని ప్రశ్నించారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలనే ఉద్దేశ్యంతో క్రీడలు, వృత్తి నైపుణ్యంలో యువత కోసం యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్కిల్ యూనివర్సిటీని తెలంగాణలో ఏర్పాటు చేసి ప్రపంచానికి పోటీ పడేలా తయారు చేస్తామన్నారు. 25.50 లక్షల మంది రైతులకు 21 వేల కోట్ల రుణమాఫీ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. తెలంగాణలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కేవలం రెండు ఉద్యోగాలు మాత్రమే కల్పించారని, అది కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకే దక్కిందన్నారు. మొదటి ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం 55163 మంది ఉద్యోగాలు కల్పించిందన్నారు. వరి అంటే ఉరి అన్న నాటి కెసిఆర్ ప్రభుత్వం లక్ష కోట్లు వెచ్చించిన కాళేశ్వరం కుప్పకూలినా అత్యధికంగా 1.56 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించిన ఘనత సాధించి బోనస్ అందించామన్నారు. పదేళ్లు, పన్నెండేళ్ల మోదీ పాలన చేసిన నిర్లక్ష్యాన్ని పది నెలల్లో కాంగ్రెస్ చేయలేదని ఎలా అడుగుతారని ప్రశ్నించారు. మోదీ పెద్ద బిసి అయితే.. బండి సంజయ్ చిన్న బిసి అన్నారు. పార్లమెంటు నియోజకవర్గానికి బండి సంజయ్ చిల్లి గవ్వ తెచ్చాడా? అని ప్రశ్నించారు. 1931లో బిసి కులగణన జరిగితే 2025 వరకు వంద సంవత్సరాల్లో ఏ ప్రధాని, సిఎంలు చేయని సాహసం చేసి బలహీనవర్గాల లెక్కలు తేల్చామన్నారు. 56.33 శాతం బిసిలున్నట్లు తేల్చామన్నారు. దమ్ముంటే జాతీయస్థాయిలో జనగణలో కులగణన తేల్చాలన్నారు. 1979లోనే మండల్ కమిషన్ బిసిలలో ముస్లింలను చేర్చిందో లేదో బండి సంజయ్ తెలుసుకోవాలన్నారు. కేంద్ర మంత్రిగా అజ్ఞానంతో మాట్లాడవద్దని హితవు పలికారు. బిజెపి పాలిత రాష్ట్రాలైన గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, బీహార్‌లలో ముస్లిం ఉపకులాలు బిసి రిజర్వేషన్లు అనుభవించడం లేదా? అని ప్రశ్నించారు. పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టారా? చట్టం చేశారా? ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బిసి అభ్యర్థి బండారు దత్తాత్రేయ సీటును గుంజుకున్నారని, అదేవిధంగా బిసి రాష్ట్ర అధ్యక్ష పదవిని సైతం గుంజుకున్న ఆయన బిసి పక్షపాతి ఎలా అవుతారన్నారు. మూసీనదిని ప్రక్షాళనకు, రీజినల్ రింగ్ రోడ్ రాకుండా కేంద్రంలో ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. బిజెపిని బొందపెడితేనే తెలంగాణకు నిధులు వస్తాయన్నారు. కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య కాంగ్రెస్ ప్రజాపాలనలో అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి పరిష్కార గొంతుక అవుతారన్నారు. విద్యా, ఉపాధి అవకాశాల్లో ఇచ్చిన హామీలను అమలు చేసిన కాంగ్రెస్ పాలనను ఆశీర్వదించాలన్నారు. రాబోయే భవిష్యత్తు పట్టభద్రులు, నిరుద్యోగులదేనన్నారు. విద్యారంగంలో అపార అనుభవం ఉండి అనేక మందిని నిష్ణాతులుగా తీర్చిదిద్దిన కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, టిపిసిసి రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.



## పని చేసే ప్రభుత్వానికి పట్టం కట్టండి

మాటలు కాకుండా ప్రజల కోసం పని చేసే ప్రభుత్వానికి ఎంఎల్‌సి ఎన్నికల్లో పట్టభద్రులు ఆలోచించి ఓటు వేసి కాంగ్రెస్ పట్టభద్రుల అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని రేవంత్‌రెడ్డి కోరారు. సోమవారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన శాసనమండలి ఎన్నికల సందర్భంగా ఆదిలాబాద్ పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి నరేందర్‌రెడ్డి ప్రచారసభలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంచిర్యాల జిల్లా ఇంచార్జి మంత్రి , రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, పెద్దపల్లి ఇంచార్జి మంత్రి, రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ విఠల్, మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి, ఖానాపూర్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, గడ్డం వివేకానంద, గడ్డం వినోద్, వెడ్మ బొజ్జు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, శాసనమండలి ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ గొర్రెల పథకం, ఫార్ములా ఈ రేస్ వంటి కుంభకోణాలలో భారతీయ జనతా పార్టీ, బిఆర్ఎస్‌కు కొమ్ము కాస్తుందని ఆరోపించారు. గంగా నది, యమునా నదుల ప్రక్షాళనకు వందల కోట్లు ఖర్చు పెట్టిన కేంద్రం తెలంగాణలో మూసినది ప్రక్షాళనకు అనుమతి ఇవ్వకుండా అడ్డుపడుతుందన్నారు. బిఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ పార్టీ ఓటమి కోరుతుందని కానీ ఎవరిని గెలిపించాలని ఆలోచిస్తుందని, పట్టభద్రుల ఓటు కలిగిన బిఆర్ఎస్ నాయకులు శాసన మండలి సభ్యుల ఎన్నికల్లో ఎవరికి ఓటు వేస్తారని ప్రశ్నించారు. భారతీయ రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీలు చీకట్లో అలాయ్ బలాయ్ చేసుకుంటున్నాయని, రాష్ట్ర అభివృద్ధికి అడ్డుపడుతున్నాయని ఆరోపించారు.

## కెసిఆర్ నీది గతమే.. భవిష్యత్తు లేదు

పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి గెలుపు ఖాయమని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు చూసి నరేందర్ రెడ్డికి ఓటు వేయాలని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉమ్మడి జిల్లా పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిజామాబాద్‌లోని భూమారెడ్డి కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఐటి శాఖ మంత్రి శ్రీధర్‌బాబు విచ్చేశారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ బిజెపి, బిఆర్ఎస్ లోపాయికారి ఒప్పందంతో ఎన్ని పథకాలు పన్నిన నరేందర్‌రెడ్డి గెలుపును ఆపలేరన్నారు. ప్రభుత్వానికి పట్టభద్రులకు నరేందర్‌రెడ్డి వారధిగా ఉంటారన్నారు. కెసిఆర్ నీది గతమేనని.. భవిష్యత్తు లేదని, పదేళ్లు పాలించి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేశారని, అయినప్పటికి ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా ఒక్క గంట విశ్రాంతి తీసుకోకుండా రాష్ట్ర అభివృద్ధి కోసం పాటుపడుతున్నాని గుర్తు చేశారు. ఎన్నికలలో బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు కుతంత్రాలు చేసి ప్రభుత్వాన్ని బలహీనపర్చాలని చూస్తున్నారో అవి ఏవి ఫలించవన్నారు. ప్రజలు తిరస్కరించిన పామ్‌హౌస్‌లో కూర్చొని కాంగ్రెస్‌ను ఓడించాలని కుట్రలు పందుతున్నారన్నారు.



## వన్య ప్రాణులను రక్షించేలా..
# చర్యలు తీసుకోండి

అటవీ అధికారులకు ఆదేశించిన మంత్రి కొండా సురేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులను రక్షించే విధంగా పటిష్ట చర్యలు తీసుకోవాలని అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. మంత్రి కొండా సురేఖ నేతృత్వంలో సచివాలయంలో రాష్ట్ర వన్యప్రాణుల సంరక్షణ బోర్డు 8వ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలపై కొండా సురేఖ అధికారులతో చర్చించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. వివిధ అటవీ ప్రాంతాల్లో నిర్మించాలని ప్రతిపాదించిన నాలుగు మొబైల్ టవర్లు, ఇతర ప్రతిపాదనలకు సమావేశం సానుకూలత వ్యక్తపరిచింది. కవాల్ టైగర్ రిజర్వు, బఫర్ ఏరియాలో పంచాయతీ రోడ్ల నిర్మాణం కోసం సవరించిన ప్రతిపాదనలను సైతం సమావేశం ఆమోదం తెలిపింది. బిఎస్ఎన్ఎల్ 4జి మొబైల్ సెల్ ఫోన్ టవర్లు అంశంలో ప్రతిపాదనపై ఎస్‌బిడబ్ల్యూఎల్ సమావేశంలో చర్చించారు. టైగర్ జోన్‌లోని గిరిజనుల తరలింపు ఎలా చేస్తున్నారని మంత్రి సురేఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారిని వేరే ప్రాంతాలకు తరలిస్తే.. 1/70 కింద కలిగే ప్రయోజిత ప్రాంతాలకు తరలిస్తున్నారా? అని ఆరా తీశారు. సంబంధిత చట్ట ప్రయోజిత ప్రాంతంలోకే తరలిస్తున్నట్టు అధికారుల వివరణ ఇచ్చారు. రాత్రిపూట భారీ వాహనాలను అటవీ రోడ్ల నుంచి అనుమతి ఇవ్వొద్దని కొండా సురేఖ అధికారులను సూచించారు. నియమ నిబంధనలు అధ్యయనం చేసి, వాహనాల రాకపోకల సమయపాలనపై నిబంధనలు అవసరం అయితే సవరించాలని కోరారు. ఈ విషయంపై పూర్తిస్థాయిలో పరిశీలిస్తామని అధికారులు చెప్పారు.

## సామాజిక, రాజకీయ, ఆర్థిక హక్కుల కోసం..
# 'దళితులు ఏకంకావాలి'

దళిత సంక్షేమానికి సరిపడా నిధులు కేటాయించాలి
కుల దురహంకార దాడులు, హత్యలపై ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలి
సిపిఐ రాష్ట్రకార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని
ఘనంగా డిహెచ్‌పిఎస్ జిల్లా ప్రథమ మహాసభ




**ప్రజాపక్షం/భద్రాచలం :** సామాజిక, రాజకీయ, ఆర్థిక హక్కుల కోసం ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాలు ఏకం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. సోమవారం పాల్వంచలోని చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో జరిగిన దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) జిల్లా ప్రథమ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించడంతో పాటు దళితులపై దేశవ్యాప్తంగా నిత్యం జరుగుతున్న దాడులు, హత్యలను అరికట్టేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రంలో బిజెపి అధికారం చేపట్టిన తర్వాత దళిత సంక్షేమానికి నిధుల కోత విధించడంతో పాటు దాడులు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ భద్రత, దళితుల భద్రత, ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్లు, జనాభా ప్రాతిపదికన నిధుల కేటాయింపు, ప్రమోషన్లలో రిజర్వేషన్లు, అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమాలకు సన్నద్ధం కావాలన్నారు. దీర్ఘ కాలిక సామాజిక ఉద్యమం ద్వారానే దళితులు సామాజిక, రాజకీయ, ఆర్థిక హక్కులు సాధించుకోగలుగుతారని అన్నారు.
దళిత కుటుంబాలు పరిమిత విద్య ద్వారా కొన్ని ఉద్యోగాలను పొంద గలుగుతుండగా, ప్రభుత్వరంగ సంస్థలను ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రైవేటీ కరణను నిలిపేయాలని, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని, సామాజికంగా గుర్తింపు లేని దళితులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించడమే సబ్ ప్లాన్ ముఖ్య ఉద్దేశ్యం కాగా, ఆ నిధులను ప్రభుత్వ దళిత సంక్షేమానికి వినియోగించకుండా సాధారణ కార్యక్రమాలకు మళ్లిస్తోందన్నారు. అసైన్డ్ భూములు కాంగ్రెస్ ప్రభుత్వాల్లో ఇచ్చినవే అని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన మేరకు ఎస్‌సి, ఎస్‌టి, బిసి పేదల అసైన్డ్ భూములకు మేలు చేకూరేలా చూడాలని ప్రభుత్వాన్ని కూనంనేని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.ఏసు రత్నం, మరుపాక అనిల్ కుమార్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి సలిగంటి శ్రీనివాస్, జిల్లా నాయకులు కంచర్ల జమలయ్య, బండి నాగేశ్వరరావు, కె.రత్నకుమారి, పేరాల శ్రీను, చెన్నయ్య, మామిడాల ధనలక్ష్మి, జకరయ్య, సంఘమిత్ర తదితరులు పాల్గొన్నారు.

## స్థానికత కేంద్ర ప్రభుత్వం పరిధిలోని అంశం : పొన్నం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్థానికత అనేది కేంద్ర ప్రభుత్వం పరిధిలోని అంశమని, దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తూ రాబోయే శాసనసభ సమావేశాల్లో జోనల్ మార్పులకు సంబంధించి నివేదిక ఇవ్వబోతున్నామని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 317 జిఒ సబ్ కమిటీ సభ్యునిగా ఇప్పటికే స్పౌస్ కేసులు, హెల్త్, మ్యూచువల్‌కు సంబంధించిన అంశంలో ఉద్యోగులను బదిలీ చేశామని ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగులు, నిరుద్యోగుల బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదని చెప్పారు. మంత్రి దామోదర రాజనర్సింహ నాయకత్వంలో శ్రీధర్‌బాబు, తాను 317 జివోపైన అనేక సమావేశాలను నిర్వహించామని గుర్తుచేశారు. 317 జివో అంశాన్ని ఎంఎల్‌సి ఎన్నికల్లో కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రస్తావించడాన్ని తప్పుపట్టారు. ఇటువంటి సున్నితమైన అంశాన్ని ఎన్నికల్లో రాజకీయాలకు ఉపయోగించుకోవడం పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

## విరాట్ కోహ్లి రికార్డు x కెసిఆర్ విరాటపర్వం రికార్డు





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** "14 వేల పరుగులు చేసిన విరాట్ కోహ్లి ఒకవైపు వార్తల్లో పతాక శీర్షికలలో నిలిస్తే... 14 నెలలుగా ఇంకా విరాట పర్వం వీడని బిఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ ప్రతిపక్ష నేత కెసిఆర్ కూడా వార్తల్లోకి ఎక్కడం ఆలోచించాల్సిన విషయం.. దుబాయ్ వేదికగా పాకిస్థాన్‌తో జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో టీమిండియా ఘన విజయం సాధించడం హర్షణీయం.. 6 వికెట్ల తేడాతో భారత్ బంపర్ విక్టరీ కొట్టిన విషయం మన అందరం టీవిలో చూసి సంబురపడినం.. 14 వేల పరుగులు కొట్టి విరాట్ కోహ్లి రికార్డు బద్దలు కొట్టగా... మన రాష్ట్ర ప్రతిపక్ష నేత కెసిఆర్ కూడా దాదాపు ఈ 14 నెలల కాలంలో 14 రోజులు కూడా అసెంబ్లీకి రాకపోవడం... ప్రజా సమస్యలపై ప్రజలకి అందుబాటులో ఉండకపోవడం దేశ రాజకీయ చరిత్రలో పెద్ద రికార్డే కదా" అని మంత్రి కొండా సురేఖ తన ట్విట్టర్ ఖాతాలో పోస్టు చేశారు.

# మైనింగ్ చరిత్రలో కీలక మైలురాయిగా తెలంగాణ

కీలక ఖనిజాల ఉత్పత్తి రంగంలో క్వీన్స్ లాండ్, తెలంగాణ మధ్య పరస్పర అవగాహన
ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క




**ప్రజాపక్షం / హైదరాబాద్ :** కీలక ఖనిజాల టెక్నాలజీ, మైనింగ్ రంగంలో పరస్పర సహకారం, భాగస్వామ్యానికి తెలంగాణ ఆస్ట్రేలియాలోని క్వీన్స్ లాండ్ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పంద అవగాహనకు రావడం తెలంగాణ రాష్ట్ర మైనింగ్ చరిత్రలో కీలక మైలురాయిగా నిలిచిపోనున్నదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. భారతదేశంలో కీలక ఖనిజాల మైనింగ్‌లో తెలంగాణ రాష్ట్రం ప్రధాన భూమిక పోషించనుందని పేర్కొన్నారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సోమవారం క్వీన్స్ ల్యాండ్ రాష్ట్ర ఆర్థిక వాణిజ్య ఉపాధి, శిక్షణ శాఖ మంత్రి రోస్ బేట్స్, ఆ రాష్ట్ర అధికారుల బృందంతో నిర్వహించిన కీలక ఖనిజాల ఉత్పత్తి, వ్యాపార విస్తరణ అవకాశాల సమావేశంలో డిప్యూటీ సిఎం మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు దేశంలో విద్యుత్ వాహనాలు సోలార్ విద్యుత్, బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్‌లకు విపరీతమైన డిమాండ్ ఉన్న నేపథ్యంలో ఈ రంగానికి అవసరమైన వెనాడియం, కోబాల్ట్, ఇండియం, క్రోమియం, టైటానియం వంటి 11 రకాల కీలక ఖనిజాలు ఎంతో అవసరమన్నారు. ఇప్పటివరకు ఈ కీలక ఖనిజాలను విదేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నామని, ఈ ఖనిజాల లభ్యత క్వీన్స్ లాండ్‌లో అధికంగా ఉన్నందున వీటి ఉత్పత్తి, విక్రయానికి పరస్పర లబ్ధి చేకూరే వ్యాపార ఒప్పందంపై ప్రాథమికంగా అవగాహనకు వచ్చినట్లు వివరించారు.
తెలంగాణ రాష్ట్రం, క్వీన్స్ ల్యాండ్ మధ్య సంయుక్త మైనింగ్, మినరల్ వ్యాపారానికి సింగరేణి సంస్థ ఒక నోడల్ ఏజెన్సీగా నియమిస్తున్నామన్నారు. సింగరేణి సంస్థ ఇప్పటికి క్వీన్స్ లాండ్స్‌తో రక్షణకు సంబంధించి సిమార్స్‌తో, మైనింగ్, టెక్నాలజీకి సంబంధించి సిఎస్ఐఆర్ఓ తదితర సంస్థలతో ఒప్పందాలు చేసుకుని సేవలు పొందుతుందని, ఇప్పుడు క్వీన్స్ ల్యాండ్ మంత్రి సమక్షంలో కీలక ఖనిజాల వెలికితీత, భారీ ఖనిజ ఉత్పత్తి యంత్రాలు సాంకేతికత, రక్షణ పెంపుదలకు, వెంటిలేషన్ మెరుగుదల, ఎక్కువ లోతులో ఉన్న బొగ్గు నిల్వల తవ్వకానికి సంబంధించి ఆధునిక సాంకేతికత తదితర అంశాలపై పరస్పర అవగాహనతో వ్యాపార ఒప్పందం కోసం ముందుకు పోతుందన్నారు. త్వరలోనే పై అంశాలపై అధ్యయనం, అవగాహన కోసం సింగరేణి నుంచి బృందాన్ని క్వీన్స్ లాండ్‌కు పంపుతున్నట్లు తెలిపారు.

## ఎఐ సిటీలో పెట్టుబడులు పెట్టండి

క్వీన్స్ లాండ్ ప్రభుత్వ ప్రతినిధులను కోరిన మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయబోతున్న 'ఎఐ సిటీ'లో పెట్టుబడులు పెట్టాలని ఆస్ట్రేలియా క్వీన్స్ లాండ్ ప్రభుత్వ ప్రతినిధులను రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. క్వీన్స్ లాండ్ రాష్ట్ర ఫైనాన్స్, ట్రేడ్, ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ మంత్రి 'రాసిన్ బేట్స్' ఆధ్వర్యంలోని బృందం బంజారాహిల్స్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి శ్రీధర్‌బాబును సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 'తెలంగాణ క్వీన్స్‌ల్యాండ్' మధ్య ప్రాధాన్య రంగాల్లో సంబంధాలను మెరుగుపర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. త్వరలో రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయే లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీ గురించి ప్రత్యేకంగా వివరించామన్నారు. జీవ విజ్ఞానం, ఔషధ తయారీ రంగంలో అగ్రగామిగా ఉన్న తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ప్రతినిధుల బృందం ఆసక్తి వ్యక్తం చేసిందన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయే క్రీడా విశ్వవిద్యాలయానికి సహకరించాలని కోరగా అంగీకరించారన్నారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటును ప్రత్యేకంగా అభినందించారని, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రూపొందించిన కోర్సులపై బృంద సభ్యులు ఆసక్తి వ్యక్తం చేశారన్నారు. రాబోయే రోజుల్లో తాము కూడా భాగస్వామ్యం అవుతామని చెప్పారన్నారు. అంతర్జాతీయ స్థాయిలో విద్య, ఆర్అండ్‌డి, వ్యవసాయం తదితర అంశాల్లో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నామన్నారు.
కార్యక్రమంలో క్వీన్స్ లాండ్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సిఇఒ జస్టిన్ మెక్ గవాన్, ఆస్ట్రేలియన్ కాన్సుల్ జనరల్ (బెంగళూర్) హిల్లరీ మెక్ గెచీ, ఆస్ట్రేలియన్ కాన్సుల్ జనరల్ (బెంగళూర్) కన్సల్ ఆండ్రయా కాలిస్టర్, పాలసీ రీసెర్చ్ అసోసియేట్ కృతికా సుబ్రహ్మణ్యన్, ట్రేడ్ కమిషనర్ అభినవ్ భాట్ల, మనీష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## జియో ట్యాగ్ లేని మగ్గాలకు జియో ట్యాగ్ వేయాలి

తాటిపాముల వెంకట్రాములు

**ప్రజా పక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా జియోట్యాగ్ లేని మగ్గాలన్నింటికీ జియోట్యాగ్ వేసి నేతన్నలతో పాటు అనుబంధ కార్మికులకు నేతన్న పొదుపు పథకం (త్రిఫ్ట్) వర్తింపజేయాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేనేత అభయ హస్తం అమలును వేగవంతం చేసి అర్హులైన చేనేత కార్మికులకు సంక్షేమ పథకాలను వర్తింపజేయాలన్నారు. గత 12 ఏళ్లుగా చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో సహకార వ్యవస్థ నిర్వీర్యమైందని, ఈ ప్రభుత్వం కూడా ఎన్నికలు నిర్వహిస్తామని పదేపదే ప్రకటిస్తూనే మరోవైపు మాటిమాటికీ వాయిదా వేయడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. సహకార వ్యవస్థను కాపాడాలనే చిత్తశుద్ధి ఉంటే కాలయాపన చేయకుండా తక్షణమే చేనేత సహకార సంఘాలకు, టెస్కోకు ఎన్నికలు నిర్వహించాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ఏమీ కొనలేని,తినలేని పరిస్థితులలో చేనేత కుటుంబాల వారు కడుదుర్భరంగా బతుకులు వెళ్లదీస్తున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకొని పెరిగిన ధరలకు అనుగుణంగా చేనేత కార్మికుల కూలీ రేట్లు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. చేనేత రుణాలను మాఫీ చేస్తామన్న వాగ్దానం నేటికీ నెరవేరలేదని, వెంటనే నేతన్నల అన్ని రకాల రుణాలు మాఫీ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ బోర్డు తదితర సంస్థలను పునరుద్ధరించాలని, కేంద్ర బడ్జెట్‌ని సవరించి, చేనేత పరిరక్షణ కార్మికుల సంక్షేమానికి అభివృద్ధి కోసం చేనేత రంగానికి రూ.5వేల కోట్ల నిధులు కేటాయించడంతోపాటు చేనేతపై జిఎస్‌టి రద్దు చేయాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు.

## టన్నెల్‌లో చిక్కుకున్న కార్మికుల ప్రాణాలు కాపాడాలి

బిఆర్ఎస్ మాజీ మంత్రి జి.జగదీష్ రెడి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** జాతీయ, అంతర్జాతీయ నిపుణులతో మాట్లాడి ఎస్ఎల్‌బిసి టన్నెల్‌లో చిక్కుకున్న కార్మికుల ప్రాణాలు కాపాడాలని బిఆర్ఎస్ మాజీ మంత్రి జి.జగదీష్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులను కాపాడేందుకు రక్షణ చర్యలను తీసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎంపి లింగయ్య యాదవ్, మాజీ ఎంఎల్ఎలు ఎన్.భాస్కర్‌రావు, కె.భూపాల్ రెడ్డితో కలిసి జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్ఎల్‌బిసి టన్నెల్ ప్రమాదం దురదృష్టకరమని, ఈ టన్నెల్‌లో చిక్కుకున్న కార్మికులు ఇతర రాష్ట్రాలకు చెందినవారని అన్నారు. కార్మికుల ప్రాణాల కంటే సిఎం రేవంత్ రెడ్డికి ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారమే ముఖ్యమైందా అని ఆయన ప్రశ్నించారు. మంత్రులకు ఫోటోలపై ఉన్న శ్రద్ధ, కార్మికుల ప్రాణాలను కాపాడటంలో లేదని మండిపడ్డారు. ఈ ఘటన రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లనే జరిగిందన్నారు. ఈ ఘటనపైన బిఆర్ఎస్ రాజకీయాలు చేయడం లేదని, కానీ సిఎం మాత్రం ఓట్ల కోసం రాజకీయం చేస్తున్నారన్నారు. గతంలో ఏ సిఎం కూడా శాసనమండలి ఎన్నికల ప్రచారానికి వెళ్ళలేదని చెప్పారు. ఎస్ఎల్‌బిసి ఘటన పట్ల ప్రధానితో ఫోన్‌లో మాట్లాడిన సిఎం,ఈ ఘటనకు తీసుకోవాల్సిన రక్షణ చర్యల విషయంలో కేంద్ర సహకారాన్ని అడిడిగినట్టుగా ఏమీ వెల్లడించలేదని జగదీష్ రెడ్డి తెలిపారు. ఘటనకు సంబంధించి వాస్తవాలను వెల్లడించడంలో ప్రభుత్వం విఫలమైందని, మీడియాకు రకరకాల లీకేజిలు ఇస్తున్నారని మండిపడ్డారు. ఎస్ఎల్‌బిసి ప్రాజెక్టు ఒక పెద్ద కుట్ర అని, నల్లగొండ ప్రజలకు కృష్ణా నీళ్లు రాకుండా చేయాలనే, గత సమైక్య పాలకులు ఎస్ఎల్‌బిసి టన్నెల్ ప్రాజెక్టును చేపట్టారని జగదీష్ రెడ్డి ఆరోపించారు. నల్లగొండ కాంగ్రెస్ నాయకులు నోరు మూసుకోవడం వల్లనే ఎస్ఎల్‌బిసిని తెరపైకి తెచ్చారన్నారు.

## యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలం : హరీశ్‌రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** యూరియా కోసం రైతులు మండుటెండల్లో తంటాలు పడుతుంటే, రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉండటం దుర్మార్గమని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మహబూబాబాద్ జిల్లాలో యూరియా పంపిణీ కోసం పోలీసులు టోకెన్లు జారీ చేస్తే, తాజాగా జగిత్యాలలో రైతులు పాస్ బుక్కులు, ఆధార్ కార్డులను క్యూలో పెట్టిన పరిస్థితి నెలకొన్నదని ఆరోపించారు. రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతుల కంట నీరు పెట్టిస్తున్నారని, ఇప్పటికైనా కళ్లు తెరిచి రైతాంగానికి అవసరమైన యూరియాను సరఫరా చేయాలని హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## బకాయిలు తక్షణమే చెల్లించాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యోగుల రిటైర్‌మెంట్ బకాయిలు తక్షణమే చెల్లించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సోమవారం సిఎంకు కిషన్ రెడ్డి లేఖ రాశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, యువత, పెన్షనర్లు, కళాశాలల యాజమాన్యాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం, నిర్లక్ష్య ధోరణిపట్ల భారతీయ జనతా పార్టీ తరపున తీవ్ర ఆందోళనను వ్యక్తం చేస్తున్నామన్నారు. 14నెలల కాంగ్రెస్ పాలనలో ఆయా వర్గాలేవీ సంతృప్తిగా లేరని, ఎన్నికల్లో వారికి ఇచ్చిన హామీలను సైతం మీరు ఉద్దేశపూర్వకంగానే నీరుగారుస్తున్నారని, వాళ్లకు దక్కాల్సిన న్యాయమైన హక్కులను కూడా ప్రభుత్వం కాలరాస్తోందని ఆరోపించారు. చివరికి ఉద్యోగులకు, పెన్షనర్లకు క్రమ పద్ధతిగా అందాల్సిన చెల్లింపులను, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా చెల్లించకుండా జాప్యం చేస్తూ వారిని తీవ్రమైన మానసిక ఇబ్బందులకు గురిచేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా యుద్ధప్రాతిపదికన తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పూర్తిగా విడుదల చేయడంతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు చెల్లించాల్సిన పెండింగ్ డిఎలు, జిపిఎఫ్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, పిఆర్‌సి బకాయిలను తక్షణమే విడుదల చేయాలని లేఖ ద్వారా డిమాండ్ చేశారు.

## అదానీని రక్షించేందుకే ..
# మోదీ అమెరికా పర్యటన

సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందంలో ముద్దాయిగా ఉన్న భారత వ్యాపారవేత్త అదానీని రక్షించేందుకే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా పర్యటన ప్రధాన ఉద్దేశ్యంగా కన్పిస్తోందని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం అమెరికా నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రధాని మోదీ అమెరికా పర్యటనలో భాగంగా వాషింగ్‌టన్‌లో ఒక వైపు ట్రంపును, మరోవైపు ఎలాన్‌మస్క్ కలవడం చూస్తుంటే ఇదే నిజమని అర్థం అవుతోందని తెలిపారు. ఇదే అమెరికా గడ్డ వేదికగా గత వైసిపి ప్రభుత్వ హయాంలో విద్యుత్ ఒప్పంద వ్యవహారంలో దాదాపు రూ. 2లక్షల కోట్లు అదానీకి లాభం చేకూర్చేటట్లుగా, ఆంధ్రప్రదేశ్ ప్రజానికంపై భారం మోపేలా ఈ ఒప్పందాలు జరిగాయని, ఇందులో అదాని ముద్దాయిగా ఆరోపణలున్నాయని, దీనిపై ఫిర్యాదు రావడంతో న్యూయార్క్ కోర్టులో కేసు నమోదైన విషయాన్ని నారాయణ గుర్తుచేశారు. అనంతరం.. ఇది అదానీని రక్షించేందుకేనని అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. అమెరికాలోని కార్పొరేట్ దిగ్గజం, భారత్‌లోని కార్పొరేట్ దిగ్గజం ఒక్కటే కాబట్టి, అదానీని కాపాడే ప్రయత్నంలో భాగంగా మోదీ అమెరికా పర్యటనలో మస్క్‌తో భేటీ కొనసాగుతున్నాయని అనుమానం వ్యక్తం చేశారు. తద్వారా ఈ కేసును నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తున్నారని, అదే జరిగితే భారతదేశ ప్రజానీకానికి, ఆంధ్రప్రదేశ్ ప్రజానీకానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. జాతీయ స్థాయిలో ఉన్న ప్రధాని మోదీ అమెరికాకు వచ్చిన తర్వాత ఇలాంటి అంశాలపై నీరు గార్చడం చాలా విచారకరమని అన్నారు. అటు ట్రంప్ పరిస్థితి చూస్తే.. మా ఇంటికి వస్తే ఏం తెస్తావు?, మీ ఇంటికి వస్తే ఏం ఇస్తావు ? అనే దిశగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ విషయంలో ప్రధాని నిష్పక్షపాతంగా ఉండలేకపోయారన్నారు. ఒక వైపు అవినీతిని ప్రోత్సహించడం, మరోవైపు భారత దేశానికి ట్రంపును రమ్మని ఆహ్వానించడం తగదన్నారు. ఈ సంఘటనలతో అంతర్జాతీయ కుంభకోణాల్లో భారత ప్రభుత్వం కూరుకుపోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ పర్యటనతో జాగ్రత్తపడాల్సిన అవసరముందని నారాయణ సూచించారు.

## ప్రతిష్టాత్మకంగా 'ఇంటింటి కులగణన'

బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించి చేపట్టిన ఇంటింటి కులగణన కార్యక్రమాన్ని ప్రజలందరూ విజయవంతం చేయాలని బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ విజ్ఞప్తి చేశారు. తొమ్మిదవ రోజు కులగణన అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం లంగర్‌హౌస్, బాపూఘాట్ ప్రాంతాల్లో పర్యటించారు. ముందుగా మహాత్మా గాంధీ బాపూఘాట్ వద్ద బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, స్థానిక నాయకులు నివాళులు అర్పించారు. లంగర్ హౌస్ నిరంజన్, స్థానికులతో కలిసి పర్యటించారు. ఇంటింటికీ తిరిగి ఎన్యూమరేషన్ జరిగిన తీరును పరిశీలించారు. తమ ఇంటికి వివరాలు నమోదు చేశారని, మరికొందరు తమ ఇంటికి స్టిక్కర్ అతికించారు కానీ వివరాలు నమోదు చేయలేదని, అలాగే అధికారులు వచ్చినప్పుడు తాము ఉద్యోగాలకు వెళ్లామని స్థానికులు ఆయనకు తెలిపారు. ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకున్న చైర్మన్ సంబంధిత వార్డ్ ఆఫీసర్లకు, రిసోర్స్ పర్సన్స్‌కు వెంటనే వారి వివరాల నమోదు చేయాలని ఆదేశించారు. పర్యటన సందర్భంగా టోల్ ఫ్రీ నెంబర్ 040 21111111 కాల్ చేసినప్పుడు స్పందించిన టెలి కాలర్స్ ఎన్యూమరేషన్ చేశారు. లంగర్‌హౌస్ ప్రాంతంలో కులగణన పూర్తి స్థాయిలో జరగలేదని గుర్తించారు. దీనిపై స్పందించిన చైర్మన్ పూర్తిస్థాయిలో కులగణణ చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

**రిజర్వేషన్‌లు అమలు జరగలాంటే కులగణన లెక్కలు తెలాల్సిందే..** ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిరంజన్ మాట్లాడుతూ 1931లో ఆంగ్లేయుల కాలంలో కులగణన జరిగిన తరువాత తిరిగి మళ్లీ ఇప్పడే జరుగుతుందన్నారు. ప్రభుత్వం కులగణన చేయాలని నిర్ణయించి, రూ. 160 కోట్లను ఖర్చు చేసిందన్నారు. కులగణన సరిగ్గా చేస్తే అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. రిజర్వేషన్‌లు సరిగ్గా అమలు చేయాలంటే కులాల వారీగా సంఖ్య అవసరమవుతుందన్నారు. మున్సిపాలిటీల కాల పరిమితి 2025 జనవరి 25కు, జెడ్‌పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్‌ల కాలపరిమితి 2024తో ముగిసిందన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్‌గా చంటిబాబు వ్యవరించగా, ఉస్మాన్ హల్ హాజరి, ఎ.చంద్రశేఖర్, నరసింహులు, పరమానందం, శ్రీకృష్ణ, నరసింహా రెడ్డి, షేక్ షకీల్, హేమలత, వినోద్, సయ్యద్ హమీద్, సయ్యద్ హలీం, కిషన్, పసుపులేటి శ్రీనివాస్, ఆశన్న ( బిసి వెల్ఫేర్ ఆఫీసర్), శ్రీవాణి (అడ్మినిస్ట్రేటివ్ వార్డ్ ఆఫీసర్), లలిత కుమారి (డిపిఒ), రిసోర్స్ పర్సన్స్ సంతోషి, పుష్ప, రోజా రాణి, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్** GHMC
NIT No. 27/DB/EE/Alwal Circle/GHMC/2024-2025 ప్రకటన తేది: 22.02.2025
**పని పేరు:** కాంపౌండ్ వాల్ నిర్మాణం, శుభ్రపరచడం మరియు క్లియరింగ్ కోసం అంచనా. **అంచనా విలువ:** రూ.17.50లక్షలు, **ప్రారంభ తేది & సమయం:** 25.02.2025న మ.12.30గం.లకు, **బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 04.03.2025న మ.12.30గం.ల వరకు, **ఇఇ అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అల్వాల్ సర్కిల్-27, జిహెచ్‌ఎంసి. మరిన్ని వివరాలకు www.eprocurement.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అల్వాల్ సర్కిల్-27, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 10617-PP/CL/ADVT/1/2024-25, Date: 24-02-2025

దేవాదాయ - ధర్మాదాయ శాఖ
**శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానము**
మట్టపల్లి మహా క్షేత్రం, మఠంపల్లి మం॥, సూర్యాపేట జిల్లా.
లేఖ నెం.69/యస్.యల్.యన్.యస్.డి/2024 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన తేది: 21-02-2025
శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానము మట్టపల్లి మహాక్షేత్రము, మఠంపల్లి మండలము, సూర్యాపేట జిల్లాకు అవసరమగు కిరాణా సామాగ్రి, పూజా సామాగ్రి మొదలగు అన్ని నిత్యావసర వస్తువులు ఒక సంవత్సరమునకు సరఫరా చేయుట కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.
ఇట్లు
చెన్నూరు విజయ్ కుమార్, అనువంశిక ధర్మకర్త, 9866137027
సిరకొండ నవీన్, కార్యనిర్వహణాధికారి, 9703662667
DIPR R.O. No. : 10600-PP/CL/ADVT/1/2024-25, Date: 24-02-2025

ప్రజాపక్షం
మంగళవారం, ఫిబ్రవరి 25

# జర్మనీ ఎన్నికల ప్రాధాన్యం

జర్మనీ పార్లమెంటు ఎన్నికల్లో పాలక సోషల్‌డెమొక్రటిక్ పార్టీ (ఎస్‌పిడి)ఓటమి చవిచూచింది. మితవాద క్రిస్టియన్ డెమొక్రటిక్ యూనియన్ (సిడియు), మధ్యేమార్గ సోషల్ డెమొక్రాట్స్ పార్టీ (సిఎస్‌యు) కూటమి అతిపెద్ద పార్లమెంటరీ కూటమిగా ఆవిర్భవించింది. ఈ రెండు పరిణామాలను ఒపీనియన్ పోల్స్ మొదటి నుంచీ ధృవీకరిస్తున్నాయి. అయితే యూరప్‌లోని పచ్చిమితవాద శక్తులన్నింటి తోడ్పాటుపొందిన, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఆయన సలహాదారు ప్రపంచకుబేరుడు ఎలాన్ మస్క్ బాహాటంగా బలపరిచిన ఫాసిస్టుభావజాలంకలిగిన పచ్చిమితవాద శక్తి ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ (ఎఎఫ్‌డి) అధికారం ఆకాంక్షలను జర్మన్ ఓటర్లు తిరస్కరించటం హర్షించదగింది. అయితే ఆ పార్టీకి గతంకన్నా కొద్దిశాతం ఓట్లుపెరిగి ఆమేరకు పెరిగిన సీట్లతో బుండెస్టాగ్‌లో రెండవ స్థానం ఖరారు చేసుకుంది. ఈ పార్టీ నేత ఎలైస్ వీడెల్. ఈ పార్టీతో పొత్తుపెట్టుకునే పార్టీ ఏదీ లేనందున సిడియు /సిఎస్‌యు నేత ఫ్రెడ్రిక్ మెర్జ్ సంకీర్ణ ప్రభుత్వాధినేతగా ఛాన్సలర్ బాధ్యతలు స్వీకరించే అవకాశాలున్నాయి. వామపక్ష డీ లింకె బలం 28 నుండి 64కు పెరగటం విశేషం. రాజకీయ పార్టీలకు లభించిన ఓట్ల శాతాన్ని బట్టి బుండెస్టాగ్‌లో సీట్లు కేటాయించే ప్రజాస్వామిక పద్ధతి జర్మనీలో ఉంది. అయితే కనీసం 5శాతం ఓట్లు లభించని పార్టీలకు పార్లమెంటులో ప్రాతినిధ్యంలభించదు. ఒకప్పుడు, పర్యావరణవాద పార్టీ అయిన గ్రీన్స్ పార్లమెంటులో ప్రవేశించకుండా నిరోధించేందుకు ఈ 5శాతం ఆంక్షను చట్టంలో చేర్చారు.

> జర్మనీ జాతీయ ఎన్నికల తర్వాత రాజకీయపార్టీలమధ్య విభజన విస్తృతమైంది. నిన్నటిదాకా కలహించుకున్న పార్టీలే ఇప్పుడు సంకీర్ణప్రభుత్వం చర్చలు జరపాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. సంధి కుదరకపోతే అస్థిరత ఏర్పడుతుంది. అది యూరప్ ఖండానికి మరీ నష్టంచేస్తుంది.

ఆదివారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సిడియు/సిఎస్‌యుకు 28.5శాతం ఓట్లు (208 సీట్లు), ఎఎఫ్‌డికి 20.7శాతం ఓట్లు (151సీట్లు), పాలక ఎస్‌పిడికి 16.5శాతం ఓట్లు (121సీట్లు), గ్రీన్స్‌కు 11.6శాతం ఓట్లు (85 సీట్లు), కమ్యూనిస్టు పార్టీ నుంచి రూపాంతరం చెందిన వామపక్ష డీ లింకె పార్టీకి 8.7శాతం ఓట్లు (64 సీట్లు) లభించాయి. 630 సీట్లు గల బుండెస్టాగ్‌లో సిడియు/సిఎస్‌యు, ఎస్‌పిడి ఉమ్మడి సంఖ్యా బలం 329. ఈ పార్టీలతో కూడిన సంకీర్ణప్రభుత్వం ఏర్పడవచ్చు. డీలింకె నుంచి చీలిపోయిన వామపక్ష పార్టీ బిఎస్‌డబ్ల్యుకు 4.97 శాతం ఓట్లు, వ్యాపారతరగతుల ఎఫ్‌డిపికి 4.3శాతం ఓట్లు, ఇతరులకు 4.5 శాతం ఓట్లు లభించాయి. డీ లింకె నుంచి చీలిక సమయంలో ఆ పార్టీ 38 మంది ఎంపిల్లో 10మంది బిఎస్‌డబ్ల్యులోకి వెళ్లారు. ఇప్పుడు డీ లింకె, బిఎస్‌డబ్ల్యులకు లభించిన ఓట్లను కలిపిచూస్తే వామపక్షం ఓటు గణనీయంగా 13 శాతం దాటటం గమనార్హం.

నేటి యూరప్ ఖండం పరిస్థితిలో జర్మన్ ఎన్నికలకున్న ప్రాధాన్యత విలువైనది. అది యూరప్‌లో అతిపెద్ద ఆర్థికవ్యవస్థ. దాని ఆర్థికాభివృద్ధి సంవత్సరం పైబడి ప్రతిష్టంభనలో పడింది. మరోవైపున వలసలను (ఇమ్మిగ్రేషన్) అణిచివేయాలన్న ఒత్తిడి పెరుగుతున్నది. ఈ సమస్యలపైనే ఓలఫ్ షుల్జ్ సంకీర్ణప్రభుత్వం కీచులాటలపాలైంది. నవంబర్‌లో ప్రభుత్వం మైనారిటీలో పడింది. అందువల్ల ఏడు నెలల ముందుగానే ఎన్నికలు జరిగాయి. అమెరికా అధ్యక్షునిగా ట్రంప్ పదవీ స్వీకారం చేసి, యూరప్ భద్రత అమెరికా బాధ్యతకాదని, ఇయుదేశాలు తమరక్షణ వ్యయాన్ని జిడిపిలో 2శాతం పైగా పెంపుచేయాలని యూరప్, నాటోలకు హెచ్చరికలు జారీచేస్తున్న నేపథ్యంలో జర్మనీ ఎన్నికలు జరిగాయి. ఇన్నాళ్లు అమెరికాపై ఆధారపడి మీసాలు మెలేస్తున్న ఇయుదేశాలకు ఇప్పుడు తత్వం బోధపడింది. అమెరికాతో సంబంధాలెలావున్నా, తమ రక్షణ, తమ ఆర్థికాభివృద్ధి తమ సొంత వ్యవహారంగా గుర్తిస్తున్నాయి. 27 దేశాల యూరోపియన్ యూనియన్‌లో అత్యధిక జనాభా (8 కోట్ల 40 లక్షలు) కలిగిన దేశం జర్మనీ, నాటోలో ప్రధాన సభ్యురాలు, ఉక్రేన్–రష్యా యుద్ధంలో ఉక్రేన్‌కు అమెరికా తదుపరి పెద్ద ఎత్తున ఆయుధాలు సరఫరా చేస్తున్న రెండవ దేశం. ట్రంప్ ప్రభుత్వ ఘర్షణపూరిత విదేశాంగ, వాణిజ్య విధానం సహా రానున్న రోజుల్లో యూరప్ ఖండం ప్రతిస్పందనను రూపొందించటంలో జర్మనీది ముఖ్య భూమిక కానుంది.

జర్మనీ జాతీయ ఎన్నికల తర్వాత రాజకీయపార్టీలమధ్య విభజన విస్తృతమైంది. నిన్నటిదాకా కలహించుకున్న పార్టీలే ఇప్పుడు సంకీర్ణప్రభుత్వం చర్చలు జరపాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. సంధి కుదరకపోతే అస్థిరత ఏర్పడుతుంది. అది యూరప్ ఖండానికి మరీ నష్టంచేస్తుంది.

# అమెరికా సాయం అసలు కథేంటి? మోదీ సర్కార్ మౌనం వీడాలి!



ఎం. కోటేశ్వరరావు

మన ఎన్నికలలో ఓటర్లు ఎక్కువగా పాల్గొనేందుకు ప్రోత్సాహ చర్యలు తీసుకోనేందుకు అమెరికా ప్రభుత్వ ఆధ్వర్యాన నడిచే ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ (యూఎస్ఎయిడ్) సంస్థ 21 మిలియన్ డాలర్లు (రు.182కోట్లు) మంజూరు చేసింది. దీన్ని జో బైడెన్ సర్కార్ కేటాయిస్తే డోనాల్డ్ ట్రంప్ సర్కార్ ఆ నిర్ణయాన్ని 90 రోజుల పాటు స్థంభింప చేస్తూ జనవరి 20న ట్రంప్ ఆదేశాలు జారీ చేశాడు. నిజానికి ఈ మొత్తాన్నే కాదు, ప్రపంచ మంతటా వివిధ దేశాలకు ఇస్తున్న మొత్తాలపై ఈ నిర్ణయం జరిగింది. భారత్ దగ్గర చాలా డబ్బుంది, అక్కడ ఓటర్లను ప్రోత్సహించేందుకు మనమెందుకు డబ్బివ్వాలంటూ ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించాడు. ఈ సొమ్మును గతంలో ఇచ్చారా, రాబోయే రోజుల్లో ఖర్చుచేసేందుకు మంజూరు చేశారా, విడుదల చేశారా లేదా అన్నది స్పష్టం కావాల్సి ఉంది. బిజెపి నేతలు అమిత్ మాలవీయ, రాజీవ్ చంద్రశేఖర్‌ల స్పందన చూస్తే ఈ మొత్తం ఖర్చు చేసినట్లుగా అర్ధం అవుతున్నది. ''ఓటర్ల బారులు తీరేందుకు 21మిలియన్ డాలర్లా? ఇది కచ్చితంగా భారత్ ఎన్నికల ప్రక్రియలో విదేశీ జోక్యమే. దీన్నుంచి ఎవరు లబ్ధిపొందారు? అధికారపక్షమైతే కచ్చితంగా కాదు'' అని అమిత్ మాలవీయ చెప్పారు. రాజుగారి చిన్న భార్య అందగత్తె అంటే పెద్ద భార్య అనాకారి అనేకదా అన్నట్లుగా అధికారంలో ఉన్న బిజెపి గాకపోతే కాంగ్రెస్ లబ్ధిపొందినట్లు ఆరోపించటమే కదా? ఈ మాత్రం అర్ధం చేసుకోలేనంత అమాయకంగా మన జనాలు ఉన్నారా? ప్రజాస్వామ్యాలను బలహీనపరచటం, జోక్యం చేసుకోవటానికి ఇది నిదర్శనం అని మాజీ కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ప్రకటించారు.ఒక వైపు ప్రజాస్వామిక విలువల గురించి చర్చ చేస్తూ మరోవైపు నిర్లజ్జగా ప్రజాస్వామిక దేశాలను బలహీనపరిచేందుకు పూనుకోవటం దిగ్భ్రాంతి కలిగిస్తున్నదన్నారు. దీని మీద కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి వివరణ ఇవ్వలేదు. శుక్రవారం నాడు విదేశాంగశాఖ ప్రతినిధి మాట్లాడుతూ తామీ సమాచారాన్ని చూశామని, సహజంగానే ఇది ఎంతో ఆందోళన కలిగిస్తుంది, భారత అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యం గురించి ఆందోళనకు దారి తీసింది. సంబంధిత శాఖలు, ఏజన్సీలు దీని గురించి చూస్తున్నాయి, ఈ దశలో బహిరంగంగా ప్రకటించటం తొందరపాటు అవుతుంది,తరువాత చెబుతాము అన్నారు.

నిజానికి ఇంత స్వల్ప మొత్తంతో ప్రభావితమై ఒక రాష్ట్రం లేదా దేశంలో ఓటర్లు కుప్పలు తెప్పలుగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓట్లు వేస్తారా ? ఒక్కో ఎంపి అభ్యర్థి వంద కోట్లు, ఎమ్మెల్యే పాతిక కోట్ల వరకు ఖర్చు పెడుతుంటేనే మాకు ఇవ్వాల్సింది ఇవ్వలేదు, వేరేవారికి ఎక్కువ ఇచ్చారంటూ నిరసనలతో అందరూ రావటం లేదు. ఏ మూలన చీమ చిటుక్కుమన్నా పసిగట్టే అమెరికన్లకు ఇంత చిన్న విషయం తెలియదా? తామిచ్చే 182 కోట్లతో ఓటర్లు బారులు తీరతారా? సాక్షాత్తూ అమెరికా ప్రభుత్వం వెల్లడించిన ఈ అంశం మీడియాలో చర్చకు దారితీసింది. వాస్తవాలను వెల్లడించేవరకు ఇది చర్చలో ఉంటుంది. సూది కోసం సోదికి పోతే పాత బాగోతాలన్నీ బయటపడినట్లు ఈ వ్యవహారంలో ఎంత పాత్ర ఉందో తెలియదు గానీ అమెరికాలో స్థిరపడిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వీణా రెడ్డి అనే ఆమె 2021 ఆగస్టు నుంచి 2024 జూలై వరకు అమెరికా సాయం ఏజన్సీ భారత డైరెక్టర్‌గా ఉన్నట్లు వార్తలు వచ్చాయి. ఎవరినో గెలిపించేందుకు ప్రయత్నించారని తాను ఊహిస్తున్నట్లు ట్రంప్ ఒక సాధారణ వ్యాఖ్య చేశాడు. 2014కు ముందు పెద్ద మొత్తంలో అమెరికా సాయం వచ్చిందని, తాము అధికారంలోకి వచ్చాక నామమాత్రమని బిజెపి పెద్దలు చెబుతున్నారు. అదే నిజమైతే ఆ సొమ్మును మోదీ గెలుపుకోసం వినియోగించినట్లు ఎందుకు భావించకూడదు? ఒక వేళ కాంగ్రెస్ కోసం ఖర్చు చేసి ఉంటే పదేండ్ల నుంచి బిజెపి పాలకులు నిజాల నిగ్గుతేల్చకుండా ఏ గుడ్డి గుర్రాలకు పండ్లుతోముతున్నట్లు? బిజెపి మాజీ ఎంపి మహేష్ జత్మలానీ వీణారెడ్డి గురించి ఒక ట్వీట్ చేశారు. ఎన్నికలు ముగిసిన

> అమెరికా ప్రభుత్వ సమాచారాన్ని ఉటంకించిన ఇండియా టుడే వార్త ప్రకారం వీణా రెడ్డి హయాంలో మన దేశానికి అమెరికా సాయం రు.720 కోట్ల నుంచి 2022లో రు.2,500 కోట్లకు పెరిగినట్లు, 2023లో రు.1,515 కోట్లు, 2024లో రు.1,304 కోట్లు వచ్చాయి. ఈ సొమ్మును దేనికి ఖర్చు చేశారో నిగ్గుతేల్చాల్సింది పోయి, కాంగ్రెస్ మీద మరొక పార్టీ మీద నిందలు వేస్తే కుదురుతుందా ?

తరువాత ఆమె అమెరికా వెళ్లారని, ఇక్కడ ఉంటే దర్యాప్తు సంస్థలు ఈ సొమ్ము గురించి ప్రశ్నించి ఉండేవారన్నారు. తప్పించుకుపోయారన్న అర్థం దీని వెనుక ఉంది. అమెరికాలో ఉంటే మాత్రం మన కేంద్ర ప్రభుత్వానికి అడిగే అవకాశం లేదా? యూఎస్ఎయిడ్ ప్రభుత్వ సంస్థ, అందువలన వివరాలు ఇవ్వాలని ఈ పాటికే నేరుగా మన ప్రభుత్వమే ఎందుకు అడగలేదు? జనానికి చెవుల్లో కమలంపూలు పెడుతున్నట్లుగా ఉంది. అమెరికా ప్రభుత్వ సమాచారాన్ని ఉటంకించిన ఇండియా టుడే వార్త ప్రకారం వీణారెడ్డి హయాంలో మన దేశానికి అమెరికా సాయం రు.720 కోట్ల నుంచి 2022లో రు.2,500 కోట్లకు పెరిగినట్లు, 2023లో రు.1,515 కోట్లు, 2024లో రు.1,304 కోట్లు వచ్చాయి. ఈ సొమ్మును దేనికి ఖర్చు చేశారో నిగ్గుతేల్చాల్సింది పోయి, కాంగ్రెస్ మీద మరొక పార్టీ మీద నిందలు వేస్తే కుదురుతుందా? ఓటర్లను పెద్ద ఎత్తున రప్పించేందుకు ఇచ్చినట్లు చెబుతున్న 21మిలియన్ డాలర్లు(రు.182 కోట్లు) అమెరికా కేంద్రంగా పనిచేస్తున్న కన్సార్టియం ఫర్ ఎలక్షన్స్ అండ్ పొలిటికల్ ప్రోసెస్ స్ట్రెంతెనింగ్(సిఇపిపిఎస్ ఎన్నికలు, రాజకీయ క్రమాన్ని పటిష్ట పరిచేందుకు ఏర్పడిన సహవ్యవస్థ)కు కేటాయించారు. ఇది అమెరికాలో ఉన్న ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఫర్ ఎలక్టొరల్ సిస్టమ్స్, ఇంటర్నేషనల్ రిపబ్లికన్ ఇనిస్టిట్యూట్, నేషనల్ డెమోక్రటిక్ ఇనిస్టిట్యూట్ అనే సంస్థలతో కూడిన కూటమి. ఎలన్ మస్క్ నిర్వహిస్తున్న ప్రభుత్వ సామర్థ్య శాఖ(డోజె) వెల్లడించిన సమాచారమే ఇది.

సాయం పేరుతో ఎంత ఖర్చు చేస్తే అంతగా ఆర్థికంగా, రాజకీయంగా అమెరికా లబ్ది పొందింది తప్ప ఊరికే ఒక్క డాలరు కూడా వెచ్చించలేదు.అమెరికా సాయం సంస్థ 1949లో అధ్యక్షుడు ట్రూమన్ హయాం నుంచి తరువాత కాలంలో అనేక మార్పులు, చేర్పులతో సహా అనేక దేశాలకు నిధులు కేటాయిస్తున్నది. వాటిని కమ్యూనిస్టు వ్యతిరేక, తనను వ్యతిరేకించే దేశాలకు వ్యతిరేకంగా ప్రచారం, కుట్రలు, పాలకులు, ప్రభుత్వాలను కూలదోయటం, అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులను ఆకట్టుకొనేందుకు, ఉగ్రవాదులతో సహా ఎన్‌జిఓలు, మరొక పేరుతో ప్రపంచ మంతటా తన తొత్తులను, విద్రోహులను సమకూర్చుకోవటం దానిపని. అందుకోసం ప్రపంచమంతటా పదివేల మంది సిబ్బంది, ఏటా వందబిలియన్ డాలర్ల వరకు బడ్జెట్‌తో నడుస్తున్నది. గూఢచార సంస్థ సిఐఏతో అనుసంధానించుకొని ప్రజాస్వామిక సంస్కరణలు, అభివృద్ధి పేరుతో కథనడిపిస్తున్నది. మన దేశం, చైనాకు వ్యతిరేకంగా కుట్రలు చేసేందుకు 2004లో మిలీనియం ఛాలెంజ్ కార్పొరేషన్ (ఎంసిసి) ఏర్పాటు చేసి శ్రీలంక, నేపాల్ దేశాలను దానిలో చేరాలని వత్తిడి చేసింది. మొత్తం 29 దేశాలతో 2019 నాటికి 37 ఒప్పందాలు చేసుకుంది. 1990కి ముందు సోవియట్ యూనియన్‌తో ప్రచ్ఛన్న యుద్ధం సాగించిన కాలంలో దాని పనితీరు ఒక విధంగా ఉంటే తరువాత కొన్ని మార్పులు చేసుకుంది. అవి ఏవైనప్పటికీ ప్రపంచంలో మార్కెట్ సంస్కరణలతో సహా అమెరికా ప్రయోజనాలకు అనుగుణమైనవి, రాజకీయంగా వ్యతిరేకించేవారిని లక్ష్యంగా చేసుకున్నవే. తమ మిలిటరీ, రాజకీయ ఎత్తుగడలో భాగంగా ముందుకు తెచ్చిన క్వాడ్ కూటమిలో చేరాలని బంగ్లాదేశ్‌పై అమెరికా వత్తిడి తెచ్చింది. చిట్టగాంగ్ ప్రాంతంలోని సెయింట్ మార్టిన్ దీవిని తమకు కౌలుకు ఇవ్వాలని, అక్కడ మిలిటరీ కేంద్రం ఏర్పాటు చేస్తామని చేసిన ప్రతిపాదనను షేక్ హసీనా వ్యతిరేకించారు. ఆ కారణంగానే ప్రభుత్వాన్ని కూల్చివేసి, ఆమెను దేశం నుంచి తరిమివేసిన శక్తుల వెనుక ''అమెరికా సాయం'' ఉందని వార్తలు వచ్చాయి. నిజానికి ఆ కేంద్రాన్ని చైనాను దెబ్బతీసేందుకని చెప్పినప్పటికీ అది మన దేశానికీ ముప్పు తలపెట్టేదే.

ప్రజాస్వామ్యం, స్వేచ్ఛా మార్కెట్ ఆర్థిక వ్యవస్థ పేరుతో రెండు దశాబ్దాల పాటు ఆఫ్ఘనిస్తాన్ దురాక్రమణకు అమెరికా దాదాపు రెండు లక్షల కోట్ల డాలర్లు ఖర్చు చేసింది. దీనిలో అభివృద్ధి కోసం చేసిన ఖర్చు కేవలం 3,240 కోట్ల డాలర్లు మాత్రమే ఉంది. చివరకు తాలిబాన్లకు సలాం గొట్టి అన్నింటినీ వదిలేసి 2021లో అమెరికా సేనలు అక్కడి నుంచి పారిపోయాయి. తమ సాయం ఆకలి, దారిద్ర్య నిర్మూలన, విద్య, వైద్యం వంటి వాటికి ఖర్చు చేస్తున్నట్లు అమెరికా చెబుతుంది. ఇరవై ఏండ్ల దురాక్రమణ తరువాత అక్కడ చూస్తే సర్వనాశనం. ముప్పైవేల మంది పౌరులతో సహా 1.74లక్షల మంది ఆఫ్ఘన్లు మరణించారు, 30లక్షల మంది పిల్లలు బడికి దూరం, 1.89 కోట్ల మంది తీవ్రమైన ఆహార కొరతను ఎదుర్కొన్నారు.తాలిబాన్లతో సాగించిన పోరులో భయానక చర్యలెన్నో. 950 కోట్ల డాలర్ల మేర ఆఫ్ఘన్ జాతీయ సంపదలను దోచుకున్నారు. ఇలాంటి ఉదాహరణలను ఎన్నో చెప్పవచ్చు. మన దేశంలో కాశ్మీరు, పంజాబ్, ఈశాన్య రాష్ట్రాల వేర్పాటు వాదులు, ఉగ్రవాదుల వెనుక అమెరికా సాయం హస్తం గురించి చెప్పుకోనవసరం లేదు. హాంకాంగ్ స్వాతంత్ర్యం పేరుతో గతంలో విద్యార్థులను రెచ్చగొట్టి రోడ్లెక్కించటం వెనుక, చైనాలో అంతర్భాగంగా ఐరాస గుర్తించిన తైవాన్ స్వాతంత్ర్య నినాదం, టిబెట్ వేర్పాటు వాదుల వెనుక అమెరికా హస్తం, సాయం బహిరంగ రహస్యమే.అమెరికా మేథో సంస్థ కౌన్సిల్ ఆన్ ఫారిన్ రిలేషన్స్(సిఎఫ్ఆర్) ఫిబ్రవరి ఏడవ తేదీన రాసిన విశ్లేషణలో ప్రతి ఏటా అమెరికా సాయం ఎలా ఉంటుందో వెల్లడించింది. 2023 సంవత్సరంలో ప్రపంచవ్యాపితంగా 7,200 కోట్ల డాలర్లను అందించగా దానిలో 61శాతం యుఎస్ఎయిడ్ ద్వారా పంపిణీ జరిగింది. దీని ద్వారా జరుగుతున్నట్లు చెబుతున్న సాయంలో ఒక డాలరులోని వంద సెంట్లకు గాను 10 నుంచి 30 మాత్రమే అవసరమైన వారికి అందుతున్నదని ఇటీవల సిబిఎస్ మీడియాతో అమెరికా ఎంపి బ్రియాన్ మాస్ట్ చెప్పాడు. చైనా తప్పుడు ప్రభావాన్ని ఎదుర్కొనే పేరుతో 2024 సెప్టెంబరులో 32.5 కోట్ల డాలర్లను అమెరికా పార్లమెంటు మంజూరు చేసింది.2023 నుంచి 2027వరకు ఇదే కార్యక్రమాలకు మొత్తం 162.5 కోట్ల డాలర్లను ఖర్చు చేసేందుకు నిర్ణయించారు. ఇంత మొత్తాన్ని ఎవరి పర్యవేక్షణలో ఎలా ఖర్చు చేస్తారో వెల్లడించలేదు గానీ యుఎస్ఎయిడ్ ప్రతినిధే ఉంటాడు. ఎందుకు ? ఎలా అంటే 2021లో జింబాబ్వే బడా పత్రిక హెరాల్డ్ అసలు విషయాన్ని వెల్లడించింది. ఆఫ్రికా ఖండంలో చైనా పెట్టుబడుల గురించి తప్పుడు వార్తలను ఎలా వండాలో స్థానిక విలేకర్లకు శిక్షణ ఇచ్చేందుకు అమెరికా నిధులు అందచేసిందట. మన దేశంలో కొన్ని పత్రికలు, టీవీలలో వస్తున్న కథనాలు, విశ్లేషణల వెనుక అమెరికా సాయం ఉందంటే తప్పు పట్టాలా ?

> 1990కి ముందు సోవియట్ యూనియన్‌తో ప్రచ్ఛన్న యుద్ధం సాగించిన కాలంలో దాని పనితీరు ఒక విధంగా ఉంటే తరువాత కొన్ని మార్పులు చేసుకుంది. అవి ఏవైనప్పటికీ ప్రపంచంలో మార్కెట్ సంస్కరణలతో సహా అమెరికా ప్రయోజనాలకు అనుగుణమైనవి, రాజకీయంగా వ్యతిరేకించేవారిని లక్ష్యంగా చేసుకున్నవే. తమ మిలిటరీ, రాజకీయ ఎత్తుగడలో భాగంగా ముందుకు తెచ్చిన క్వాడ్ కూటమిలో చేరాలని బంగ్లాదేశ్‌పై అమెరికా వత్తిడి తెచ్చింది. చిట్టగాంగ్ ప్రాంతంలోని సెయింట్ మార్టిన్ దీవిని తమకు కౌలుకు ఇవ్వాలని, అక్కడ మిలిటరీ కేంద్రం ఏర్పాటు చేస్తామని చేసిన ప్రతిపాదనను షేక్ హసీనా వ్యతిరేకించారు. ఆ కారణంగానే ప్రభుత్వాన్ని కూల్చివేసి, ఆమెను దేశం నుంచి తరిమివేసిన శక్తుల వెనుక '' అమెరికా సాయం '' ఉందని వార్తలు వచ్చాయి. నిజానికి ఆ కేంద్రాన్ని చైనాను దెబ్బతీసేందుకని చెప్పినప్పటికీ అది మన దేశానికీ ముప్పు తలపెట్టేదే.

అమెరికా సాయాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించగానే కొంత మంది సరికొత్త పల్లవి అందుకున్నారు. ఇప్పటికే బిఆర్ఐ పథకాలతో అనేక దేశాలలో చైనా పాగా వేస్తున్నదని, ఇప్పుడు అమెరికా సాయం ఆగిపోతే అది మరింతగా విస్తరించి అనేక దేశాలను అదుపులోకి తీసుకుంటుందనే పాటపాడుతున్నారు. ఇది రెండు అంశాలను తేటతెల్లం చేస్తున్నది. ఒకటి ఇన్ని దశాబ్దాలుగా సాయం పేరుతో అమెరికా తన ఆధిపత్యం కోసం ప్రయత్నించిందని నిర్ధారించటం, మరొకటి చైనా ఆధిపత్యం పెరుగుతుందనే భయాన్ని రెచ్చగొట్టటం. ఇంతకు ముందే చెప్పుకున్నట్లుగా ఆఫ్ఘనిస్తాన్‌లో సోవియట్ జోక్యాన్ని నివారించే పేరుతో తాలిబాన్లను తయారు చేయటం, తరువాత ఏకుమేకైన వారి మీదే పోరు సాగించిన అమెరికా మాదిరి ఇంతవరకు ప్రపంచంలో ఎక్కడైనా చైనా వ్యవహరించిందా? రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత రెండు కొరియాలు ఐక్యం కావాల్సి ఉండగా దాన్ని పడనీయకుండా దక్షిణ కొరియాలో అమెరికా మిలిటరీ తిష్టవేసి కొనసాగిస్తున్నది. ఆ మాదిరి చైనా ఎక్కడైనా కేంద్రాలను ఏర్పాటు చేసిందా? అమెరికా సాయం పేరుతో మన దేశంలో సాగించిన తప్పుడు పనులను బహిర్గతం చేసేందుకు మోదీ సర్కార్‌ముందుకు వస్తుందా? వాటిలో సంఘపరివార్ సంస్థలేమైనా ఉంటే అసలు రంగు బయట పడుతుందని భయపడి మూసి పెడుతుందా ?

# మాతృభాష మనుగడ

(ఎల్లనాడుల అమ్మనుడి పొద్దేడుక కైకట్టుగా మేలెంపులతో)

అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ సందర్భంగా అందరికీ ఒక మనవి. మనలో ఎంతమందికి మాతృభాషపై అభిమానం ఉన్నది. అసలు నేడు ఎంత మంది మాతృభాష గురించి ఆలోచిస్తున్నారు అనే అంశాన్ని చర్చించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. మనలో చాలామందికి తెలియని విషయం ఏమంటే ఏదైనా ఒక మాతృభాష మరుగునపడి నశించినట్లయితే, ఆ భాషను మాట్లాడే జాతి, వారి సంస్కృతి, వారి సాంప్రదాయాలు కూడా మరుగున పడిపోతాయి అనే విషయం చాలామందికి తెలియదు. అందుకే ఐక్యరాజ్యసమితి వారు ఎవరి మాతృభాషను వారే, కాపాడుకోవాలనే ఉద్దేశంతో, ఈ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం అని ప్రకటించారు ఈ ఒక్క రోజైనా మాతృభాష గురించి మనలో కొందరైనా ఆలోచిస్తారని, ఆవేశిస్తారని ఇలాంటి రోజులు జరుపుకోవాలని భాషావేత్తల అభిప్రాయం. ఈ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం జరుపుకోవడానికి ముఖ్య కారణం తెలుసుకోవలసి ఉన్నది. అన్ని భాషలను పరిరక్షించుకోవాలని, బహుభాషా వైవిధ్యాన్ని కాపాడుకోవాలని, సాంస్కృతిక వైవిధ్యాన్ని,దానిపై అవగాహన పెంచుకోవాలని ,బహుభాషా వాదాన్ని ప్రోత్సహించడానికి 1999 నవంబర్ 17న యునెస్కోలో ప్రకటించినారు.దీనికి ముఖ్య కారణం
ఎవరి అమ్మవారికి గొప్ప అన్నట్లుగా, ఎవరి మాతృభాష వారికి గొప్పే కదా! కనుక ఎవరు అమ్మనుడిని వారు తప్పక రక్షించుకోవాలి. ఇంగ్లీష్ వారి వలసవాదం వలన, వారు కాలిడిన ,ఏలిన సీమలలో అనేక భాషలు ,అనేక సంస్కృతులు ,ఇంగ్లీషు ప్రభావం వలన, వారి మత ప్రభావం వలన కనుమరుగైనవి. ఒక భాష నశిస్తే, ఆ భాషకు చెందిన జాతి, జాతి భావన, సంస్కృతి ,సాంప్రదాయాలు కూడా నశిస్తాయి. ఇది చరిత్ర చెప్పిన, నిరూపించిన సత్యం. అంటే మన అమ్మనుడిని మనమే కాపాడుకోవాలి. ఎవరి భాషను వారే రక్షించుకోవాలి. రాబోయే తరాల కోసం భాషను పదిలపరుచుకోవాలి . పరిరక్షించుకోవాలి. అందుకే ఇతర భాషల ప్రభావం మాతృభాషపై పడకుండా చూసుకొని, అమ్మనుడిని పరీక్షించుకోవాలనే తలంపుతోనే,ఆ భాష జాతి నైతిక బాధ్యతగా ,ప్రతి మనిషి కర్తవ్యం గా, అమ్మనుడిని రక్షించుకోవాలంటూ గుర్తు చేయడానికే, ఈ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఏర్పాటు చేయడమైనది. ప్రపంచంలో దాదాపు 6000పైచిలుకు భాషలు ఉన్నాయి. వాటిలో సొంత లిపి ఉన్న భాషలు దాదాపు 400 లోపే. కొన్ని భాషలకు ఇప్పటికీ సొంత లిపిలు లేవు. కనుక అమ్మనుడిని(మాతృభాష) అందరూ కాపాడుకోవాలని, రేపటి జాతికి భాషను పునరంకితం చేయాలనే, ఉద్దేశంతో ఈ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని జరుపుకోవాలని ఆవశ్యకత ఎంతైనా ఉంది. అయితే మనదేశంలో ఎక్కువగా తెలుగు ప్రాంతాలలో డాలర్ల మోజుతో, ఇంగ్లీషు డాబుసరితో మాతృభాషను విస్మరించి , ఆంగ్లమాధ్యమం వైపు తల్లిదండ్రులు పరిగెడుతున్నారు, పిల్లలను బలవంతంగా పరిగెత్తిస్తున్నారు. పరభాషలు నేర్వడం తప్పుకాదు. ముందు కనీసం ప్రాథమిక విద్య అయిన అమ్మనుడిలో ఉండాలి. ఎందుకంటే అమ్మనుడిలో విద్యార్థికి పాఠము సులభంగా అర్థమవుతుంది. తన భాషలో చదివితే నేర్చుకునే విషయంపై ఎక్కువ అవగాహనతో వివరణ సులభతరం అవుతుంది. మాతృభాష గొప్పతనాన్ని గురించి, చదువు మాతృభాషలో ఉంటే ఎంత ఉపయోగకరమో, విద్యార్థికి ఎంత వికాసవంతంగా ఉంటుందో, ప్రముఖులు గాంధీజీ, రవీంద్రనాథ్ ఠాగూర్, నేతాజీ, స్వామి వివేకానంద ఎందరో మహానుభావులు వివరించారు. మన దురదృష్టం అవన్నీ చెవిటి వాడి ముందుఊదిన శంఖములా అయిపోయాయి. ఇప్పుడు చాలామంది ఇంగ్లీష్ మీడియం పిల్లలను పరిశీలిస్తే,అటు ఇంగ్లీషు రాదు, ఇటు తెలుగు రాదు. ఇప్పటి ప్రభుత్వాలు కూడా తెలుగు భాషను తమ ఓట్ల కోసం, రాజకీయం కోసం వాడుకుంటూ, అమ్మనుడికి వెన్నుపోటు పొడుస్తున్నారు అనడంలో ఎలాంటి సందేహం లేదు. గత ప్రభుత్వాలు తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా తొలగించి మాతృభాషకు చాలా అన్యాయం చేశారు అనడంలో ఎలాంటి సందేహము లేదు. ఇది ఇలాగే సాగితే ఐక్యరాజ్యసమితి వారు ఈ మధ్య ప్రకటించిన ఒక నివేదిక ప్రకారం రాబోయే 30 సంవత్సరాలలో మరుగయ్యే భాషలలో తెలుగు ఒకటనే మాట నిజం కాబోతుందేమోనని అనుమానంగా ఉంది. అవును నిజమే, ఇప్పటి పిల్లలలో 90% ఇంగ్లీష్ మాధ్యమంలో చదువుతున్నారు, వారికి తెలుగు రాయడం, చదవడం రాదు. ఇక తెలుగు అక్షరాలతో పనేముంది. ఇలాగే సాగితే ముందు తరాలు వారు తెలుగు అక్షరాలను మ్యూజియంలో చూడవలసి వస్తుంది. మనం మొదటగా అమ్మనుడిని కాపాడుకోవాలి, మాతృభాషను ప్రేమించాలి, పర భాషలను ఆదరించాలి, అవసరానికి పరభాషను నేర్చుకోవడంలో తప్పేమీ లేదు. మనం ఇతర భాషలకు వ్యతిరేకం కాదు. అలాగే ఏదైనా ఒక కొత్త మాట ఇతర భాషలు నుండి వస్తే దానికి మొదటగా మన అమ్మ నుడి నుండే కొత్త మాటను పుట్టించాలి. ఆ పనిని హిబ్రూ, చైనా, జపాన్, కొరియా, తమిళులు, కన్నడిగులు చేస్తున్నారు. అయితే మన తెలుగువారు ఇంగ్లీష్ మాటను సంస్కృతీకరణ చేస్తున్నారు. చక్కగా ఆలోచిస్తే అచ్చ తెలుగులో మాటలను పుట్టించవచ్చు. ఈమధ్య తెలుగు భాషా పరిరక్షణకు, అనేక వేదికలు, సంస్థలు ముందుకు వచ్చి ఎంతో కొంత కృషి చేస్తున్నారు అయితే నిజానికి ఎవరూ ప్రజలతో మమేకమై, ప్రజా ఉద్యమాలకు బాసటగా నిలబడి ఉద్యమించడం లేదనీ, కేవలం తీర్మానాలు, ప్రసంగాలు, ప్రణాళికలు కేవలం కాగితాలకే పరిమితం అవుతున్నాయని తెలుగు భాషావేత్తల అభిప్రాయం. ఏది ఏమైనా ఈ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సందర్భంగా, మనందరం ఒకసారి మాతృభాష గురించి మీకు మాట్లాడుకోవడానికి అవకాశం వస్తుందని పరస్పర భావాలను ఒకరినొకరు పంచుకోవడానికి సహకరిస్తుందని అనడంలోఎలాంటి అనుమానం లేదు. అయితే ఇప్పటికీ, కొన్ని దేశాలలో మొదలిడు చదువు (ఎల్కేజీ) నుండి పెనుపాటి చదువు (పీజి) వరకు సాంకేతిక, వైద్య చదువులు అన్నీ కూడా వారి మాతృభాషలోనే జరుపుతున్నారు. కాబట్టి మన జాతి మన సంస్కృతి నిలవాలంటే, మన మాతృభాషలను నిలబెట్టుకోవాలి, మాతృభాష నిలబడాలి, కలబడాలి, కనబడాలి, వినబడాలి అప్పుడే ఆ భాష వలన జాతి, జాతి వలన దేశము ఒక విశిష్టమైన గౌరవాన్ని పొందుతాయనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. కనుక ఈ అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ సందర్భంగా మనందరము విన్నపము ఏమనగా, ఇప్పటి ప్రభుత్వం వారు అయినా తప్పక పరిపాలన భాషగా, ప్రజల పలుకుబడి భాషగా తెలుగును కనబడేటట్లు, వినబడేటట్లు చేయగలరని ఆశిద్దాం.

రాఘవ మాస్టారు కేదారి
జాతీయ తెలుగు పరిరక్షణ సమితి అధ్యక్షులు
6362973252

# పదవీ విరమణ చేసిన రోజే రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలి!



ఉజ్జిని రత్నాకరరావు
9490952646

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3.59 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగాలు ఉండగా.. వారిలో ఉపాధ్యాయులు దాదాపు 1.15 లక్షల మంది ఉన్నారు. ఇందులో ప్రతినెల 700–800 వరకు ఉద్యోగ విరమణలు జరుగుతుంటాయి.వారికి ఉద్యోగ కేటగిరీ బట్టి ఒక్కొక్కరికి రూ. 40 నుండి 70 లక్షల వరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ ఖజానాపై భారం పడుతుందని.. అనాలోచిత విధానంతో పదవీ విరమణ వయస్సును 2021లో 58 నుంచి 61 కి పెంచిన విషయం తెలిసిందే. ఆ గడువు గతేడాది మార్చిలో ముగిసింది. 2024 మార్చి నెలాఖరు నుంచి ప్రతినెల దాదాపు 800–1000 మంది ఉ ద్యోగ విరమణ పొందుతున్నారు.ఇందులో సగటున 350–400 మంది ఉపాధ్యాయులే ఉంటున్నారు. గత 11 నెలల కాలంలో సుమారు 8వేల మంది ఉద్యోగ విరమణ పొందగా. వారిలో 4 వేల మంది దాకా ఉపాధ్యాయులు ఉన్నట్లు సమాచారం.

## పదవీ విరమణ ప్రయోజనాల కోసం హైకోర్టుకు:

ప్రభుత్వం నుంచి రావలసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్( ఆర్థిక ప్రయోజనాలు) అందక వారు ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవంగా వారు సర్వీస్ కాలంలో పొదుపు చేసుకున్న సొమ్ముకు వడ్డీతో కలిపి రిటైర్మెంట్ అయినరోజునే చెల్లించాలి. రిటైర్మెంట్ అయ్యి నెలలు గడుస్తున్నా ఇచ్చే బెనిఫిట్స్ రాక న్యాయస్థానం మెట్లు ఎక్కుతున్నారు. గత డిసెంబర్ నుంచి ఇప్పటివరకు దాదాపు 500 మంది రిటైర్డ్ అయిన టీచర్లు హైకోర్టును ఆశ్రయించినట్లు తెలుస్తుంది. ఇటీవల కొంతమంది ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించగా.. వారికి 8 వారాల్లో రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని ఆదేశించింది. ప్రభుత్వం వారికి రెండు వారాలలో బెనిఫిట్స్ చెల్లించింది.

ఉద్యోగి సగటున 30 ఏళ్లపాటు విధులు నిర్వహిస్తారు.. పదవి విరమణ చేసిన తర్వాత శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని కోరుకుంటారు. ఉద్యోగం చేసినంతకాలం తాను దాచుకున్న జిపిఎఫ్, టిజిఎల్ఐసి, ఆర్జిత సెలవులు సొమ్ములతో పాటు ప్రభుత్వం నుంచి గ్రాట్యూటీ లభిస్తుందని ఆశిస్తారు. పిల్లల చదువులు, పెళ్లిళ్లు, సొంతింటి నిర్మాణం కొరకు చేసిన అప్పులు తీర్చడం.. ఇలా ఎన్నో ప్రణాళికలు వేసుకుని ఉంటారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగి రిటైర్మెంట్ అయ్యే రోజునే వారి బెనిఫిట్స్ ఇస్తూ, సన్మానిస్తూ, కారుతో వారింటికి పంపించాలని ఆదేశించింది. కానీ అమలు చేయక పోగ రిటైర్మెంట్ వయస్సునే 61 కి పెంచారు. దీనివలన ప్రస్తుత ప్రభుత్వం పై వేల కోట్ల రూపాయల భారం పడుతుంది. గత సంవత్సరం 2024లోనే 7,995 మంది రిటైర్ అయ్యారు. 2025లో 9,630 మంది,2026 లో 9,719 మంది, 2027లో 9,443 మంది, 2028 లో 7,213 మంది పదవి విరమణ చేయనున్నారు. 2024 మార్చి 31న ఆ తర్వాత ఏప్రిల్ నుంచి రిటైర్ అవుతున్న వారికిప్రభుత్వం ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉన్నందున సొమ్ములు చెల్లించడం లేదు. వీరందరి బిల్లులు క్లియర్ చేయాలంటే ఈ ఆర్థిక సంవత్సరంలోకనీసం రూ. 5000 కోట్ల వరకు అవసరమని అంచనా వేస్తున్నారు.

## ఒక్కోరిటైర్డ్ ఉద్యోగికి 40-60 లక్షలు రావాలి!

సాధారణంగా ఉద్యోగి రిటైర్ అయిన తర్వాత ప్రభుత్వం తన సొంత ఖజానా నుంచి ఇచ్చేది పెద్దగా ఏమీ ఉండదు. గ్రాట్యూటి కింద వారి సర్వీస్‌ను బట్టి సంవత్సరానికి 15 రోజులు చొప్పున మొత్తం సర్వీసును లెక్కించి చెల్లించాల్సిన డబ్బులు ప్రభుత్వం నిధుల నుంచి ఇవ్వాలిసి ఉంటుంది. ఉద్యోగి తన పదవి కాలంలో దాచుకున్న సొమ్మునే చెల్లించాల్సి ఉంటుంది. ఇలా ఒక్కో ఉద్యోగికి జిపిఎఫ్, డిజి ఎల్ఐసి, కమ్యూటేషన్ గ్రాట్యుటీ, ఆర్జిత సెలవులను సరెండు చేయడం వంటి వాటినన్నింటిని లెక్కిస్తే రూ.40–60 లక్షల వరకు వస్తుంటాయి. అలాగే,ఒక్కొక్క ఉద్యోగికి జిపిఎఫ్ కింద సగటున రూ. 8–10 లక్షల వరకు అందుతుంది. ఉద్యోగి రిటైర్ అయిన తర్వాత కమ్యూటేషన్ క్రింద 40 శాతం వరకు పెన్షన్ ప్రభుత్వానికి అమ్ముకునే వెలుసుబాటు ఉంటుంది. తాను అమ్ముకున్న 40 శాతం పెన్షన్ తాలూకు సొమ్మును ఒకేసారి ప్రభుత్వం అడ్వాన్స్ గా చెల్లించాల్సి ఉంటుంది. మిగతా 60 శాతం పెన్షన్ రూపంలో ప్రతినెల అందుతుంది. తాను అమ్ముకున్న 40% పెన్షన్ తాలూకు సొమ్మును ఒకేసారి ప్రభుత్వం అడ్వాన్స్ గా చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఉద్యోగికి రిటైర్ అయిన వెంటనే దాదాపు రూ.15 లక్షల వరకు అందుతుంది. తెలంగాణ ప్రభుత్వం బీమా (టి జి ఎల్ ఐ సి) క్రింద ఉద్యోగి మూల వేతనం నుంచి కనీసం ఆరు శాతం లేదంటే అంతకంటే ఎక్కువ శాతం మీద ప్రీమియం కట్ అవుతుంది. రిటైర్ అయిన తర్వాత ఎల్ఐసి కింద జమ అయిన సొమ్మును ఉద్యోగికి ఇచ్చి వేయాలి. దీని కింద రూ.6 లక్షల వరకు అందుతుంది. ఉద్యోగి తన సర్వీస్ కాలంలో 300 వరకు అర్జీత సెలవుల(ఈఎల్) ను నిల్వ చేసి పెట్టుకోవచ్చు. వీటిని రిటైర్ అయిన తర్వాత ప్రభుత్వానికి అప్పగిస్తారు. ఈఎల్ లకు సంబంధించి ఒక్కొక్క ఉద్యోగికి రూ.12–15 లక్షల వరకు సొమ్ము అందుతుంది. ప్రభుత్వం తన సొంత ఖాతా నుంచి 16 లక్షల గ్రాట్యుటీ ఇవ్వాలి. ఇలా అన్ని రకాల ఆర్థిక ప్రయోజనాల కింద ఒక్కొక్క ఉద్యోగి స్థాయిని బట్టి రూ. 40 నుంచి 70 లక్షల వరకు చేతికందుతాయి. వాస్తవానికి ఉద్యోగ విరమణకు నాలుగు నెలల ముందే అకౌంటెంట్ జనరల్(ఏజి) కార్యాలయానికి ఉద్యోగులు లిఖితపూర్వకంగా సమగ్ర వివరాలు అందజేస్తారు. కానీ ఉద్యోగ విరమణ చేశాక నెలలు గడుస్తున్నా రిటైర్మెంట్ బెన్ఫిట్స్ అందని పరిస్థితి ఉంది. ప్రభుత్వము నిధులు చెల్లించటంలో తీవ్ర జాప్యం జరుగుతుందని రిటైర్ అయిన ఉద్యోగులు తెలుపుతున్నారు.

కమిషన్లు ఇచ్చే వారికే చెల్లింపులు :రిటైర్ అయిన ఉద్యోగులకు ఇచ్చే బిల్లులకు కమిషన్ ఇచ్చిన వారికే చెల్లింపులు చేస్తున్నారని, ఇవ్వని వారికి ఆఫీసు చుట్టూ తిప్పించుకుంటున్నారని ఉద్యోగ సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. సాధారణంగా డీడీవోలు బిల్లులు చేసి పంపగానే ట్రెజరీల నుంచి టోకెన్లు జనరేటర్ అవుతున్నాయి. ఈ టోకెన్ల సీరియల్ నెంబర్ల వారిగా బిల్లులను పరిష్కరించాలి. కానీ, పైరవీలు చేసుకునే వారు కమిషన్లు ఇచ్చే వారి బిల్లులు చివర ఉన్న క్లియర్ చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.
రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి ప్రత్యేక శ్రద్ధ వహించి పైరవీలకు తావు లేకుండా రిటైర్ అయిన ఉద్యోగుల బిల్లులపై దృష్టి పెట్టి రిటైర్మెంట్ అయ్యే రోజుననే చెల్లించే ఏర్పాట్లు చేయాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నారు.

# ఢిల్లీ అసెంబ్లీలో తొలిరోజే హైడ్రామా

**న్యూఢిల్లీ :** బిజెపి ఢిల్లీలో అధికారంలోకి వచ్చాక సోమవారం మొదలైన తొలి అసెంబ్లీ సమావేశాల మొదటిరోజే సభలో హైడ్రామా చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి డాక్టర్ బిఆర్ అంబేద్కర్, షహీద్ భగత్ సింగ్ ఫోటోలను తొలగించారంటూ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) విపక్ష నేత ఆతిశీ ఆరోపించారు. బిజెపి దళిత వ్యతిరేక పార్టీ అని మరోసారి రుజువైందని అన్నారు. దీంతో అధికార పార్టీ సభ్యులు అభ్యంతరం తెలిపారు. ఆతిశీకి మద్దతుగా విపక్ష సభ్యులు సైతం నిరసనకు దిగడంతో ఉభయ పక్షాల మధ్య తీవ్ర వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. సభలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడంతో స్పీకర్ విజేందర్ గుప్తా జోక్యం చేసుకుని విపక్ష నేతలను మందలించారు. ఇది కర్టెసీ అడ్రెస్ అని, దీనిని రాజకీయ వేదక చేయవద్దని కోరారు. సభ సజావుగా సాగాలని విపక్షాలు కోరుకోవడం లేదని, సభా కార్యక్రమాలను అడ్డుతగిలే ఉద్దేశంతో వచ్చినట్టు కనిపిస్తోందని అన్నారు. సభ గౌరవాన్ని కాపాడాలని సూచించారు. అధికార, విపక్ష సభ్యులు వెనక్కి తగ్గకపోవడంతో సభను 15 నిమిషాల పాటు స్పీకర్ వాయిదా వేశారు.

**కొత్త ఎమ్మెల్యేల ప్రమాణం**

అంతకు ముందు కొత్త ఎన్నికల ఎమ్మెల్యేలు హిందీ, ఇంగ్లీష్, సంస్కృతం, ఉర్దూ, మైథిలి, పంజాబీ భాషల్లో ప్రమాణ స్వీకారం చేశారు. 8వ అసెంబ్లీ ప్రొటెం స్పీకర్‌గా బిజెపి ఎమ్మెల్యే అరవిందర్ సింగ్ లవ్లీ ప్రమాణం చేశారు. అసెంబ్లీ సమావేశాలు జరగడానికి ముందు రాజ్ నివాస్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా అరవిందర్‌తో ప్రమాణం చేయించారు. అనంతరం సీనియర్ శాసనసభ్యుడు అయిన లవ్లీ శాసనసభలో ఎమ్మెల్యేలందరి చేత ప్రమాణం చేయించారు. ముఖ్యమంత్రి రేఖా గుప్తా మొదట ప్రమాణ స్వీకారం చేయగా, ఆమె తర్వాత ఆరుగురు క్యాబినెట్ మంత్రులు చేశారు. ఢిల్లీ పిడబ్ల్యుడి మంత్రి పర్వేశ్ సాహిబ్ సింగ్ వర్మ, హోం మంత్రి ఆశిష్ సూద్ ఆ తర్వాతి చేశారు. పర్యావరణ మంత్రి మంజీందర్ సింగ్ సిర్సా పంజాబీలో ప్రమాణం చేయగా, న్యాయ, న్యాయ శాఖ మంత్రి కపిల్ మిశ్రా సంస్కృతాన్ని ఎంచుకున్నారు. ఇతర ఎమ్మెల్యేలు వివిధ భాషల్లో ప్రమాణం చేశారు. కర్నైల్ సింగ్ పంజాబీలో ప్రమాణం చేయగా, ప్రద్యుమ్న రాజ్‌పుత్, నీలం పహల్వాన్ సంస్కృతాన్ని ఎంచుకున్నారు. ముద్రిత వచనాన్ని చదివిన తర్వాత బిజెపికి చెందిన తర్విందర్ మార్వా మతపరమైన నినాదాలు చేశారు, దానికి స్పీకర్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ, అది గురుద్వారా కాదని గుర్తు చేశారు. అమానతుల్లా ఖాన్ (ఉర్దూ), చందన్ చౌదరి (మైథిలి), అజయ్ దత్ (ఇంగ్లీష్), గజేంద్ర యాదవ్ (సంస్కృతం) కూడా ప్రమాణ స్వీకారం చేశారు, స్పీకర్ నిరంతరం సభ్యులకు అధికారిక ప్రమాణ స్వీకార ఆకృతిని అనుసరించాలని సూచించారు. సంస్కృతంలో ప్రమాణం చేసిన ఇతర ఎమ్మెల్యేలలో సంజయ్ గోయెల్, జితేంద్ర మహాజన్, అజయ్ మహావర్, బిజెపికి చెందిన కర్నైల్ సింగ్ ఉన్నారు, చౌదరి జుబైర్, అమానతుల్లా ఖాన్ ఉర్దూను ఎంచుకున్నారు. ప్రతిపక్ష నాయకుడు, కల్కాజీ స్థానం నుండి ఎమ్మెల్యే అయిన ఆతిశీ కూడా ప్రమాణం చేశారు. నడవడానికి ఇబ్బంది కారణంగా గోపాల్ రాయ్ తన సీటు నుండే ప్రమాణం చేశారు. ఆయనకు అతిషి సహాయం చేశారు. చివరగా ఎమ్మెల్యే మోహన్ సింగ్ బిష్ట్ ప్రమాణం చేశారు.



**అసెంబ్లీ స్పీకర్‌గా విజేందర్ గుప్తా ఎన్నిక**

అసెంబ్లీ స్పీకర్‌గా రోహిణి నియోజకవర్గం సీనియర్ బిజెపి ఎమ్మెల్యే విజేందర్ గుప్తా ఎన్నికయ్యారు. అసెంబ్లీ సమావేశాలు సోమవారం నాడు ప్రారంభం కాగా, స్పీకర్ పదవికి విజేందర్ గుప్తా పేరును ముఖ్యమంత్రి రేఖా గుప్తా ప్రతిపాదించారు. దీనికి బిజెపి ఎమ్మెల్యే మంజిందర్ సింగ్ సిర్సా మద్దతు పలికారు. అనంతరం మూజువాణి ఓటుతో విజేందర్ గుప్తా ఎన్నికయ్యారు. సభా సంప్రదాయం ప్రకారం స్పీకర్‌గా విజేందర్ గుప్తా ఎన్నిక కాగానే ఆయనను ముఖ్యమంత్రి రేఖా గుప్తా, విపక్ష నేత సాదరంగా స్పీకర్ సీటు వరకూ తోడ్కొని వెళ్లారు. ఇటీవల ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులందరికి కంటే ఎక్కువ మెజారిటీతో విజేందర్ గుప్తా గెలిచారు. తన సమీప ఆప్ అభ్యర్థిపై 37,000ఆధిక్యంతో గెలుపొందారు.

# ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకునే మార్గాలను అన్వేషిస్తున్నాం

**కొచ్చి :** ప్రజలపై భారాలు మోపకుండా ఆదాయాన్ని పెంచుకోవడం ద్వారా కేరళ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకునే మార్గాలను అన్వేషిస్తున్నట్లు ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. ఈ దిశగా రాష్ట్రం ప్రయాణం ఉత్సాహం కలిగిస్తుందన్నారు. కేంద్ర నిధుల వాటాను సరిగా ఇవ్వకోవడంతో పాటు, వయనాడ్ పునరావాస పనులకు సైతం కేంద్ర ప్రభుత్వం సరిపడ నిధులు ఇవ్వకపోవడాన్ని ప్రస్తావిస్తూ కేరళను విపత్తుల సమయంలో కూడా పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేరళకు మరింత పెట్టుబడులను ఆకర్షించాలని కోరుకుంటున్నట్లు పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో విజయన్ తెలిపారు. కొచ్చిలో రెండు రోజుల పాటు జరిగి శనివారం ముగిసిన ఇన్వెస్టర్ కేరళ గ్లోబర్ సమ్మిట్(ఐకెజిఎస్)లో రూ.1.53 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిని వ్యక్తీకరించారు. రెడ్, విధానపరమైన జాప్యం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. దేశ జనాభాలో 2.8 శాతం జనాభా, 1.2 శాతం భూభాగం కలిగిన కేరళ 4 శాతం దేశ జిడిపికి తన వంతుగా అందిస్తోంది. ప్రస్తుత ధరల్లో కేరళ స్థూల రాష్ట్ర ఉత్పత్తి (జిఎస్‌డిపి) 12 శాతంగా పెరుగుతోందని తెలిపారు. జాతీయ సగటు కంటే కేరళ సగటు ఆదాయం 60 శాతం ఎక్కువగా నమోదైందని, 2024–25 బడ్జెట్ అంచనాల ప్రకారం రూ.1,03,239.97 కోట్లు స్వీయ రాబడిగా అంచనా వేసామని, ఇది కేంద్ర పన్నులు, గ్రాంట్‌ల కింద వచ్చే రూ.35,475.2 కోట్ల కంటే దాదాపు మూడు రెట్లు ఎక్కువ అని చెప్పారు. వరుసగా రెండవసారి వామపక్ష ప్రజాతంత్ర సంఘటన(ఎల్‌డిఎఫ్) అధికారంలోకి వచ్చిన కేరళకు కీలక అంశాలలో నిధులు ఇచ్చేందుకు కేంద ప్రభుత్వం నిరాకరిస్తోంది. ఫైనాన్స్ కమిషన్ కేటాయింపుల ప్రకారం 10వ ఆర్థిక కమిషన్ 3.785 శాతం కేరళ వాటాగా ఇవ్వగా, 15వ ఆర్థిక సంఘం కేవలం 1.925 శాతమే ఇఅవ్వలని సూచించినట్లు విజయన్ తెలిపారు. వయనాడ్‌లో కొండ చరియలు కూలి అనేక మంది మరణించిన ప్రకృతి విపత్తుకు రూ.2వేల కోట్ల పునరావాస ప్యాకేజీ ఇవ్వాలని కోరగా, కేంద్ర ప్రభుత్వం కేవలం రూ.529 కోట్లు, అది కూడా వడ్డీ లేని రుణం కింద కేటాయించింది.



**శశి థరూర్ వాస్తవాలే మాట్లాడారు**

వాస్తవాల ఆధారంగానే కాంగ్రెస్ ఎంపి మాట్లాడారని విజయన్ అన్నారు. ఇటీవల స్టార్టప్ రంగంలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం పురోగతిని శశిథరూర్ ప్రశంసించటంపై ఆ రాష్ట్రంలో రాజకీయ వివాదాన్ని రేకెత్తించింది. దీనిపై విజయన్ స్పందిస్తూ "ఆయన మాట్లాడింది కేరళ గురించే తప్ప ఒక రాజకీయ పార్టీపైనో లేదా ప్రభుత్వం గురించో కాదు. కష్టాల నడుమ కూడా వృద్ధి సాధించడం పట్ల కేరళీయులంతా గర్వంగా భావించాలి. ఆయన మాటలకు రాజకీయ రంగు పులమాల్సిన అవసరం లేద'ని అన్నారు.

# సెలెక్ట్ కమిటీ తొలి భేటీలో ఐటి బిల్లు పరిశీలన

**న్యూఢిల్లీ :** ఆదాయపన్ను బిల్లు (ఐటి బిల్లు)ను లోక్‌సభ సెలెక్ట్ కమిటీ పరిశీలించింది. ఈనెల 14న లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా 31 మంది సభ్యులతో సెలెక్ట్ కమిటీని ఏర్పాటు చేశారు. ఐటి బిల్లును పరిశీలించేందుకు ఈ సెలెక్ట్ కమిటీ తొలి సమావేశం సోమవారంనాడు జరిగింది. బిజెపి ఎంపి బైజయంత్ జే పాండే సెలెక్ట్ కమిటీకి సారథ్యానగల ఈ కమిటీ సభ్యులకు బిల్లుకు సంబంధించిన అనేక విషయాలను ఆర్థికశాఖ కార్యదర్శి వివరించారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఉన్న ఆదాయపన్ను చట్టం కంటే ఈ ప్రతిపాదిత బిల్లు ఎంతో సంక్షిప్తంగా భాషాపరంగా సరళంగా అర్థం చేసుకోవడానికి వీలుగా ఉంటుందని కార్యదర్శి వారికి తెలియజేశారు. ప్రస్తుతం ఉన్న చట్టం స్థానంలో ఈ బిల్లును పార్లమెంటు ఆమోదించి అమలులోకి తెస్తుంది. దీనికి ముందుగా పరిశీలన, మార్పుల చేర్పుల ప్రక్రియ జరుగుతున్నది. మొదట ఈ బిల్లును సెలెక్ట్ కమిటీ పరిశీలిస్తుంది. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. పాత చట్టంలో ఉన్న సంక్లిష్టమైన భాషను ఈ కొత్త బిల్లు నుండి తొలగించి సరళీకరించారు. ఇంతకుముందు పన్ను చెల్లింపుదారులు తాము సంపాదించిన సంవత్సరం పూర్తయ్యాక ఆ సంపాదనను మదింపు వేసి తర్వాతి సంవత్సరంలో పన్నులు చెల్లించేవారు. దీనికి సంబంధించి సంపాదించే కాలాన్ని, పన్ను చెల్లించే కాలాన్ని అసెస్‌మెంట్ ఇయర్, ప్రీవియస్ ఇయర్‌లుగా మార్పు చేశారు. పాండాతోపాటు ఇతర బిజెపి ఎంపీలు నిషికాంత్ దూబే, పిపి చౌధురి, భర్తృహరి మహతాబ్, అనిల్ బలుని తదితరులు కమిటీలో ఉన్నారు. ప్రతిపక్షాల తరపున డీపేందర్ సింగ్ హూడా (కాంగ్రెస్), మహువా మొయిత్రా (టిఎంసి), సుప్రియా సూలే (ఎన్‌సిపి–ఎస్‌పి), ఎన్.కె.ప్రేమచంద్రన్ (ఆర్ఎస్‌పి)లు కమిటీలో ఉన్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల మొదటిరోజున ఈ కమిటీ తన నివేదికను సభకు సమర్పిస్తుంది. ఏప్రిల్ నాలుగో తేదీన బడ్జెట్ సమావేశాలుముగుస్తాయి. జులై నెలలో పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం అవుతాయి.



# మధ్యప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టండి

ప్రధాని మోదీ పిలుపు

**భోపాల్ :** మధ్యప్రదేశ్‌లో ప్రతిభకు కొదవ లేదని, అభివృద్ధి చెందుతున్న పరిశ్రమల నేపథ్యంలో ఇక్కడ పెట్టుబడులు పెట్టడం లాభదాయకమని, వ్యాపార కేంద్రంగా మధ్యప్రదేశ్ అవతరిస్తుందని ప్రధాని మోదీ పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు. సోమవారం భోపాల్‌లో 'ఇన్వెస్ట్ మధ్యప్రదేశ్–గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ 2025' సమావేశం ప్రారంభం సందర్భంగా మోదీ పెట్టుబడిదారులను ఆహ్వానించారు. ప్రస్తుతం భారతదేశం పెట్టుబడులకు కేంద్రంగా మారిందని, ఆర్థికవేత్తలు, సామాన్య ప్రజలు, విదేశాలు, ప్రపంచ వ్యాప్తంగా వివిధ సంస్థలు ఇపుడు భారత్‌వైపు చూస్తున్నాయన్నారు. మధ్యప్రదేశ్‌లో పెట్టుబడిదారులకు, పారిశ్రామికవేత్తలకు అపరిమిత అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రపంచ భవిష్యత్తు భారత్ చేతిలో ఉందన్న అభిప్రాయాలు పెట్టుబడిదారులలో భారత్‌పట్ల ఆసక్తిని కలిగిస్తున్నాయని మోదీ అన్నారు. రానున్న కాలంలో ప్రపంచంలో ఆర్థికంగా వేగంగా అభివృద్ధి చెందే దేశంగా భారత్ రూపుదిద్దుకుంటోందని ప్రపంచ బ్యాంకు అభిప్రాయం వ్యక్తం చేసిందన్నారు. దీనికితోడు నియంత్రణ సడలింపు కమిషన్ పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం నెలకొనేందుకు సహకరిస్తుందన్నారు.

ఐక్యరాజ్య సమితికి చెందిన విభాగం సౌర శక్తిలో భారత్‌ను సూపర్ పవర్‌గా పేర్కొనడం కూడా భారత్‌లో మెరుగైన ఫలితాలు లభిస్తాయని ప్రపంచ దేశాలు భావిస్తున్నాయని మోదీ పేర్కొన్నారు. అంతరిక్ష విభాగంలో భారత్ ఎదురులేని శక్తిగా అవతరించిందని, వస్త్ర పరిశ్రమ, పర్యాటక, సాంకేతిక రంగాలలో రానున్న కాలంలో కోట్లాది ఉపాధి అవకాశాలను సృష్టించే సత్తా భారత్‌కు ఉందన్నారు. గత దశాబ్ద కాలంలో భారత్ శక్తి ఉత్పాదకతలో ముఖ్యంగా గ్రీన్ ఎనర్జీ ఉత్పాదకతలో ఎంతో పురోగతి సాధించిందన్నారు. పునరుత్పాదక శక్తి రంగం లో భాతర్ దాదాపు 500 కోట్ల పునరుత్పాదక శక్తి రంగంలో పెట్టుబడులు పెట్టిందని, 10 లక్షలకు పైగా ఉపాధి అవకాశాలు కల్పించిందన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మధ్యప్రదేశ్‌కు చెందిన 18 కొత్త ప్రాజెక్టులను ప్రారంభించారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఇదే మంచి సమయమని ప్రధాని పిలుపునిచ్చారు. మధ్యప్రదేశ్‌లో బిజెపి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అభివృద్ధి రెట్టింపయిందన్నారు. భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల రంగంలో అభివృద్ధి సాధించిన రాష్ట్రాలలో మధ్యప్రదేశ్ ఒకటని, ఒకప్పుడు ఇక్కడ వాహనాలు తిరిగే విధంగా రోడ్లు లేవని, ఇపుడు ఎలక్ట్రిక్ వాహనాలు తిరుగుతున్నాయన్నారు. ఈ యేడాది జనవరినాటికి రెండు లక్షల ఎలక్ట్రిక్ వాహనాలు నమోదయ్యాయని, ఇది దాదాపు 90 శాతం వృద్ధి అని తెలిపారు. తయారీ రంగంలో మధ్యప్రదేశ్ ప్రగతిని ఇది సూచిస్తోందన్నారు. ఆరోగ్య రంగంలోనూ భారత్ పురోగమిస్తోందని, ప్రపంచ దేశాలు 'హీల్ ఇన్ ఇండియా' మంత్రాన్ని జపిస్తున్నాయన్నారు. గత రెండు దశాబ్దాలలో మధ్యప్రదేశ్ ఎంతో ప్రగతి సాధించిందన్నారు. ఒకప్పుడు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు సుముఖత చూపనివారు ఇపుడు పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. ఖనిజ లభ్యతలో మధ్యప్రదేవ్ టాప్5లో ఉందన్నారు. నర్మద నది పరిశ్రమల స్థాపనకు ఆలంబనగా ఉందన్నారు. గత దశాబ్ద కాలంలో మౌలిక సదుపాయాల కల్పనలో భారత్ అభివృద్ధి చెందుతోందని, మధ్యప్రదేశ్ దీనిని అవకాశంగా తీసుకుని అభివృద్ధి బాటలో పయనిస్తుందన్నారు. ఢిల్లీ–ముంబయి ఎక్స్‌ప్రెస్ మార్గం మధ్యప్రదేశ్‌గుండా వెళుతుండడంతో ఉత్తర భారత్ మార్కెట్‌కు, ముంబయి పోర్టుకు రవాణా సౌకర్యం మెరుగైందన్నారు. విమాన సౌకర్యం పెంచేందుకు రాష్ట్రంలోని గ్వాలియర్, జబల్పూర్ విమానాశ్రయాలను ఆధునీకరిస్తామన్నారు. రాష్ట్రంలోని రైల్వేలుకూడా ఆధునీకరణకు నోచుకున్నాయని, వందశాతం విద్యుదీకరణ చేశామన్నారు. అమృత్ భారత్ పథకంకింద రాష్ట్రంలోని 80 రైల్వే స్టేషన్లను ఆధునీకరించామని, భోపాల్‌లోని రాణి కమలాపతి స్టేషన్‌ను అద్భుతంగా తీర్చిదిద్దామన్నారు. విద్యుదుత్పత్తిలోనూ నేడు మధ్యప్రదేశ్ స్వయం ప్రతిపత్తి సాధించిందని, 31 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోందన్నారు. రాష్ట్రంలో 300 పారిశ్రామిక మండలాలు ఉన్నాయని, మరిన్ని పారిశ్రామిక మండలాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. పారిశ్రామిక అవసరాలకు రాష్ట్రంలోని నదులను అనుసంధానం చేసే కార్యక్రమంకూడా వేగంగా సాగుతోందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సిఎం యావ్ మాట్లాడుతూ పారిశ్రామిక సదస్సుతో మధ్యప్రదేశ్ ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించిందని, పెట్టుబడుల కేంద్రంగా గుర్తింపు తెచ్చుకుంటుందన్న ఆశాభావం వ్యక్తంచేశారు. రానున్న అయిదేళ్లలో మధ్యప్రదేశ్‌ను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, పారిశ్రామిక వృద్ధితో ఉపాధి అవకాశాలు పెరిగే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.



# ఉపశమన ప్యాకేజీని గ్రాంట్‌గా మార్చండి

ప్రధాని నరేంద్రమోదీకి వయనాడ్ ఎంపి ప్రియాంక లేఖ

**న్యూఢిల్లీ :** గత ఏడాది కేరళలోని వయనాడ్‌లో ప్రకృతి ప్రకోపానికి కొండచరియలు సృష్టించిన బీభత్సంలో లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులైన విషయం తెలిసిందే. అయితే తిరిగి తమ జీవితాలను పునర్నిర్మించుకుంటున్న క్రమంలో ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలపై కాంగ్రెస్ ఎంపి ప్రియాకాంగాంధీ ప్రధాని నరేంద్రమోదీకి లేఖ రాశారు. ప్రభుత్వం అందించే సహాయ ప్యాకేజీని గ్రాంట్‌గా మార్చాలని ఆమె విజ్ఞప్తి చేశారు. వయనాడ్ ప్రజలు తమకు ఎదురైన ఈ భయంకరమైన దురదృష్టం నుండి బయటపడటానికి ప్రతి సహాయానికి అర్హులేనని తాను నమ్ముతున్నట్లు ప్రధానికి రాసిన లేఖలో ప్రియాంక పేర్కొన్నారు. వయనాడ్ లోక్‌సభ ఎంపిగా తన నియోజకవర్గంలోని చూరల్‌మల, ముండక్కై ప్రజల దుస్థితిని తెలియజేయడం కర్తవ్యంగా భావించానన్నారు. ఒక భయంకరమైన విషాదం వారి జీవితాలను, జీవనోపాధిని నాశనం చేసిన ఆరు నెలల తర్వాత కూడా, వారు తమ జీవితాలను పునర్నిర్మించుకోవడానికి ప్రయత్నిస్తున్నప్పుడు ఊహించలేని కష్టాలను ఎదుర్కొంటున్నారని, ఇది నిజంగా హృదయ విదారకని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. జు 30, 2024న వయనాడ్ జిల్లాలోని ఈ రెండు ఆవాసాలలో, చుట్టుపక్కల విధ్వంసం సంభవించిందని ఆమె పేర్కొన్నారు. ఈ విపత్తు తర్వాత, 298 మంది చనిపోయారని, 231 మృతదేహాలను, 223 శరీర భాగాలను వెలికితీశారని, మరో 32 మంది తప్పిపోయినట్లు లేదా చనిపోయినట్లు ప్రకటించారని ఆమె చెప్పారు. మొత్తం 58 మంది సభ్యులతో 17 కుటుంబాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోగా, 1,685 భవనాలు దెబ్బతిన్నాయని గుర్తుచేశారు. అందులో ఇళ్ళు, పాఠశాలలు, గ్రామ కార్యాలయాలు, డిస్పెన్సరీలు, అంగన్‌వాడీలు, దుకాణాలు, మతపరమైన కేంద్రాలు, ప్రభుత్వ భవనాలు ఉన్నాయన్నారు. కొండచరియలు బీభత్సం కారణంగా వెల్లర్మలలోని ప్రభుత్వ వృత్తి విద్యా ఉన్నత పాఠశాల, ముండక్కైలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పూర్తిగా ధ్వంసమయ్యాయని కాంగ్రెస్ నాయకురాలు చెప్పారు. గతంలో 658 మంది విద్యార్థులు చదువుకున్న ఈ రెండు సంస్థల శాశ్వత పునరావాసానికి ఇంకా వేచి చూస్తున్నాయన్నారు. కొండచరియలు విరిగిపడటంతో 110 ఎకరాల వ్యవసాయ భూమి నాశనమైందన్నారు. టీ, కాఫీ, యాలకులు ఈ ప్రాంతంలో ప్రధాన పంటలు కాగా, ఈ పంటల నుండి, ఈ ప్రాంతంలో పర్యాటక కార్యకలాపాల నుండి జీవనోపాధి పొందే చాలా మంది పనులు లేఖ వీధిన పడ్డారన్నారు. జీప్, ఆటోరిక్షా డ్రైవర్లు, దుకాణ యజమానులు, హోమ్‌స్టే యజమానులు, టూరిస్ట్ గైడ్‌లు విపత్తు తరువాత జీవనోపాధి కోల్పోయిన వారిలో ఉన్నారన్నారు. ఈ పరిస్థితులు దృష్ట్యా, వయనాడ్ జిల్లాకు ఆర్థిక మద్దతు చాలా అవసరమని స్పష్టంగా తెలుస్తుందని ప్రియాంక తెలిపారు.

# అసోంలో 61 దేశాల దౌత్యవేత్తల ఎలిఫెంట్ సఫారీ

జైశంకర్ సారథ్యంలో కెఎన్‌పిలో ఎంజాయ్‌మెంట్

**గువహటి :** అసోంలోని కజిరంగా జాతీయ పార్కు (కెఎన్‌పి)లో భారత విదేశాంగమంత్రి డా.ఎస్.జైశంకర్‌తోపాటు 60 దేశాలకు చెందిన దౌత్యవేత్తలు సోమవారం ఉదయం కుటుంబాలతోసహా వెళ్ళి ఏనుగులు ఎక్కి, వన్యమృగాలను వీక్షించి బాగా ఎంజాయ్ చేశారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరంతా 9000 మంది కళాకారులతో కూడిన ఝుమోయిర్ నృత్యాలను కూడా వీక్షించారు. యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంలో ఎలిఫెంట్ సఫారీ, జీప్ సఫారీ చేశారు. భారత్‌లో టూరిజం అభివృద్ధితోపాటు అసోంలో 2.0 మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల సదస్సులో పాల్గొన్న సందర్భంగా వీరంతా కెఎన్‌పిలో సోమవారంనాడు ఎంజాయ్ చేశారు. జైశంకర్‌తోపాటు భూటాన్, జపాన్, దక్షిణ కొరియా, థాయ్‌లాండ్, మలేసియా, ఇండోనేషియా తదితర దేశాల దౌత్యవేత్తలు వారి సతీమణులు ఏనుగులకు ఆహారం తినిపించారు. అనేక రకాల వన్యమృగాలను, వన్య ప్రాణులను తిలకించి పులకించారు. ఈ సందర్భంగా జైశంకర్ మీడియాతో మాట్లాడుతూ ఎప్పుడూ పుస్తకాలలో చదవడం, బొమ్మలు చూడటం, సినిమాలలో చూడటం తప్ప అనేక రకాల మృగాలను, వన్య ప్రాణులను ప్రత్యక్షంగా కజిరంగా జాతీయ పార్కులో తాము చూసి ఎంతో సంతోషపడ్డామని చెప్పారు. ఆదివారంనాటి రాత్రికే 60 దేశాలకు చెందిన భారత్‌లో ఉన్న దౌత్యవేత్తలు తమ కుటుంబాలతోసహా అసోంకు చేరుకున్నారు. సోమవారం ఉదయమే కజిరంగా పార్కుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా జైశంకర్ ప్రద్యుమ్న అనే పేరుగల ఆడ ఏనుగుపై ఎక్కి ఊరేగారు. పార్కులోపల కోహొరలోని సెంట్రల్ రేంజ్‌లో పలు దేశాల దౌత్యవేత్తలు సతీమణులతో కలిసి ఏనుగులు ఎక్కి ఎంజాయ్ చేశారు. ఒంటికొమ్ము ఖడ్గమృగాలు, నీటి ఏనుగులు, వివిధ జాతులకు చెందిన జింకలను వారు తిలకించారు. తమ అనుభవం ఎంతో గొప్పగా ఉందన్నారు. కజిరంగా జాతీయ పార్కుకు ఎంతోమం ది పర్యాటకులు వచ్చి బాగా ఎంజాయ్ చేస్తున్నారని అన్నారు. అసోంసహా ఇతర ఈశాన్యప్రాంత రాష్ట్రాలలో పలు ప్రాంతాలను అంతర్జాతీయస్థాయిలో పర్యాటకపరంగా, పెట్టుబడులపరంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. మనదేశంలో సహజసిద్ధమైన, సృజనాత్మకమైన పర్యాటక ప్రదేశాలు ఉన్నాయన్నారు. ఈ విషయాలను ఎక్స్ వేదికగా ఆయన పోస్ట్ చేశారు. ఈ పర్యటనలో అసోం వ్యవసాయమంత్రి అతుల్ బోరా, కజిరంగా లోక్‌సభ ఎంపి కామాఖ్య ప్రపాద్ తసా, కెఎన్‌పి డైరెక్టర్ సోనాలీ ఘోష్, డిఎఫ్‌ఓ అరున్ విఘ్నేశ్ కూడా దౌత్యవేత్తల వెంట ఉన్నారు.




**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**

**ABR. NO. 825 OF 2024**

Between:

**M/s. Hasini Chit Funds Pvt Ltd. Hanamkonda Branch, Rep. By it's Foreman,**

.....**Disputant**

VERSUS

**P.AMARENDER & OTHERS**

....**Opponents**

4. Sri. Vanam, Bixapathi, S/o. Sammaiah, Age 38 Yrs, Occu: Grade Worker TW Boys Hostel, R/o H.No: 18-75, Shanthinagar, Narsampet, Warangal.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on **07.03.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS, WARANGAL**


# మహిళలకు ఆర్థిక సాయంపై వాగ్దాన భంగం: ఆతిశీ



**న్యూఢిల్లీ :** మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఆర్థిక సాయంపై బిజెపి ప్రభుత్వం మొదట్లోనే మాట తప్పిందంటూ ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి ఆతిశీ ఆరోపించారు. ఆప్ ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి రేఖాగుప్తా కార్యాలయం ఎదుట సోమవారం నిరసనకు దిగారు. 'రెండ్రోజులుగా సమయం ఇవ్వాలని సిఎంను అడిగాం. ఇవ్వలేదు. అసెంబ్లీ సమావేశాల సమయంలో సిఎంను కలుస్తాం. మోదీ ఇచ్చిన హామీని క్యాబినెట్ తొలిసమావేశాల్లోనే అమలు చేయాలని సిఎంను కోరాం. వాళ్లు వాగ్దాన భంగం చేశారు. మార్చి 8వ తేదీ నుంచి మహిళా సమ్మాన్ యోజన కింద రూ.2,500 తప్పనిసరిగా ఢిల్లీ మహిళలకు చేరాలని ఆశిస్తున్నాం''అని అతిషి చెప్పారు. ఖాళీ ఖజానాను తమకు అప్పగించారంటూ సిఎం రేఖా గుప్తా చెప్పడంపై అతిషి మాట్లాడుతూ, పదేళ్ల తర్వాత ఆర్థికంగా బలంగా ఉన్న ప్రభుత్వాన్ని బిజెపికి అప్పగించామన్నారు.సాకుల కోసం వెతుక్కోకుండా ఇచ్చిన వాగ్దానాలను కాషాయ పార్టీ నిలబెట్టుకోవాలని సూచించారు. 2015లో ఆప్ ప్రభుత్వం ఏర్పడినప్పుడు ఢిల్లీ మొత్తం బడ్జెట్ రూ.30,000 కోట్లు మాత్రమేనని, గత పదేళ్లలో బడ్జెట్ రూ.70,000 కోట్లకు పెరిగిందని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలు, హామీలను ఏదోసాకుతో ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తారని బిజెపి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి తాను అనుకుంటూనే ఉన్నానని అన్నారు.


**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**

**ABR. NO. 826 OF 2024**

Between:-

**M/s. Hasini Chit Funds Pvt Ltd. Hanamkonda Branch, Rep, By it's Foreman,**

... **Disputant**

VERSUS

**V.BIXPATHI & OTHERS**

... **Opponents**

3. Smt.Bonkuri Satyasree, D/o, Satyanarayana, Age: 48 Yrs, Occu: Staff Nurse MGM-Warangal, R/o: H.No. 13-4-12.Phatak Street, Mattewada. Warangal.
4. Sri Jangili Sampath, S/o, Rajeshwar Rao, Age 37 Yrs, Occu: JPA-KTPP - Chelpur R/o: H.No: 3-14-538, Vinayaka Nagar Lane-2, Hanamkonda.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on **07.03.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**

**ABR. NO. 827 OF 2024**

Between:-

**M/s. Hasini Chit Funds Pvt Ltd. Hanamkonda Branch. Rep. By it's Foreman,**

... **Disputant**

VERSUS

**M.MANASA & OTHERS**

... **Opponents**

1. Smt. Malyala Manasa, W/o, Pradeep, Age: 34 Yrs, Occu: Business, R/o: H.No: 3 49. Vallabha Nagar, Near Water Tank, Narsampet
2. Sri Mohd Amjad Ali, S/o, Ali, Age 54 Yrs, Occ: Record. Asst.MGM Warangal R/o: H.No: 4-2-287. Khanapuram Haveli, Khammam.
3. Sri Mohdammed Jaffer Ali, S/o, Abdul Ali, Age:46 Yrs, Occu: Asst Market Supervisor Agriculture Market Committe Warangal, R/o. H.No. 16-11-423. chinthal, Warangal.
4. Sri Gaddam Satyanarayana Murthy, S/o, Rajalah, Age: 48 Yrs, Occu: Sr. Asst PRL GIC Saidapur, R/o: H.No: 6-5-414, Kharkhana Gadda, Karimnagar.
5. Sri. Malyala Pradeep, S/o, Ekambaram, Age: 42 Yrs, Occu Business. R/o: H.No: 3-49, Vallabha Nagar, Near Water Tank, Narsampet.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same. The above dispute is posted on **07.03.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 am** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS WARANGAL.**

**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**

**ABR. NO. 828 OF 2024**

Between:-

**M/s. Hasini Chit Funds Pvt Ltd., Hanamkonda Branch, Rep. By it's Foreman,**

.... **Disputant**

VERSUS

**V.BIXPATHI & OTHERS**

...**Opponents**

1. Sri Wanam Bixpathi, S/o. Sammalah, Age: 40 Yrs, Occu: Grade Woker in govt. TW Boys Hostel, Narsampet, R/o: H.No: 18-75, Shanthinagar, Narsampet.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on **07.03.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ABR. NO. 829 OF 2024**

Between:-

**M/s. Hasini Chit Funds Pvt Ltd. Hanamkonda Branch, Rep. By it's Foreman,**

... **Disputant**

VERSUS

**V.BIXPATHI & OTHERS**

....**Opponents**

1. Sri Vanam Bixpathi, S/o, Sammaiah, Age: 40 Yrs, Occu Grade Woker in govt. TW Boys Hostel, Narsampet, R/o: H.No: 18-75, Shanthinagar, Narsampet
2. Sri Vanam Thirumala. W/o, Bixpathi, Age: 38 Yrs, Occ House Wife. R/o: H.No: 18-75, Shanthinagar, Narsampet.
5. Sri Jangili Sampathkumar, S/o, Rajeshwar Rao, Age:37 Yrs, Occu: Jr. Plant Attender in KTPP at chelpur, R/o: H.No: 3-14-538, Vinaykanagar lane-2. Hanamkonda.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on **07.03.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**

**ABR. NO. 830 OF 2024**

Between:-

**M/s. Hasini Chit Funds Pvt Ltd. Hanamkonda Branch, Rep. By it's Foreman,**

... **Disputant**

VERSUS

**V.RAMESH & OTHERS**

...**Opponents**

2. Sri. Jakkula Govardhan, S/o, Komuraiah, Age: 45 Yrs, Occ: Driver-II TSRTC-Bhupalpally. R/o: H.No: 4-52/1, Jangapally. Incheria, Mulugu
3. Sri Janga Amarender, S/o, Rajaiah, Age: 46 Yrs, Occu: Driver-TSRTC Warangal, R/o: H.No. 3-58/2, Jangapally, Incheria, Mulugu.
4. Sri Gondi Narsaiah, S/o, Sammaiah, Age: 58 Yrs, Occu: Head Constable-PS Kanaigudem, R/o: H.No: 3-69, Kothagudem.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on **07.03.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**

**ABR. NO. 831 OF 2024**

Between:-

**M/s. Hasini Chit Funds Pvt Ltd. Hanamkonda Branch, Rep. By it's Foreman,**

....**Disputant**

VERSUS

**SHAIK IQBAL & OTHERS**

.....**Opponents**

1. Sri Shaik Iqbel, S/o, Yakub, Age: 49 Yrs, Ocou: Business, R/o: H.No: 11-23-004, L.B. Nagar Warangal.
2. Sri Mohammed Sanvar Pacha, S/o, Afzal, Age: 45 Yrs, Occ: MNO-MGM-Warangai Rio H.No: 11-23-1644/3, L.B. Nagar, Warangal
3. Sri. Shaik Afzal, S/o, Yakub Ali, Age 37 Yrs, Occu: Business, R/o: H.No. 9-2-168, Charbouli, Warangal.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on **07.03.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 am** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS WARANGAL.**




## ప్రజల ఫిర్యాదులకు సత్వరమే పరిష్కారం

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యమిస్తూ వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సంతోష్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి 22 ఫిర్యాదులు అందాయి. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ, నర్సింగ రావు ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**ఆర్థిక అక్షరాస్యత వార్షికోత్సవ గోడ పత్రిక ఆవిష్కరణ**

జిల్లాలో ఈ నెల 24 నుండి 28 వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహించి,బ్యాంకు లావాదేవీలపై మహిళలలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సంతోష్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అధికారులతో కలిసి గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు పొదుపు, బ్యాంకులలో ఖాతా తెరవడం,బ్యాంకుల ద్వారా రుణాలు పొందడం తదితర 65 అంశాలపై వారం రోజుల పాటు జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో బ్యాంకర్లు ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమీవేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ,నర్సింగరావు,ఎల్.డి.ఎం అయ్యపు రెడ్డి పాల్గొన్నారు.

## చిల్లెపల్లి టోల్‌గేట్‌ను ఎత్తివేయాలి



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** మండలంలోని చిల్లెపల్లి టోల్‌గేట్‌ను వెంటనే ఎత్తివేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దూళిపాళ ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నేషనల్ హైవే పై 60 కిలోమీటర్ల దూరంలో టోల్‌గేట్ పెట్టాలనే నిబంధన ఉన్న కోదాడ నుండి చిల్లెపల్లి టోల్‌గేట్ వరకు కేవలం 38 కిలోమీటర్లు దూలం మాత్రమే ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రస్తుతం టోల్‌గేట్‌లో ప్రయాణికులు, వాహనదారులకు కావాల్సిన కనీస అవసరాలు తాగునీరు, రెస్ట్ రూం, అంబులెన్స్ అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన టోల్‌గేట్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అమరారపు పున్నయ్య, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు చికల రాజు శ్రీను, కొమ్మరాజు వెంకట్, గోరుగంతం శ్రీను, ఆకారపు జానకిరాములు, ఎస్‌కె బాషా పాల్గొన్నారు.

## పూలే, అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ కృషి అభినందనీయం



**ప్రజాపక్షం/భువనగిరి :** జిల్లా కేంద్రంలో సామాజిక విజ్ఞానం అందిస్తున్న పూలే అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ కృషి అభినందనీయమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలో జ్ఞాన సేవలందిస్తున్న పూలే అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్‌కి పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్ఞానం ఎవరిసొత్తు కాదని నేటి యువత మహనీయుల చరిత్రలను, విజయగాదలను చదివి తెలుసుకొని వారినుండి స్ఫూర్తి పొందాలన్నారు. అసమానతలు లేని సమాజం కోసం నిరంతరం కృషి చేసిన గౌతమ బుద్ధుడు, మహాత్మా జ్యోతిరావు పూలే, బాబాసాహెబ్ అంబేద్కర్, లెనిన్ వంటి వారి ఆశయాలు, పోరాటాలు తెలుసుకొని సమసమాజం కోసం పనిచేయాలని అన్నారు. భువనగిరిలోని పూలే అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ సమన్వయకర్త సురుపంగ శివలింగంకి పుస్తకాలను అందజేసారు.

## శివాలయ అభివృద్ధికి రూ. 40 వేల వితరణ



**ప్రజాపక్షం/సూర్యాపేట:** పిల్లలమర్రి చారిత్రక దేవాలయాల అభివృద్ధికి సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త చల్లా లక్ష్మి కాంత్ రూ. 40వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయ చైర్మన్ గవ్వ వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆ ఆర్థికసాయంతో మహాదేవ నామేశ్వరాయంలో రెయిలింగ్ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. దేవాలయ అభివృద్ధికి లక్ష్మి కాంత్ చేసిన ఆర్థికసాయం అభినందనీయమన్నారు. సోమవారం పనులను చల్లా లక్ష్మి కాంత్ శృతి దంపతులు పరిశీలించి త్రికూటాలయంలో శివయ్యకు పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ వారిని శాలువాలతో సన్మానించారు.

## త్వరలోనే నల్లగొండ రీజియన్ పరిధిలో 136 ఎలక్ట్రిక్ బస్సులు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** త్వరలోనే నల్లగొండ రీజియన్ పరిధిలో 136 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తాయని నల్లగొండ రీజినల్ మేనేజర్ కె.జానిరెడ్డి తెలిపారు. సోమవారం మిర్యాలగూడ డిపోలో పవర్ డ్రైవర్లు, కండకర్లు, సిబ్బందికి నిర్వహించిన శిక్షణ, అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ నల్లగొండ రీజియన్‌కు 72, సూర్యాపేట జిల్లాకు 64 ఎలక్ట్రిక్ బస్సులు మంజూరైనట్లు తెలిపారు. నల్లగొండ, సూర్యాపేట ఆర్టీసీ పరిధిలోని ఎలక్ట్రిక్ బస్సు చార్జింగ్ స్టేషన్లను ప్రారంబించిన వెంటనే నల్లగొండ, సూర్యాపేట జిల్లా కేంద్రాల నుంచి వివిధ ప్రాంతాలకు ఈ బస్సులు నడపనున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం ఆర్టీసీ సిబ్బంది, కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మిర్యాలగూడ డిపో నుంచి వాడపల్లి, సోమారం, సోమప్ప దేవాలయాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలిపారు. ప్రయాణీకులకు మెరుగైన సేవలు అందించడమే ఆర్టీసీ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ రామ్మోహన్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ భారతిబాయి ఉన్నారు.



# పకడ్బందీగా టెన్త్ పరీక్షలు

### అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్



**ప్రజాపక్షం/ నల్లగొండ:** మార్చి 5 నుండి మార్చి 25 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు ,మార్చి 21 నుండి ఏప్రిల్ 4 వరకు పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్ అధికారులతో కోరారు. సోమవారం అయన తన చాంబర్లో ఇంటర్, పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ విషయమై సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. పరీక్షలు జరగనున్నాయని ఆయన తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనుండగా, పదో తరగతి పరీక్షలు ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:30 వరకు జరగనున్నాయి. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను 28722 మంది విద్యార్థులు రాయనుండగా, పదవ తరగతి పరీక్షలను 18666 మంది విద్యార్థులు పరీక్షలను రాయనున్నారు. ఇంటర్ పరీక్షల కోసం 52 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, పదవ తరగతి పరీక్షలకు 105 రెగ్యులర్ కేంద్రాలు,3 ప్రైవేటు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు అదనపు కలెక్టర్ కు వివరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఆయా శాఖల అధికారులకు పలు సూచనలను, ఆదేశాలను జారీ చేశారు.ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి దశ్రు నాయక్ ,జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, విద్యు త్ ,మెడికల్, ఆర్టీసీ, ట్రాన్స్‌పోర్ట్, సమాచార, పోస్టల్, పోలీస్, పంచాయతీ రాజ్, మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్ పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలి

ప్రజావాణి ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జిల్లా అధికారులతో ప్రజావాణి ఫిర్యాదులను సమీక్షిస్తూ ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం పై జిల్లా, మండల ,గ్రామస్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఎప్పటి ఫిర్యాదులు అప్పుడే పరిష్కరించాలని, దానివల్ల ఫిర్యాదుదారులకు తక్షణ సహాయం అందుతుందని అన్నారు. కాగా ఈ సోమవారం (67 )మంది ఫిర్యాదుదారులు వారి ఫిర్యాదులను అదనపు కలెక్టర్ కు, జిల్లా అధికారులకు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమంలో ఇన్‌చార్జి డిఆర్‌ఓ వై. అశోక్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**266 పాఠశాలల నుండి 8,631 మంది విద్యార్థులు హాజరు**

**రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి**

**ప్రజాపక్షం/యాదాద్రి :** రాబోవు మార్చి 21 నుండి ఏప్రిల్ 4 వరకు జరుగు 10వ తరగతి పరీక్షలు సన్నద్ధంగా జరిగేందుకు పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ అధికారి అధ్యక్షతన జిల్లాలోని చీఫ్ సూపర్డెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులతో సమీక్షించి తగు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా రెవెన్యూ అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 266 పాఠశాలల నుండి 8,631 మంది విద్యార్థులు హాజరవుతారని, దానికి అనుగుణగన్ 50 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, ఏసిజిఈ రఘురాం రెడ్డి, డిఈసిమి సెక్రటరీ పాండు నాయక్, మండల విద్యాశాఖ అధికారులు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





**67 పరీక్ష కేంద్రాలు**

**జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు**

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** మార్చినెలలో జరిగే పదవ తరగతి పరీక్షలకు ఏలాంటి అవాంతరాలు లేకుండా సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి రాంబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పదవ తరగతి పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మార్చి 21 నుండి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరిగే పదవ తరగతి పరీక్షలకు 67 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. మొత్తం 11, 912 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నాయని ఇందులో బాలురు 6049, బాలికలు 5863 మంది హాజరు కానున్నట్లు వివరించారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు జరగనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో సూర్యాపేట ఆర్‌డిఓ వేణుమాధవరావు, డిఇఓ అశోక్, డిఎస్‌పి రవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటాచలం, ఎసిజిఇ శీనయ్య పాల్గొన్నారు.

## పెండింగ్ ప్రజా దరఖాస్తుల పరిష్కారం

### డిప్యూటీ తహసీల్దార్‌కు మెమో జారీ
### నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు
### కలెక్టర్ హనుమంతరావు హెచ్చరిక



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** పెండింగ్‌లో ఉన్న ప్రజల సమస్యల దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులను హెచ్చరించారు. సోమవారం తుర్కపల్లి మండలంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్థానిక తహసిల్దార్‌తో కలిసి సిబ్బంది యొక్క వివరాలు, హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి ఎవరెవరు ఏ పని చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ తాసిల్దార్ కల్పన కోర్ట్ కేసు రిజిస్టర్‌ను సక్రమంగా నిర్వహించలేదని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ మెమో జారీ చేశారు. రిజిస్ట్రేషన్‌కి వచ్చిన రైతులతో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ధరణిలో ఉన్న పెండింగ్ దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని తహసిల్దార్‌ను ఆదేశించి, సమయపాలన పాటించని అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేసి తీరు మారకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యాలయ పరిసర పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మండల సర్వేయర్ వద్ద సర్వే కోసం ఉన్న అప్లికేషన్ లను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. కుల ధ్రువీకరణ, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబ్బారక్, మీసేవలో ఉన్న దరఖాస్తులు మరియు ఇతర సేవలను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం తుర్కపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ సెంటర్ నంబర్ 127లో గల ఎమ్మెల్సీ ఎలక్షన్ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి ఎలా చదువుతున్నారు అని ఆరా తీశారు. పరీక్ష కాలం దగ్గరకు వస్తున్నందున అందరూ మంచిగా చదువుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఉదయం 5 గంటలకు నిద్ర లేచి చదువుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి మధ్యాహ్నం భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటకు వాడే పదార్థాలను పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. అనంతరం తుర్కపల్లి మండలంలోని మాదాపూర్ గ్రామంలో పల్లె దవాఖాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అత్యవసర విభా గం సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ దేశ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

### ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** మండలంలో గల చెరువుగట్టు శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం ను భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సందర్శించారు. సోమవారం దేవాలయానికి స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం తో కలిసి విచ్చేసిన ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డికి దేవాలయ అధికారులు,అర్చకులు సాంప్రదాయంగా ఘనస్వాగతం పలికారు. ఎంపి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు తీసుకున్నారు. ఈనెల 26న మహాశివరాత్రి పర్వదినం ఉన్నందున ఉత్సవాల ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ శివరాత్రి రోజున స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. జిల్లాలోనే ప్రఖ్యాతిగాంచిన చెరువుగట్టు దేవస్థానము అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా గిరిప్రదక్షిణ వంటి మహోత్తర కార్యక్రమంకు శ్రీకారం చుట్టడానికి స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో నవీన్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, నాయకులు దూదిమెట్ల సత్తయ్య, బండ సాగర్ రెడ్డి, వడ్డే భూపాల్ రెడ్డి, సట్టు సత్తయ్య, నేతకాని కృష్ణ, గడుసు శశిధర్ రెడ్డి, పట్టణాధ్యక్షుడు జెర్రిపోతుల భరత్, ప్రజ్ఞాపురం సత్యనారాయణ, గడ్డం పశుపతి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ల్యాబ్ సద్వినియోగంతో ఉన్నత శిఖరాలు




**ప్రజాపక్షం/బీబీనగర్ :** ఉన్నత పాఠశాల విద్యార్థులు ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను ఎదగాలని యాదాద్రి భువనగిరి జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ తెలిపారు. బీబీనగర్ మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమెరికన్ ఇండియా ఫౌండేషన్ వారు సుమారు రూ.15 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సైన్స్ టెక్నాలజీ ఇంజనీరింగ్ అండ్ మ్యాథమెటిక్స్ ల్యాబ్ ఇన్ఫర్మేషన్ అండ్ లెర్నింగ్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇందిరా ప్రేమ జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ ప్రయోగశాలలో ఉన్న పరికరాలను ఉపయోగించి టీచర్ల విద్యార్థులకు ప్రయోగ నైపుణ్యాలు నేర్పించాలని కోరారు. విద్యార్థులు ప్రయోగశాలను సద్వితీగం చేసుకొని అభ్యున్నతికి పాటుపడాలని కోరారు. అంతేకాకుండా ప్రయోగశాలలో ఉన్న పరికరాలు ప్రొజెక్టర్లు 3d ప్రింటర్ లాప్టాప్ మైక్రోస్కోప్ వివిధ రకాలైన స్పేస్ గణితము, ఫిజికల్ సైన్స్, భౌతిక రసాయన శాస్త్ర పరికరాలను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ జి.రమేష్, కోఆర్డినేటర్ జె.శ్రీనివాస్, మండల విద్యాధికారి సురేష్ రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ కె.విజయలక్ష్మి, అమెరికన్ ఇండియా ఫౌండేషన్ రీజినల్ మేనేజర్ మాలిక్ ప్రాజెక్టు ఆఫీసర్ జి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## భూ కబ్జాదారులపై చర్యలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** వక్ఫ్ బోర్డు గెజిట్ రెవెన్యూ రికార్డు ప్రకారం మొత్తం 18.09 ఎకరాల వక్ఫ్ బోర్డు భూమి నల్లగొండలోని మునుగోడు రోడ్‌లో ఉన్న సర్వే నెం.768లోని ఈద్గా గ్రేవ్ యార్డ్‌కు చెందిన భూమిని. భూకబ్జాదారులు అక్రమంగా ఆక్రమించి, విక్రయిస్తూ, వక్ఫ్ బోర్డు భూమిలో ఇళ్లను నిర్మిస్తున్నారనీ సోమవారం జిల్లా రెవెన్యూ అధికారికి ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ ఎ ఎ ఖాన్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు ఈద్గా గ్రేవ్ యార్డ్ ల్యాండ్ సర్వే జరిగింది భూమి యొక్క డిమార్కేషన్ జరిగింది. సర్వే నివేదిక ప్రకారం 18.09 భూమిలో 7.09 ఎకరాల భూమిని భూకబ్జాదారులు విక్రయించి అక్రమంగా ఆక్రమించుకున్నారనీ తెలిపారు. . ప్రస్తుత స్వీయ శైలి ఈద్గా కమిటీ వక్ఫ్ బోర్డు భూమిని భూ కబ్జాదారుల నుండి రక్షించలేదని ఆయన పేర్కొన్నారు.ప్రస్తుత వక్ఫ్ ఇన్స్పెక్టర్ ఆడిటర్ సమక్షంలో సర్వే జరిగిందనీ, అయితే ఈద్గా వక్ఫ్ భూమిని అక్రమంగా ఆక్రమించి, విక్రయించిన వ్యక్తులు భూ కబ్జాదారులకు నోటీసులు జారీ చేయడానికి అతను ఎటువంటి చర్య తీసుకోలేదని తెలిపారు.ఫిర్యాదు చేసిన వారిలో మహమ్మద్ షరీఫ్, ముహమ్మద్ అబ్దుల్ జలీల్, నుహమ్మద్ బుర్హాన్ షరీఫ్, జమీర్ అహ్మద్, షఫీక్ అహ్మద్, జానీ పాషా, ఖాన్ లు ఉన్నారు.

## మిగిలిన ఇండ్ల నిర్మాణాన్ని రెండు నెలల్లో పూర్తి చేయాలి

### రాష్ట్ర హౌసింగ్ ఎండీ వి.పి గౌతమ్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సింగిల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని తెలంగాణ రాష్ట్ర హౌజింగ్ ఎండీ. వి.పి గౌతమ్ అన్నారు. సోమవారం హుజూర్‌నగర్ పట్టణ శివారులోని ఫణిగిరి సీతారామచంద్రస్వామి గట్టు వద్ద నిర్మిస్తున్న తెలంగాణ రాష్ట్ర భారీనీటిపారుదల,ఆహార,పౌరసరఫరాల శాఖామాత్యులు నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన మోడల్ కాలనీని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌తో కలిసి రాష్ట్ర హౌజింగ్ ఎండీ. వి.పి గౌతమ్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 135 బ్లాక్‌లలో 2160 సింగిల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణ పనులు మొదలు పెట్టడం జరిగిందని, అందులో ఇప్పటి వరకు 88 బ్లాక్‌లలో 1408 ఇండ్ల నిర్మాణం పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. మోడల్ కాలనీలో రోడ్లు,డ్రైనేజీ,విద్యుత్,త్రాగునీరు వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. ప్రజలకు కావాల్సిన మరిన్ని మౌలిక సదుపాయాలను తక్షణమే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మిగిలిన ఇండ్ల నిర్మాణాన్ని రెండు నెలలలో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ శ్రీనివాసులు,హౌజింగ్ ఎస్.ఈ వెంకటదాస్ రెడ్డి,పిడీ ధర్మారెడ్డి,ఏఈ సా యిరాం రెడ్డి,మున్సిపల్ కమీషనర్ కె.శ్రీనివాస్‌రెడ్డి,అబ్దుల్లా,విజయ్ పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో దంపతుల అరెస్ట్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** దొంగతనం కేసులో దంపతులను పోలీసులు అరెస్ట్ చేసిన సంఘటన సోమవారం పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ ఇన్‌చార్జి సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని సుందర్‌నగర్‌కు చెందిన వేముల కోటేష్ 2010 నుంచి 2024 వరకు రాష్ట్ర వ్యాప్తంగా మిర్యాలగూడతో పాటు వాడపల్లి, హాలియా, నకిరేకల్, నార్కట్‌పల్లి, నల్లగొండ, సూర్యాపేట, నేరేడుచర్ల, హుజూర్‌నగర్, గుండ్లపల్లి, చౌటుప్పల్, భువనగిరి, ఆదిభట్ల, గుర్రంపోడు, వలిగొండ, అచ్చంపేట, కట్టంగూర్ పోలీస్‌స్టేషన్ల పరిధితోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని గురజాల, రెంటచింతల ప్రాంతాల్లో దొంగతనం కేసులు నమోదు కావడంతో ఆయా కేసుల్లో జైలు జీవతం గడిపి వచ్చాడు. అంతేకాకుండా 2024 మార్చి నెలలో వేముల కోటేష్ భార్య కృష్ణవేణిలపై దొంగతనం కేసులు నమోదు కావడంతో పోలీసులు ఇద్దరిని జైలుకు పంపారు. గత సంవత్సరం జూలై నెలలో జైలు నుంచి విడుదలైన ఆ దంపతులిద్దరు తమ పద్ధతులను మార్చుకోకుండా రైళ్లలో, బస్సుల్లో తిరుగుతూ ప్రాంతాల్లో అనేక దొంగతనాలు చేశారు. వీరిద్దరిపై నిఘా పెట్టిన పోలీసులు సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని ప్రకాశ్‌నగర్‌లో తాళం వేసి ఉన్న ఇంటి వద్ద బయట కాపలాగా ఉన్న భార్య కృష్ణవేణిని ఉంచి దొంగతనం చేసేందుకు సిద్ధంగా ఉన్న కోటేష్‌లను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరిద్దరిపై మొత్తం 40కేసులు ఉన్నాయని, వీరి వద్ద నుంచి 97.9 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాదీనం చేసుకోని రిమాండ్‌కు తరలించామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వీరబాబు, ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు అక్బర్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

## ఉస్తేల సీతరాంరెడ్డి మృతి బాధాకరం

**ప్రజాపక్షం/చింతలపాలెం:** సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండల కేంద్రానికి చెందిన సిపిఐ సీనియర్ కార్యకర్త ఉస్తేల సీతరాంరెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆయన మృతి పట్ల సోమవారం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్‌రావు, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆనాడు మల్లారెడ్డిగూడెంలో జరిగినటువంటి భూపోరాటంలో పార్టీకి ఎల్లప్పుడు అండగా ఉంటుందని అన్నారు. ఆయన మృతి పట్ల సిపిఐ పార్టీకి తిరనిలోటు అని అన్నారు. సీతరాంరెడ్డిపార్థీవ మృతదేహానికి మెడికల్ కళాశాల అందజేశారు. ఈ కార్యక్ర మంలో సిపిఐ నాయకులు ఉస్తేల సృజన, నారాయణ రెడ్డి, కంబాల శ్రీనివాసరెడ్డి, కంబాల శ్రీనివాస్, అబ్దుల్‌పాషా, జియాలుద్దీన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# పకడ్బందీగా టెన్త్, ఇంటర్ పరీక్షల నిర్వహణ

*ఇంటర్‌కు 72, పదికి 97 పరీక్షా కేంద్రాలు *మార్చి ఐదు నుంచి 25 వరకు ఇంటర్ పరీక్షలు*మార్చి 21 నుండి ఏప్రిల్ నాలుగు వరకు పది పరీక్షలు*సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రాబోయే ఇంటర్, పదవ తరగతి పరీక్షలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఇంటర్, పది పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి ఐదు నుంచి మార్చి 25 వరకు ఇంటర్ పరీక్షలు, మార్చి 21 నుండి ఏప్రిల్ నాలుగు వరకు పది పరీక్షల నిర్వహణకు జిల్లాలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం 72, పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం 97 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశామని అధికారులు తెలిపారు. పదవ తరగతి పరీక్షలకు సంబంధించి మార్చి 6న ఒక సెట్, 10న రెండవ సెట్ ప్రశ్నా పత్రాలు జిల్లాకు వస్తాయని వీటిని ట్రెజరీ రూమ్‌లో భద్రపరిచి జిల్లాలో ఆరు రూట్లలో ప్రశ్నా పత్రాల తరలింపు ఉంటుందన్నారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, ప్రశ్నా పత్రాల తరలింపు సమయంలో పోలీస్ ఎస్కార్ట్ ఉండాలన్నారు. జిల్లాలో పదవ తరగతి పరీక్షలకు ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామని ప్రతి పరీక్ష కేంద్రం వద్ద సీనియర్ అసిస్టెంట్ క్యాడర్‌లో సిట్టింగ్స్ స్క్వాడ్ ఉంటుందని వీరందరికీ స్పష్టమైన ఆర్డర్స్ అందించాలని అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ప్రశ్నా పత్రాల తరలింపు కోసం అవసరమైన వాహనాలను రహణా శాఖాధికారి ఏర్పాటు చేయాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని త్రాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, కనీస మందులతో పారామెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పబ్లిక్ పరీక్షల నిర్వహణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు హాజరయ్యేవిధంగా ఆర్టీసి బస్సులు నడపాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేయాలని, పరీక్షలు ముగిసిన తర్వాత పోస్టల్ శాఖ ద్వారా జవాబు పత్రాలు సరిగ్గా పంపేందుకు ఏర్పాట్లు పకడ్బందీగా క్లోస్డ్ కంటెయినర్‌లలోనే జరగాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ, డిపివో ఆశాలత, ట్రాన్స్‌కో ఎస్ఈ సురేందర్, డిఎంఅండ్‌హెచ్‌వో కళావతిబాయి, మిషన్ భగీరథ ఇఇ పుష్పలత, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కూనంనేనికు ఆహ్వానం



**ప్రజాపక్షం/పాల్వంచ :** పట్టణ పరిధి బొల్లరిగూడెంలో వెంచేసియున్న శ్రీ లలిత కామేశ్వరస్వామి వారి శివాలయంలో మహా శివరాత్రిని పురస్కరించుకొని ఈ నెల 27న జరిగే మహా అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును ఆహ్వానించారు. సోమవారం కొత్తగూడెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కూనంనేనికు ఆలయ ధర్మకర్త శివలెంక ఆశ్విని కుమార్, కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ స భ్యులు శనగ రామచందర్‌రావు, సమ్మిడి జనార్ధన్ రెడ్డి, ముడిక శ్రీనివాసరా వు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి



**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలంగాణ రాష్ట్రంలోని అగ్రిగోల్డ్ సంస్థ ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని బాధితులు కోరారు. సోమవారం తెలంగాణ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం ఆధ్వర్యంలో గ్రీవెన్స్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కంపెనీ 1996లో ప్రారంభించబడిందని ప్రజల నుంచి పెద్ద మొత్తంలో డిపాజిట్లు సేకరించి వంచించారని ఆయన తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో రూ. 5వేల కోట్లు వసూలు చేసి ఆస్తులు కొనుగోలు చేశారని, రిసార్ట్స్ నిర్మించారని ఆయన తెలిపారు. ఒక తెలంగాణ రాష్ట్రంలోనే రూ. 500 కోట్ల వరకు చెల్లించాల్సిన సొమ్ము ఉంటుందని ఆయన తెలిపారు. అగ్రిగోల్డ్ ఆస్తులను వేలం వేసి బాధితులకు చెల్లించాలని ఆయన కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గోగుల వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గుడిమెట్ల రజిత, బాధితుల సంఘం నాయకులు మునగంటి వీరబ్రహ్మాచారి, తేనె వెంకయ్య, అనసూర్య, పరిమళ, విజయ, కృష్ణ, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన తప్పదు: టియుడబ్ల్యుజె

**ప్రజాపక్షం/ఖమ్మం :** జర్నలిస్టుల సమస్యలను ప్రస్తుత ప్రభుత్వం పరిష్కరించడంలో నిర్లక్ష్య ధోరణిని అవలంభిస్తుందని టియుడబ్ల్యుజె (ఐజెయు) రాష్ట్ర కార్యదర్శి కె. రాంనారాయణ ఆరోపించారు. అక్రిడేషన్లు, ఇండ్ల స్థలాల సమస్యలతో పాటు ఇతర సమస్యలు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని ఆయన తెలిపారు. టియుడబ్ల్యుజె (ఐజెయు) స్టీరింగ్ కమిటీ సమావేశం సోమవారం జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రాంనారాయణ మాట్లాడుతూ ఒక పక్క జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూనే మరో పక్క సంఘ నిర్మాణాన్ని పటిష్టం చేయాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన అక్రిడేషన్ల విషయంలో ఒక నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమన్నారు. హెల్త్‌కార్డుల సమస్య కూడా పెండింగ్‌లో ఉందని పలువురు జర్నలిస్టులు సరైన సమయంలో వైద్యం అందక ప్రాణాలను కోల్పోతున్నారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో టియుడబ్ల్యుజె (ఐజెయు) ఖమ్మంజిల్లా మహాసభలను మార్చి చివరి వారంలో వైరాలో నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. దీనితో పాటు మాటేటి వేణుగోపాల్ కన్వీనర్‌గా క్రమశిక్షణ కమిటీని, మైసా పాపారావు కన్వీనర్‌గా, సభ్యత్వ స్క్రూట్నీ కమిటీని ఏనుగు వెంకటేశ్వరరావు కన్వీనర్‌గా మహాసభల నిర్వహణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి ఏ నుగు వెంకటేశ్వరరావు, రాష్ట్ర సమితి సభ్యులు సామినేని మురారి, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర బాధ్యులు నర్వనేని వెంకట్రావు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి కనకం సైదులు, చెరుకుపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కోల్డ్ స్టోరేజీ యజమానికి రూ.10 వేల జరిమానా



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మంలో కోల్డ్ స్టోరేజీ యజమానికి ఖమ్మం మున్సిపల్ అధికారులు రూ. 10 వేల జరిమానా విధించారు. నగరంలోని 28వ డివిజన్ ప్రకాష్ నగర్ పరిధిలో గల కోల్డ్ స్టోరేజీలోని క్లినింగ్ వె స్ట్ మెటీరియల్‌ను పక్కనే ఉన్న ఓపెన్ ప్లాటులో పోస్తున్నారు. ఆ ప్లాట్ యజమాని మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు ఫిర్యాదు చేశాడు. కమిషనర్ ఆదేశాల మేరకు శానిటరీ సూపర్ వైజర్ సాంబయ్య సోమవారం ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించి కోల్డ్ స్టోరేజీ యజమాని కి రూ. 10 వేల జరిమానా విధించారు. ఈ కార్యక్రమ ంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్లస్వామి, కె. మల్లయ్య, జ వాన్లు తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో భట్టి సహాయకుని మృతి



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వ్యక్తిగత సహాయకుడు తక్కెళ్లపల్లి శ్రీనివాస్ (48) తీవ్రమైన గుండెపోటుతో సోమవారం ఉదయం మరణించారు. గుండెనొప్పి రావడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా ఆయన ప్రాణాలు కోల్పోయాడు. శ్రీనివాస్ ఐసిడిఎస్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ డిప్యూటేషన్‌పై భట్టివిక్రమార్క వద్ద పిఏగా పనిచేస్తున్నారు. ప్రజా సమస్యల పట్ల అవగాహన, స్పందించే తత్వం ఉన్న శ్రీనివాస్ మరణం పట్ల పలువురు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. శ్రీనివాస్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. శ్రీనివాస్ మృతిపట్ల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర సంతాపాన్ని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శ్రీనివాస్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ శ్రీనివాస్ మృతి సమాజ పరంగా, వ్యక్తిగతంగా నాకు సామాజిక సేవకు నష్టమన్నారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, కాంగ్రెస్ నాయకురాలు, అమ్మ ఫౌండేషన్ ఛైర్మన్ మల్లు నందిని, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సిపిఐ జిల్లా నాయకులు చెరుకుపల్లి భాస్కర్, దండి రంగారావు, రవి, నరేందర్, పెద్ద తండా టిఎన్‌జీవోస్ కాలనీలోని శ్రీనివాస్ మృతదేహాన్ని సంర్శించి నివాళులర్పించారు.

## సత్వరమే దరఖాస్తుల పరిష్కారం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజావాణిలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి ఎ. పద్మశ్రీ, డిఆర్‌డిఒ సన్యాసయ్యలతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కలెక్టరేట్‌లో కార్యాలయాలు ఏర్పాటు చేసిన వివిధ శాఖలు వారి పరిధిలో ఉన్న ప్రభుత్వ భవనాల వివరాలు నివేదికను మంగళవారం సాయంత్రం లోగా అందజేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. తల్లాడ మండలం మల్లారం గ్రామానికి చెందిన షేక్ అషిఫ్ తన కుమారున్ని శ్రీచైతన్య కళాశాలలో చేర్పించి అనారోగ్యం కారణంగా ఒక రోజులోనే ఇంటికి తిరిగి తీసుకు వచ్చామని కళాశాల వారు ఒక రోజుకు రూ .15,500 ఫీజు కట్ చేసుకున్నారని తనకు తన డబ్బులు ఇప్పించాలని దరఖాస్తు చేశారు. మధిర ప్రాంతానికి చెందిన కాటారపు జయరాజు తన కుమార్తె ఇంటర్ చదువుతుందని జనన ధృవీకరణ పత్రం కోసం రెండు నెలల నుంచి తిరుగుతున్నానని త్వరగా బర్త్ సర్టిఫికెట్ ఇప్పించాలని కోరారు. పెనుబల్లి మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన కోర్సా ప్రభాకర్ తాము 1985 నుంచి పోడు భూములను సాగు చేసుకుంటున్నామని 2022లో 3.09 ఎకరాల భూమికి సంబంధించి తమకు ఆర్ఒఎఫ్ఆర్ సర్వే వచ్చిందని కానీ పట్టాదారు పాసుపుస్తకం 1.06 ఎకరాలకు మాత్రమే వచ్చిందని మిగిలిన దానికి కూడా పాసుపుస్తకం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. సంబంధిత దరఖాస్తులను పరిశీలించిన అదనపు కలెక్టర్ వాటిని సత్వరమే పరిష్కరించాలని ఆయా శాఖాల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారిణి ఎ. అరుణ తదితరులు పాల్గొన్నా రు.

## జవాన్లకు రెండు రోజుల జీతం కట్

పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించిన కమిషనర్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విధి నిర్వహణలో అలసత్వం వహించిన ముగ్గురు జవాన్లకు రెండు రోజుల జీ తం కట్ చేయాలని ఖమ్మం నగర పా లక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య శానిటరీ సూపర్ వైజర్‌కు ఆదేశా లు జారీ చేశారు. పారిశుధ్య పరిశీలనలో భాగంగా ఖ మ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య నగర ంలో ని 27, 22, 32, 33 డివిజన్లలో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఆయా డివిజన్లలో ఎ ంత మంది వ ర్కర్లు పనిచేస్తున్నారు, ఏ పనికి ఎంత మ ందిని ఉపయోగిస్తున్నారు. కాలువలు శుభ్రం చేయడానికి, ట్రాక్టర్, ఆటోకు ఎంత మందిని పంపుతున్నారు వంటి వివరాలను జవాన్, ఇన్‌స్పెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. 32, 33, 36 డివిజన్లలో రోడ్లపై చెత్తకుప్పలు, డిబ్రిస్ రోడ్డుపై ఉన్నందుకు రోడ్డు ప క్కన చెట్టు కొమ్మలు నరికినవి తీయకుండా అలాగే ఉంచడాన్ని గుర్తించా రు. ఆయా డివిజన్ల జవాన్లు శ్రీను, మోహన్ రావు, శివలకు రెండు రోజుల జీతం కట్ చేయాలని కమిషనర్ శానిటరీ సూపర్‌వైజర్‌ను ఆదేశించారు.

**అర్జీలను స్వీకరించిన కమిషనర్ :** ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమ ంలో కమిషనర్ అభిషేక్ అగస్త్య పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను అదే రోజు పరిష్కారమయ్యే లా తగు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 6 0వ డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీలు కావాలని దరఖాస్తు చేశారు. 19వ డివిజన్‌లో కొత్త పంపు కనెక్షన్ ఇవ్వాలని దరఖాస్తు చేశారు. రెండవ డివిజన్‌లో ఎలక్ట్రికల్ పోల్స్ కావాలని దరఖాస్తు చేశారు. ముస్తఫానగర్‌లో తన ఇ ంటికి రెండు పన్నులు వస్తున్నాయని ఇంటి యజమాని దరఖాస్తు చేశారు. దివ్యాంగుడు తనకు ఉపాధి కల్పించాలని కమిషనర్‌కు దరఖాస్తు చేశారు.

## ప్రజా సమస్యలపై పోరాడేది 'కమ్యూనిస్టు పార్టీ'



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** ప్రజా సమస్యలపై పోరాడేది ఏకైక కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అని రాష్ట్ర సమితి సభ్యులు సద్యద్ సలీం పేర్కొన్నారు. అశ్వారావుపేట నియోజకవర్గం మున్సిపాల్టీగా మారిన సందర్భంగా మండలంలోని ఫామాయిల్ ఫ్యాక్టరీ ఎదురు గల గిరిప్రసాద్ నగర్‌లో సిపిఐ పట్టణ మహాసభను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవటం జరిగింది. పట్టణ కార్యదర్శిగా నూకవరపు విజయ్‌కాంత్, కార్యదర్శులుగా సయ్యదర్ జాకీర్, జక్కం బలరాం, జోగిరాజ, కౌన్సిల్ సభ్యులను ఎన్నుకోవటం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ నిర్మాణం అనేది ఏ ఒక్క వ్యక్తి వల్ల సాధ్యమయ్యేది కాదని, అది ప్రతి సిపిఐ కార్యకర్త నాయకుని కృషి వల్ల మాత్రమే సాధ్యమవుతుందన్నారు. దానిలో భాగంగా టౌన్‌లో 58మందితో కౌన్సిల్ ఏర్పాటు చేసి రానున్నభవిష్యత్‌లో ప్రతిఒక్కరూ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నారాటి ప్రసాద్, సిపిఐ మండల కార్యదర్శి గన్నిన రామకృష్ణ, టౌన్ కార్యదర్శి నూకవరపు విజయ్ కాంత్, కాలపాల రమేష్.రమాదేవి పాల్గొన్నారు.

## ప్రాంగణ నియామకాల్లో 13 మంది ఎంపిక



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రముఖ నిర్మాణ సంస్థ ఎస్ఎల్ఎస్ బిల్డ్‌కా న్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు తమ కళాశాల విద్యార్థులు 13 మంది ఎం పికైనట్లు ఎస్‌బిఐటి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. టెక్నాలజీతో పాటు నిర్మాణ రంగంలో కూడా ఎన్నో ఆధునీక మార్పులు చోటు చేసుకున్నాయ ని కృష్ణ తెలిపారు.కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండె ంట్ డా॥ జి. ధాత్రి మాట్లాడుతూ కోర్ బ్రాంచ్‌ల మనుగడ కష్టమైన తరుణంలో కూడా తమ కళాశాల సివిల్ విద్యార్థులు ప్రతిభను కనబర్చి ఉద్యోగాలు సాధించార ని ఆమె తెలిపారు. గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీ ఉద్యోగాలకు గాను గుడ్లవల్లేరులో నిర్వహించిన ప్రాంగణ ని యామకాలకు వివిధ కళాశాల నుంచి విద్యార్థులు పా ల్గొనగా తమ కళాశాల విద్యార్థులు ముందు వరుసలో నిలిచారని ఆమె తెలిపారు. ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీగా ఎంపికైన విద్యార్థులకు వార్షికాదాయం రూ. 2.16 లక్షలు ఉ ంటుందని తెలిపారు. హైదరాబాద్ కేంద్రంగా నిర్వహి ంచబడుతున్న ఎస్ఎల్ఎస్ బిల్డ్‌కాన్ సంస్థ భారీ ప్రాజెక్టులతో నిర్మాణ రంగంలో తమకంటూ ప్రత్యేక స్థా నాన్ని సంపాదించుకుందన్నారు. సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులను క ళాశాల యజమాన్యం అభినందించింది. ఈ కార్యక్రమ ంలో అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్ కుమార్, శ్రీనివాసరావు, శివప్రసాద్,టిపిఒ, కోఆర్డినేటర్ ప్రభాకర్‌పాల్గొన్నారు.

## అభ్యాసన సామర్ధ్యాల పెంపుదలే లక్ష్యం




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** పిల్లలలో అభ్యసన సామర్ధ్యాలు పెంపుదలే లక్ష్యంగా కృత్రిమ మేధ పని చేస్తుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం కృత్రిమ మేధ ఆధారిత అభ్యసన సామర్ధ్యాల మెరుగుదల అనే కార్యక్రమాన్ని బూర్గంపాడు మండలంలోని ఐదు పాఠశాలలను సందర్శించి, ప్రారంభించారు. అనంతరం ఆయా పాఠశాలల్లో తల్లిదండ్రులతో మాట్లాడుతూ పిల్లలకు ఇంటి వద్ద చదువుకునే వాతావరణం కల్పిస్తే పిల్లలు అధ్భుత ఫలితాలు సాధిస్తారని తెలిపారు. అదే విధంగా ఈ రోజు ప్రారంభించిన కృత్రిమ మేధ ఆధారిత అభ్యసన సామర్ధ్యాల మెరుగుదల అనే కార్యక్రమం పిల్లలు నేర్చుకోవడంలో ఎంతో సహాయకారిగా ఉంటుందన్నారు. ఈకార్యక్రమాన్ని మన జిల్లాలో ప్రయోగాత్మకంగా ఆరు పాఠశాలలో ప్రారంభించడం జరిగిందని, దీనిని క్రమం తప్పకుండా ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు వాడుతూ పిల్లలకు సామర్ధ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. దీనికై తల్లిదండ్రులు కూడా తమ సహాయ సహకారాలు అందిస్తూ పిల్లల్ని ప్రోత్సహించాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం వెంకటేశ్వర చారి, జిల్లా విద్యాశాఖ అడాడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్, మండల విద్యాశాఖ అధికారి ఎదు సింహారాజు, తహసీల్ధార్ ముజాహిద్, ఎంపీడీవో జములారెడ్డి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చివరి ఆయకట్టు వరకు సాగునీరు: కలెక్టర్



**ప్రజాపక్షం/పెనుబల్లి:** రైతుల పంట పొలాలకు సాగు నీటి విడుదల సమయంలో చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ పెనుబల్లి మండలం గ్రామంలో పర్యటించి వ్యవసాయ పొలాల వెంబడి రెండు కిలోమీటర్ల వరకు నడుస్తూ రైతులతో ముచ్చటించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ సాగు నీటి విడుదల షెడ్యూల్‌ను సంబంధిత ఆయకట్టు రైతులకు ముందుగానే సమాచారం అందించాలని అధికారులకు తెలిపారు. టెయిల్ ఎండ్ విధానంలో సాగునీరు సరఫరా జరగాలని ముందుగా చివరి ఆయకట్టు ప్రాంతాలకు నీరు విడుదల కావాలని అన్నారు. మండలంలో రైతులకు అవసరమైన మేర యూరియా నిలువలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి సహకార సంఘం వద్ద యూరియా నిల్వలు ఉండాలని, ఎప్పటి కప్పుడు నిల్వలను పరిశీలిస్తూ స్టాక్ విషయమై పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో పెద్ద రైతులతో ఇతర రైతులకు సాగు పద్ధతులు, వ్యవసాయ అధికారులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో అమలు అవుతున్న పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలని అ న్నారు. రైతులు లాభసాటి పంట సాగు చేయాలని అన్నారు. వ్యవసాయంతో పాటు పాడి పశువులు పెంచుకుంటే మనకు ఆదాయం లభిస్తుందని కలెక్టర్ సూచించారు.రైతుల పిల్లలు ఎక్కడ చదువుతున్నారు, గ్రా మంలో త్రాగునీటి సరఫరా, పాఠశాల, ఆసుపత్రి పనితీరు ఎలా ఉన్నది మొదలగు వివరాలను తెలుసుకున్నారు .ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఇ వాసంతి, వ్యవసాయ శాఖ ఏడి శ్రీనివాస రెడ్డి, పెనుబల్లి మండల తహసీల్దార్ జి. సుధీర్, ఎంపిడిఓ డి. అన్నపూర్ణ, మండల వ్యవసాయ అధికారి ప్రసాద్, శ్రీనివాస్, ఇరిగేషన్ ఏఇ ఖాదర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## మోడల్ పాఠశాల, కళాశాలను తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/పెనుబల్లి:** నూతన అంశాలను నేర్చుకోవాలనే ఉత్సుకత విద్యార్థులు అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ పెనుబల్లి మండలం, గ్రామంలో పర్యటించి తెలంగాణ మోడల్ పాఠశాల, కళాశాలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయుడిలా 10వ తరగతి విద్యార్థులకు కలెక్టర్ సోషల్ స్టడీస్ క్లాస్ తీసుకున్నారు. బెంగాల్ విభజన, ఇండియా మ్యాప్, వాతావరణం వంటి పలు అంశాలను కలెక్టర్, చాక్ పీస్ తో బోర్డుపై బొమ్మలు వేస్తూ విద్యార్థులకు కులంకుశంగా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నతమైన లక్ష్యాలను పెట్టుకోవాలని, వాటి సాధన దిశగా నూతన అంశాలను నేర్చుకోవాలనే ఉత్సుకతను అలవర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. రాబోయే పదవ తరగతి పరీక్షలలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని కలెక్టర్ తెలిపారు. మనం వీక్‌గా ఉన్న సబ్జెక్టుపై శ్రద్ధ పెట్టాలని, గతంలో జరిగిన పరీక్షల ప్రశ్నా పత్రాలను పరిశీలించి రెగ్యులర్ గా వచ్చే ప్రశ్నలకు సంపూర్ణంగా సిద్ధం కావాలని అన్నారు. తరగతి గదిలో బాగా చదివే పిల్లలు కొంత వెనుకబడిన పిల్లలకు సహాయం చేయాలని, ఇతరులకు మనం ఒక అంశాన్ని బోధిస్తే ఆ అంశం మనకు బాగా గుర్తుంటుందని అన్నారు. రాబోయే నెల రోజులపాటు విద్యార్థులు సెల్ ఫోన్, టీవీ లకు దూరంగా ఉండాలని, పూర్తి సమయం పరీక్షలకు సిద్ధమయ్యేందుకే కేటాయించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి రోజు ఉదయం సమయం లేచి చదువు కోవాలని అన్నారు.పెట్రోల్ లేకుండా కారు నడవడం ఎలా సాధ్యం కాదో, అదేవిధంగా ఖాళీ కడుపులతో ఉంటే చదువు మెదడుకు ఎక్కదని, విద్యార్థులు తప్పనిసరిగా బ్రేక్ ఫాస్ట్ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు ప్రణాళిక ప్రకారం సిద్ధం కావాలని అన్నారు. జీవితంలో ఎదురు దెబ్బలు సహజమని, అట్టి పరిస్థితులను ఎదుర్కొని లక్ష్యం దిశగా కృషి చేసిన వారే విజయం సాధిస్తారని కలెక్టర్ తెలిపారు. అనంతరం పాఠశాలలో టాయిలెట్స్ ఎలా ఉంటున్నాయి, రెగ్యులర్ గా క్లీన్ చేస్తున్నారా, మధ్యాహ్న భోజనం నాణ్యత ఎలా ఉంది, స్నాక్స్ ఏం ఇస్తున్నారు మొదలగు వివరాలను కలెక్టర్ పిల్లలను అడిగి తెలుసుకున్నారు. ఇంకనూ కావాల్సిన వసతులను గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రిన్సిపాల్ రాంప్రసాద్, పెనుబల్లి మండల విద్యాధికారి సత్యనారాయణ, తహసీల్దార్ సుధీర్, ఎంపిడిఓ అన్నపూర్ణ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## యూరియా కోసం 'క్యూ' కట్టారు

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** జగిత్యాల జిల్లాలో యూరియా కొరత తీవ్రమై పోయింది. ఫర్టిలైజర్ కొరకు రైతులు తీవ్రంగా కష్టపడుతున్నా, సరైన స్థాయిలో ప్రభుత్వం సరఫరా చేయలేక పోతోందని రైతులు విమర్శిస్తున్నారు.దీంతో రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ముందు పెద్ద ఎత్తున క్యూ కట్టి ఎదురు చూస్తున్నారు.రైతులు పాస్ బుక్స్, ఆదార్ కార్డులు అందుకొని లైన్‌లో నిలబడి, యూరియాను కొనుగోలు చేసేందుకు గంటలపాటు వేచి ఉండాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తచేస్తున్నారు. యూరియా కొరత వలన రైతులు నష్టపోయే ప్రమాదముంది. పంటల కోసం యూరియా అత్యవసరం కావడంతో అనేక ప్రాంతాల్లో రైతులు ఆందోళనలు చేపట్టారు. యూరియా సరఫరా కోసం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పంటలు పెరిగే సమయం కావడంతో, యూరియా లేక పోవడం రైతులకు తీవ్ర నష్టం వాటిల్లనుంది.అధికారులు స్పందించి, రైతుల అవసరాలను తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఆర్థిక తోడ్పాటు అందించండి



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని జిడికె 2వ ఇంక్లైన్‌లో ఎఐటియుసి మెంబర్‌షిప్ సంతకాల సేకరణలో భాగంగా సోమవారం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ పాల్గొన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం, సంస్థ పరిరక్షణ కోసం పోరాటాలు, ఉద్యమాలు చేస్తున్న ఏఐటియుసికి మెంబర్‌షిప్ కోసం కార్మిక వర్గం సంతకాలు చేసి ఆర్థిక తోడ్పాటును అందించాలని కోరారు. ఎఐటియుసి ఆర్జీవన్ బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీను, బ్రాంచి కోశాధికారి ఎస్ వెంకట్ రెడ్డి, పిట్ సెక్రటరీ పొన్నాల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## రికార్డుల నిర్వహణ పటిష్టంగా ఉండాలి

### పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్:** భూముల సర్వే సరిహద్దు రికార్డుల నిర్వహణ పటిష్టంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్ లో జిల్లాలోని సర్వేయర్లకు నూతనంగా 8ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వేయర్లు పనితీరు మెరుగు పర్చుకోవాలని, వారి నాణ్యమైన పనితీరుకు దోహదపడే విధంగా నూతనంగా అందించిన 8 ల్యాప్‌టాప్‌లను వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే ల్యాండ్ రికార్డ్ శ్రీనివాసులు, సర్వేయర్లు అనిల్, సునీల్, నరేష్, శ్రీనివాస్ కృష్ణప్రియ ,రాధిక, రాజశేఖర్, చారి ,రఘుపతి , సాయి చరణ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా ఎంఎల్‌సి ప్రచారం



**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎంఎల్‌సి అభ్యర్థి నరేంధర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఎంఎల్‌సి జీవన్‌రెడ్డి ఎన్నికల ప్రచారాలనుజోరుగా కొనసాగిస్తున్నారు.జగిత్యాల పట్టణంలోని ధరూర్ క్యాంపు కోదండ రామాలయంలో వద్ద గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ వారిని జీవన్‌రెడ్డి కలిసి నరేంధర్‌రెడ్డి కి ఒక్క అవకాశం కల్పించాలని కోరారు. అదేవిధంగా 2019 పట్టభద్రుల ఎన్నికలలో ప్రాంతాలకు అతీతంగా పార్టీలకు అతీతంగా తానను పట్టభద్రులుగా గెలిపించారని తాన స్థానంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేంధర్‌రెడ్డి గెలిపించాలని కోరారు.

## ఇందిరమ్మ మోడల్‌హౌస్ పనుల పరిశీలన



**ప్రజాపక్షం / మల్లాపూర్ :** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ పనులను జెడ్పి సిఈవో గౌతం రెడ్డి సోమవారం పరిశీలించారు. పనులను పరిశీలించినిర్మాణాల్లో జాప్యం లేకుం డా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వీరి వెంట ఎంపిడివో శశికుమార్, పంచాయితీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అందె నరేష్, కార్యాలయ సూపరింటెండెంట్, పంచాయతీ కార్యదర్శులు రంజిత్, బాలచందర్, అశోక్, శ్రీధర్ ఉన్నారు.

## పరిశోధనలతోనే వైజ్ఞానిక ప్రగతి



**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** పరిశోధనలతోనే వైజ్ఞానిక ప్రగతి మెరుగుపడుతుందని పరిశోధనలపై విద్యార్థులకు ఆసక్తిని పెంచడం కోసం విద్యార్థులకు సైన్స్ విషయాలపై అవగాహన పెంచడం కోసం సైన్స్ ఎక్స్‌పోను నిర్వహిస్తున్నామని శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ పల్లె రాజిరెడ్డి అన్నారు. సిరిసిల్ల పట్టణ కేంద్రంలోని శ్రీ కృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో సోమవారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను రాజు రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడారు. ఈ జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకల్లో కలాం ఇన్స్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెన్స్ సహకారంతో ఇస్రో, డిఆర్‌డివో సంబంధించిన మోడల్స్ శాటిలైట్ రాకెట్స్ మిసైల్స్ ప్రదర్శించి వివరించారు. విద్యార్థిని విద్యార్థులు సుమారు 200 మోడల్స్‌ను ప్రదర్శించి వారి ప్రతిభను చాటారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు ఇతర ప్రవేట్ పాఠశాలలు విద్యార్థులు పాల్గొన్నారు.

## జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

**ప్రజాపక్షం/వీర్నపల్లి:**ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వూట్కూరి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలనిసోమవారం ప్రచారం నిర్వహించారు.మండల కేంద్రంలోని శాంతినగర్ గ్రామంలో పట్టభద్రుల ఇంటికి వెళ్లి ఎన్నికల కరపత్రాలను అందించారు. నరేందర్‌రెడ్డిని గెలిపించుకుంటే ఎల్లవేళలాఅందుబాటులో ఉంటారని, సమస్యలను సత్వరం పరిష్కరిస్తారని, ప్రతిపక్షాల మాయమాటలకు మోసపోవద్దని కోరారు. కా కాంగ్రెస్ సీనియర్ నాయకులు బానోత్ రాజునాయక్, గ్రామశాఖ అధ్యక్షులు భూక్య ప్రకాష్‌నాయక్ తో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫీజుల నియంత్రణ కోసం దీక్ష

### ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జెర్రిపోతుల జనార్ధన్



**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి :** రాష్ట్ర వ్యాప్తంగా శ్రీచైతన్య. నారాయణ కళాశాలల ముందస్తు అడ్మిషన్లు ప్రారంభించిందని, విద్యాసంవత్సరం పూర్తికాకముందే జిల్లాలో పిఆర్‌ఓలను పెట్టుకొని ప్రచారం చేస్తుందని, తల్లిదండ్రులు మాయమాటలు చెప్పి అడ్మిషన్లు తీసుకుంటున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జెర్రిపోతుల జనార్ధన్ అన్నారు. అధికారులు ప్రభుత్వ కార్పొరేట్ కళాశాలల ఆగడాలకు అడ్డుకట్టవేయాలన్నారు. సోమవారం సిద్దిపేట గురువారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా శ్రీచైతన్య, నారాయణ తమ కళాశాలల్లో ప్రవేశం పొందాలని గ్రామాల్లో తిరుగుతున్నారని , దీనిపై విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఆ కళాశాలల్లో విద్యార్థులు, శారీరక, మానసిక ఇబ్బందులు ఎదుర్కోంటున్నారని , విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. విద్యార్థుల ఆత్మహత్యలు కారణమవుతున్న శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థలకు రాష్ట్ర వ్యాప్తంగా సీజ్ చేయాలన్నారు. ముందస్తు అడ్మిషన్లు కోసం కోసం తిరుగుతున్న కార్పొరేట్ కళాశాలలకు జిల్లాలో ప్రైవేటు పాఠశాలలకు సహకరిస్తే ఊరుకునేది లేదన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష దాడులకు సిద్ధం అవుతామని హెచ్చరించారు. విద్యా హక్కు చట్టాని పూర్తి స్థాయిలో ప్రభుత్వం అమలు చేయాలని, ప్రైవేటు విద్యాసంస్థల్లో పీజుల దోపిడిని అరికట్టాలని, ఫీజుల నియంత్రణ చట్టం కోసం త్వరలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆమరణ దీక్ష చేస్తామని తెలిపారు. జిల్లా అధ్యక్షులు సంగేం మధు, ఆర్గనైజింగ్ కార్యదర్శి వేల్పుల ప్రసన్నకుమార్, జిల్లా నాయకులు అనిరుధ్, యాశీన్, కార్తిక్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి రవాణాపై ఉక్కుపాదం

### 'సిరిసిల్ల' ఎస్పి అఖిల్ మహజన్

**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితులు వాడిచెర్ల జాన్ ప్రతాప్ రెడ్డి, గుమ్మడివెల్లి చంద్రశేఖర్‌లకు 5 సంవత్సరాల జైలు శిక్ష, ఒక్కొక్కరికి 50వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత తీర్పు వెల్లడించినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వడిచెర్ల జాన్ ప్రతాప్ రెడ్డి, నాంపల్లికి చెందిన గుమ్మడివెల్లి చంద్రశేఖర్ అనే ఇద్దరు వ్యక్తులు గతంలో వేములవాడ పట్టణ పరిధిలోని నాంపల్లి ప్రాంతంలో గంజాయి రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు వేములవాడ పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 3.5కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి, అప్పటి వేములవాడ పట్టణ సిఐ వెంకటేష్ కోర్టులో చార్జీషీట్ దాఖలు చేయగా, సిఎంఎస్ ఎస్ఐ రవీంద్ర నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ మహేందర్, సిఎంఎస్ కానిస్టేబుల్ నవీన్‌లు ఎనిమిది మంది సాక్షులను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరుపున కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ఇద్దరు నిందితులకు 5సంవత్సరాల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి 50వేల రూ.లు జరిమానా విధించినట్లు తెలిపారు. శిక్షలతోనే సమాజంలో మార్పు వస్తుందని, పోలీసులు ప్రాసిక్యూషన్ వారు వ్యూహంతో న్యాయ విచారణ, న్యాయ నిరూపణ జరిపి ఖచ్చితంగా శిక్షలు పడే విధంగా చేస్తారని హెచ్చరించారు.

# పోలింగ్ సందర్భంగా ప్రచారం నిషేధం

### 'జగిత్యాల' ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సత్యప్రసాద్

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** ఈ నెల 27న జరిగే మెదక్ నిజామాబాదు కరీంనగర్ ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో 48 గంటల నిశ్శబ్ద వ్యవధి (సైలెన్స్ పీరియడ్ )అమలులో ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సత్య ప్రసాద్ తెలిపారు. సైలెన్స్ పీరియడ్ లో భాగంగా 25 సాయంత్రం 4 గంటల నుండి 27సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ సభలు, ఊరేగింపులు సమావేశాలు నిర్వహించడం, ప్రచారం చేయడం, అభ్యంతకరమైన, రాజకీయపరమైన అంశాలతో సంక్షిప్త సందేశాలు, బల్క్ ఎస్ఎంఎస్ పంపడంపై ఎన్నికల సంఘం నిషేధం విధించిందన్నారు.సైలెన్స్ పీరియడ్‌లో నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే విచారణ జరిపి ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951, ఎన్నికల ప్రవర్తనా నియమావళి 1961 ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.48 గంటల సైలెన్స్ పీరియడ్ సమయంలో జిల్లాయేతర వ్యక్తులు ఎవరు కూడా జిల్లాలో ఉండవద్దని స్పష్టం చేశారు. ఎఫ్ఎస్టి, ఎస్ ఎస్ టి, ఎంసీసీ, పోలీస్ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, కళ్యాణ మండపాలు, హోటళ్లు, లాడ్జింగ్‌ల్లో విస్తృతంగా తనిఖీ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసే వరకు జిల్లా లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

### ఉద్యోగులకు ప్రత్యేక సెలవు

ఈ నెల 27న జరిగే మెదక్ నిజామాబాద్ కరీంనగర్ ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక సాధారణ సెలవు వర్తిస్తుందని సత్య ప్రసాద్ తెలిపారు. గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నమోదిత ఓటర్లుగా ఉన్నవారు తమ ఓటు వినియోగించుకునేందుకు ఈ ప్రత్యేక సెలవు వర్తిస్తుందని తెలిపారు. వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థ లేదా ఇతర అన్ని ప్రైవేట్ మేనేజ్మెంట్, అథారిటీలలో పని చేస్తూ గ్రాడ్యుయేట్ ఓటు హక్కు ఉన్న ఉద్యోగులు, కార్మికులు సైతం వారి ఓటుహక్కును వినియోగించుకునేందుకు యాజ మాన్యాలు అనుమతి, వెసులుబాట్లు ఇవ్వాలని కోరారు.

## పోలింగ్ ముగిసేవరకు అప్రమత్తత



### పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** శాసనమండలి ఎన్నికల పోలింగ్ మన పెద్దపల్లి జిల్లాలో పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.ఈ నెల 27న జిల్లాలో నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సోమవారం ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు పోలింగ్ నిర్వహణపై శిక్షణ కల్పించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల విధులను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. జిల్లాలో ఎన్నికల కోసం 36 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం 14 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, నిబంధనలు పాటిస్తూ పోలింగ్ సజావుగా జరపాలన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరికి ఓటర్ స్లిప్ పంపిణీ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శాసనమండలి ఎన్నికల పోలింగ్ జరుగుతుందని అన్నారు. ఫిబ్రవరి 26న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి వచ్చి పోలింగ్ డ్యూటీ అలాట్మెంట్ ఆర్డర్ తీసుకొని సంబంధిత పోలింగ్ కేంద్రం సిబ్బందితో కలిసి పోలింగ్ సామాగ్రి తీసుకోవాలన్నారు.డిప్యూటీ డీఈవో అదనపు కలెక్టర్ డి.వేణు ఉన్నారు.

## ఎంఎల్‌సి ఎన్నికల్లో బిసిలందరూ ఏకం కావాలి

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** ఉమ్మడి మెదక్ ,నిజామాబాద్ ,ఆదిలాబాద్ ,కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఓరగంటి భార్గవ్ రామ్ అన్నారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో సోమవారం జరిగిన బీసీ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీసీలను గెలిపించి బడుగుల ఆత్మ గౌరవాన్ని కాపాడి రెడ్ల ఆధిపత్యాన్ని అణచివేయాలన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికలు రెడ్లు ,బీసీల మధ్యనే జరుగుతుందన్నారు .బీసీ లందరూ ఏకమై ఎన్నికలలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులుగా నిలుచున్న బీసీ వర్గాలకు చెందిన అభ్యర్థులనే ఎమ్మెల్సీలుగా ఎన్నుకోవాలని తెలిపారు. 60 శాతానికి పైగా ఉన్న బడుగు బలహీన వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం అభివృద్ధి కోసం హక్కుల కోసం ప్రశ్నించడానికి అవకాశం ఉందన్నారు.మండల అధ్యక్షులు బంగుడప్పు తిరుపతి, జిల్లా కార్యదర్శి కాళ్ళ రాజయ్య, కందుకూరి తిరుపతి,సాన స్వామి, ముప్పిడి రాయమల్లు, గరిగంటి అంజయ్య పాల్గొన్నారు.

## కేశవపట్నం బస్టాండు పరిశీలన



**ప్రజాపక్షం/శంకరపట్నం:**శంకరపట్నం మండలం కేశవపట్నం బస్టాండును హుజురాబాద్ డిఎం రవీంద్రనాథ్ సోమవారం పరిశీలించారు. కరీంనగర్ వరంగల్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు కేశవపట్నం బస్టాండులోకి వచ్చి వెళ్లే సమయంలో వారసంతోకి వచ్చే వాహనదారులు ప్రమాదాలు గురికాకుండా డ్రైవర్లు జాగ్రత్తగా నడపాలని సూచించారు. వారసంతకు వచ్చే ప్రజలు అప్రమత్తంగా ఉండి వెళ్లాలని అవగాహన కల్పించారు. ఆర్టీసీ బస్టాండులోకి నిత్యం వచ్చే ప్రయాణికులతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు అప్రమత్తంగా ఉండి వాహనాలు నడపాలని సూచించారు. రహదారి నిబంధనలను పాటించి బస్సులు నడపాలని ఆర్టీసీ డ్రైవర్లకు ఆదేశించారు. కేశవపట్నం వారసంత మార్కెట్‌లోకి వచ్చే ప్రజల కోసం వాహనాల పార్కింగ్ గ్రామ పంచాయతీ ప్రత్యేక పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆయన వెంట బస్టాండ్ కంట్రోలర్, సిబ్బంది ఉన్నారు.

# ఎన్నికలు పూర్తయ్యేవరకు 144వ సెక్షన్

### 'కరీంనగర్' రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఈ నెల 27న జరగనున్న నేపధ్యంలో 48 గంటల నిశ్శబ్ద వ్యవధి (సైలెన్స్ పీరియడ్) అమలులో ఉంటుందని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. సైలెన్స్ పీరియడ్‌లో భాగంగా ఈ నెల 25 సాయంత్రం 4గంటల నుంచి 27 సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ సభలు, ఊరేగింపులు సమావేశాలు నిర్వహించడం, ప్రచారం చేయడం, అభ్యంతరకరమైన, రాజకీయపరమైన అంశాలతో కూడిన సంక్షిప్త సందేశాలు, బల్క్ ఎస్ఎంఎస్ పంపడంపై ఎన్నికల సంఘం నిషేధం విధించింది. జిల్లాయేతర వ్యక్తులు ఎవరూ జిల్లాలో ఉండవద్దని స్పష్టం చేశారు. ఎఫ్ఎస్టీ, ఎస్‌ఎస్‌టి, ఎంసిసి, పోలీస్ అధికారులు అందరూ అప్రమత్తంగాఉండాలన్నారు.కళ్యాణమండపాలు, హోటళ్లు, లాడ్జింగుల్లో వి స్తృతంగా తనిఖీ చేపట్టాలని సూచించారు. ఒపీనియన్ పోల్, ఎగ్జిట్ పోల్స్ నిషేధమని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ము గిసేవరకు ఎన్నికలు నిర్వహించే జిల్లాల్లో 144సెక్షన్ ఉంటుందన్నారు.

### ప్రైవేట్ ఉద్యోగులు, కార్మికులకు వెసులుబాటు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక సాధారణ సెలవు వర్తిస్తుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నమోదిత ఓటర్లుగా ఉన్నవారు తమ ఓటు వినియోగించుకునేందుకు ఈ ప్రత్యేక సెలవు వర్తిస్తుందని తెలిపారు. వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థ లేదా ఇతర అన్ని ప్రైవేట్ మేనేజ్మెంట్, అథారిటీలలో పనిచేస్తూ గ్రాడ్యుయేట్ ఓటు హక్కు ఉన్న ఉద్యోగులు, కార్మికులు సైతం వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు యాజమాన్యాలు అనుమతి, వెసులుబాట్లు ఇవ్వాలని కోరారు. ప్రైవేట్ ఉద్యోగులు, కార్మికులు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు షిఫ్టుల సర్దుబాటు, డ్యూటీ గంటల తగ్గింపు, ఆలస్యంగా హాజరు కావడానికి అనుమతి వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రత్యేక సాధారణ సెలవు, వెసులుబాట్లను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులందరూ తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని కోరారు. అందరూ సహకరించాలని కలెక్టర్ కోరారు.

## అంతటా అప్రమత్తత

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** శాసనమండలి ఎన్నికల పోలింగ్ పాదర్శకంగా నిర్వహించాలని ట్రైనింగ్ నోడల్ అధికారి, సిపిఓ శ్రీనివాస చారి అన్నారు. ఈ నెల 27న జిల్లాలో నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంఆడిటోరియంలో సోమవారం ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓపివోలు, మైక్రో అబ్జర్వర్లకు పోలింగ్ నిర్వహణపై శిక్షణ కల్పించారు.ట్రైనింగ్ నోడల్ అధికారి, సిపివో శ్రీనివాస్ చారి మాట్లాడుతూ ఎక్కడా తేలికగా తీసుకోకుండా పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం 28పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం 13 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్‌లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌బుక్, పాన్ కార్డు ఆధార్ కార్డు, పెన్షన్ డాక్యుమెంట్, జాతీయ ఉపాధి హామీ పథకం, జాబ్ కార్డు, యూడిఐడి, హెల్త్ ఇన్సురెన్స్ స్మార్ట్ కార్డు గుర్తింపు కోసం ఓటర్లు తమ వెంట తీసుకుని రావాల్సి ఉంటుందని తెలిపారు.సాయంత్రం నాలుగు గంటల వరకు ఓటింగ్ స్లిప్పులు ఇచ్చిన ప్రతి ఒక్కరికి ఓటు వేసే అవకాశం కల్పించాలని, 3.55 గంటలకు 4గంటలకు పోలింగ్ ముగుస్తుందని ప్రకటించాలన్నారు.వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, మాస్టర్ ట్రైనర్లు మహేందర్ రెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

# కార్మిక చట్టాలు ఖచ్చితంగా పాటించాలి

### పౌల్ట్రీ ఫారమ్‌లను తనిఖీ చేసిన అధికారులు



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** నిబంధనలకు వ్యతిరేకంగా నడుచుకుంటూ చైల్డ్ లేబర్‌తో పౌల్ట్రీ పామ్‌లలో పని చేయిస్తే కఠినచర్యలు తప్పవని అవసరమైతే పౌల్ట్రీ ఫార మ్‌ను సీజ్ చేస్తామని ఎసిఎల్ శ్రీనివాస్‌రావు తెలిపారు. కొంత మంది వ్యక్తుల ఫిర్యాదుతో సోమవారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సమీపంలో ఉన్న పౌల్ట్రీ ఫామ్‌లను ఎఎల్ఒ, రెవెన్యూ, పోలీస్,చైల్డ్ ప్రోటెక్షన్,పంచాయితీ అధికారులతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్బంగా మీడియాతో మాట్లాడుతూ సిద్దిపేట పరిసర ప్రాంతాలలో పౌల్ట్రీ యాజమానులు ఎక్కడి నుండో లేబర్‌ను తీసుకొచ్చి పని చేయిస్తున్నారని వారికి ఎటువంటి అడ్రస్ ప్రూఫ్ ఉండడం లేదని అన్నారు. గతంలో కూడా ఈ పౌల్ట్రీపై కేసు నమోదు చేశామని, అయినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ నిబంధనలకు వ్యతిరేకంగా నడుచుకుంటున్నారని మండిపడ్డారు. లేబర్ పని చేసే చోట పిల్లలు అధికంగా ఉంటే వారికి అక్కడే పాఠశాల ఏర్పాటు చేయాలని,కావలసిన ఏర్పాట్లు కూడా చేయాల్సిన బాధ్యత యాజమాన్యందేనన్నారు. కానీ సంబంధిత పౌల్ట్రీ యాజమాని అందుబాటులో లేక ఉన్న సూపర్‌వైజర్ సరైన సమాధానాలు చెప్పకపోవడంతో అధికారులు ఆగ్ర హం వ్యక్తం చేశారు. సిద్దిపేట పరిధిలోని పౌల్ట్రీలలో తనిఖీ నిర్వహిస్తామని చైల్డ్ లేబర్ ఉన్న,నిబంధనలకు వ్యతిరేకంగా దుచుకుంటున్న యాజమాన్యాలపై కఠి న చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమ వ్యాపార సంస్థలలో పనిచేసే ఇతర రాష్ట్రాలకు చెందిన లేబర్‌కు సంబంధించిన అడ్రస్ ప్రూఫ్‌లు సరిగ్గా ఉండాలని వారితో రిజిస్టర్ మైంటేన్ చేయాలని యాజమాన్యానికి సూచించారు. పనిచేస్తున్న కార్మికులకు కార్మిక చట్టం ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని తెలిపారు.

### పిల్లలను దాచిన యాజమాన్యం

కొంత మంది ఫిర్యాదు మేరకు సంబంధిత పౌల్ట్రీ తనిఖీ చేయాడానికి అధికారులు వస్తున్నారని తెలుసుకున్న పౌల్ట్రీ ఫామ్ యాజమాన్యం సూపర్‌వైజర్ సహకారంతో పిల్లలను దాచిపెట్టే ప్రయత్నం చేశారు. అక్కడికి చేరుకున్న అధికారులు విజిట్ చేయగా ఒక్క పిల్లవాడు కనిపించకపోవడంతో అధికారులు అవాక్కయ్యారు. కాసేపు అక్కడే ఉండి పోలీసుల సహకారంతో ఉన్న గదులలో వెతుకగా పిల్లలను దాచిపెట్టినట్లు గుర్తించారు. ఇటువంటి చట్ట వ్యతిరేక పనులకు పాల్పడుతూ పిల్లలను దాచిపెట్టి మరోసారి నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని,వారం రోజుల్లో నిబంధనలు పాటిస్తూ పిల్లలను బడికి పంపిస్తూ తమ దృష్టికి తీసుకురావాలని లేనిచో యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎల్ఒ వికార్ బాబా,బాల సంరక్షణ సిబ్బంది రేష్మ, రమేష్, ఆర్ఐ నర్సిం లు, పంచాయితీ కార్యదర్శి విజయ్, పోలీస్ సిబ్బంది కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట సిటిజన్స్ క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తా



### సిద్దిపేట సిటిజన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా ఎంఎస్ రమేశ్ , ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట సిటిజన్స్ క్లబ్ అధ్యక్షుడిగా ఎంఎస్ రమేశ్, ప్రధాన కార్యదర్శిగా బోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికైనారు. సిద్దిపేట సిటిజన్స్ క్లబ్‌లో జరిగిన ఎన్నికల్లో 607 పోల్ కాగా ఎంఎస్ రమేశ్‌కు 332 ఓట్లు రాగా, రమేశ్ యాదవ్‌కు 272 ఓట్లు రాగా 60 ఓట్ల మెజార్టీతో ఎంఎస్ రమేశ్ విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా బోరెడ్డి శ్రీనివాస్‌రెడి దాస శ్రీనివాస్‌పై 181 ఓట్ల తేడాతో విజయం సాధించారు. బోరెడ్డి శ్రీనివాస్‌కు 393 ఓట్లు రాగా. దాస శ్రీనివాస్‌కు 212 ఓట్లు వచ్చాయి. 3 ఓట్లు చెల్లనిగా గుర్తించారు. క్లబ్ ఉపాధ్యక్షులుగా చెందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా రామబ్రహ్మం, క్రీడ కార్యదర్శిగా బాలకిషన్ గౌడ్, కోశాధికారిగా చంద వెంకటేశ్వర్లు, ఏకగ్రీవంగా ఎన్నికైనారు. కార్యవర్గ సభ్యులుగా గంగాధర్ గౌడ్, గ్యాదగోని కిష్టయ్య, కాముని శ్రీకాంత్,బుస్స సుదర్శన్, అమ్మగారి ప్రకాశ్, బొందుగుల వెంకట్‌రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. విజేతలతో ఎన్నికల అధికారి బండారుపల్లి శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కార్యవర్గాన్ని క్లబ్ సభ్యులు పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. సహాయ ఎన్నికల అధికారులు సత్యనారాయణ గౌడ్,ఎల్లయ్య, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

### క్లబ్ గౌరవ ప్రతిష్టలు పెంచుతా..

సిద్దిపేట సిటిజన్స్ క్లబ్ అభివృద్ధికి తాను శాయశక్తుల కృషిచేస్తానని నూతన అధ్యక్షుడు ఎంఎస్ రమేశ్ అన్నారు. క్లబ్ గౌరవ ప్రతిష్టలు పెంచేలా కృషిచేస్తానన్నారు. క్లబ్ సేవా కార్యక్రమాలను మరింత విస్తారిస్తానన్నారు. క్లబ్‌లో క్రీడల అభివృద్ధికి పెద్దపీట వేస్తానన్నారు. క్రీడకారులకు తమవంతు చేయూత అందిస్తామన్నారు. సిటిజన్స్ క్లబ్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయటమే తమ లక్ష్యమన్నారు. తన విజయం కోసం కృషిచేసిన క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. క్లబ్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తన విజయం కోసం కష్టపడి కృషిచేసిన కృషి చేసి. ఓటు వేసి గెలిపించిన క్లబ్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. క్లబ్ అభివృద్ధికి తనవంతు పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఈకార్యక్రమంలో క్లబ్ సభ్యులు తాడురి శ్రీనివాస్, పాల చంద్రశేఖర్, తిరుపతిరెడ్డి. శివప్ప, పెద్దిసుధాకర్, సంజీవరెడ్డి. విశ్వేశ్వర్, బాసంగారి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

షో కేస్

# యువతరంగం

# స్వయం ఉపాధి.. ఓ ఎండమావి!

దేశంలో స్వయం ఉపాధి అనేది ఓ ఎండమావిగా మారింది. ప్రపంచంలోనే అత్యధిక శాతం మంది స్వయం ఉపాధి పొందుతున్నారని ఐక్యరాజ్య సమితి నివేదిక స్పష్టం చేస్తున్నది. ప్రపంచంలోనే ఇది అత్యధికమని, కాబట్టి దేశం అభివృద్ధి బాటలో పరుగులు తీస్తున్నదని అనుకుంటే పొరపాటే. ఎందుకంటే, ఉద్యోగావకాశాలు లేక, చదువుకు తగిన ఉపాధి లభించక, ఎంతో మంది ఆశలు చంపుకొని, ఏదో ఒక పనిలో నిమగ్నమవుతున్నారు. ఈ పరిస్థితిని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తన ఘనతగా పేర్కోవడం విచిత్రం. దశాబ్దం క్రితం ఇచ్చిన ఏడాదికి కోటి ఉద్యోగాల హామీను బిజెపి అటకెక్కింది. ఉద్యోగావకాశాలు అంతంతమాత్రంగా ఉన్న తరుణంలో, స్వయం ఉపాధి ఒక్కటే మార్గమవుతున్నది. ఈ పరిస్థితి ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం. దేశంలో, స్వయం ఉపాధి రంగం దారుణంగా ఉంది. స్వయం ఉపాధి రంగంలో స్థిరపడాలనుకునే వారికి ప్రోత్సాహం లేదు. ఉద్యమిమిత్ర, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, గోపాల మిత్ర, నేషనల్ లైవ్ స్టాక్ మిషన్, ప్రధానమంత్రి సంచాయిని యోజన వంటి పథకాలు ఉన్నప్పటికీ, వాటి వల్ల ప్రయోజనం దాదాపు శూన్యం. ఒక నివేదికను అనుసరించి, ఉద్యోగం పొందిన భారతీయుడు సగటున నెలకు రూ. 19,000 వేతనం పొందుతుంటే, స్వయం ఉపాధి రంగంలో సగటు ఆదాయం రూ. 11,973 మాత్రమే. క్యాజువల్ కార్మికులది మరింత దారుణ పరిస్థితి. వారి సగటు సంపాదన నెలకు కేవలం రూ.8,267 మాత్రమే. ఇందులో కూడా స్త్రీ–పురుషుల మధ్య తీవ్రమైన వ్యత్యాసం ఉంటుంది. ముఖ్యంగా స్వయం ఉపాధి రంగంలో స్త్రీలు ఆదాయం మరీ తక్కువ. వాస్తవానికి వారి కష్టాన్ని లెక్కించడం లేదు. దేశంలో యువత ఆర్థిక కార్యకలాపాల్లో పాల్గొనే రేటు అంటే శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు (లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేటు) కూడా గణనీయంగా తగ్గిపోతున్నది. 2000 సంవత్సరంలో ఈ రేటు 54 శాతం ఉండగా 2022 నాటికి 42 శాతానికి పడిపోయింది. శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు అంటే ఆర్థిక వ్యవస్థలో పనిచేస్తున్న 16–64 సంవత్సరాల మధ్య వయస్సు గల శ్రామిక జనాభాలో ఉపాధి కోరుకునే వారి జనాభా శాతం. ఇది ఒక కీలకమైన ఆర్థిక సూచిక. గత రెండు దశాబ్దాలుగా ఇది గణనీయంగా పతనమవుతున్నది. జనాభా లో కార్మికుల సంఖ్య కూడా 2000 సంవత్సరంలో 60.2 శాతం నుంచి 2022 నాటికి 52.9 శాతానికి పడిపోయింది. కార్మిక భాగస్వామ్య రేటు కూడా పురుషుల కన్నా మహిళల్లో ఎక్కువ పడిపోయింది. 2000–2022 మధ్య పురుషుల్లో ఇది 8.1 శాతం పడిపోగా మహిళల్లో 14.4 శాతం పడిపోయింది. 2000–2019 సంవత్సరాల మధ్య మొత్తం ఉద్యోగాల్లో నైపుణ్యాలు గల ఉద్యోగాలు, పెరుగుతూ వచ్చాయి. ఈ కాలంలో మధ్యస్థాయి, ఉన్నత స్థాయి నైపుణ్యం గల ఉద్యోగాలు 5.1 శాతం నుంచి 9.6 శాతానికి పెరగగా తక్కువ నైపుణ్యం గల ఉద్యోగాలు 60.5 శాతం నుంచి 65.1 శాతం పెరిగాయి. నైపుణ్యం లేని ఉద్యోగాలు ఈ కాలంలో 34.4 శాతం నుంచి 25 శాతానికి తగ్గాయి. కానీ 2019–2022 మధ్య ఈ ధోరణి తిరగ బడింది. ఈ కాలంలో తక్కువ నైపుణ్యం గల ఉద్యోగాలు పెరుగుతూ, మధ్య, ఉన్నత స్థాయి నైపుణ్యం గల ఉద్యోగాలు తగ్గుతూ వచ్చాయి. స్కిల్ ఇండియా పేరుతో యువతలో నైపుణ్యాలను పెంచుతున్నామని, వారిని యువ వ్యాపార వేత్తలుగా మారుస్తున్నారని కేంద్రంలో మోడీ ప్రభుత్వం చేస్తున్న ఊకదంపుడు ఉపన్యాసాల వెనుక డొల్లతనాన్ని క్షేత్రస్థాయిలో వాస్తవాలు ఎండగడుతున్నారు. యువకుల నైపుణ్యాలు పెంచి వారిని పారిశ్రామిక కార్మికులుగా తీర్చిదిద్దేందుకు దేశవ్యాప్తంగా ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ (ఐటిఐ)లు నెలకొల్పారు. కానీ ఐటిఐ నుండి వస్తున్న తాము నిరుద్యోగులుగా, బికారులుగా మారుతునామనీ, ఉద్యోగాలు రావడం లేదని ఇటీవల దేశ వ్యాపితంగా జరిపిన ఒక సర్వేలో ఐటిఐ విద్యార్థులు వాపోయారు. రెండేళ్ల క్రితం ప్రధాని నరేంద్ర మోడీ దాదాపు 40 లక్షల మంది ఐటిఐ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ,



నైపుణ్యం, పునః నైపుణ్యం, మరింత నైపుణ్యం అనేదే మీ మంత్రంగా ఉండాలి, గత ఎనిమిది సంవత్సరాల్లో ఐటీఐల్లో లక్షలాది సీట్లు పెంచాం, విద్యార్థులకు కొత్త ఉద్యోగావకాశాలు సృష్టించాం అని చెప్పారు. కానీ వాస్తవం దానికి పూర్తి భిన్నంగా ఉంది. రెండేళ్లలో యువకులకు వృత్తి విద్య నేర్పిస్తే వారు పరిశ్రమలకు కావలసిన కార్మికులుగా ఉద్యోగాలు పొందుతారనీ, దాని వల్ల ఒకవైపు పరిశ్రమలకు నిపుణులైన కార్మికుల కొరత తీరుతుంది, మరోవైపు బాగా చదువుకున్న యువతలో నిరుద్యోగ సమస్య తీరుతుందనే ఉద్దేశంతో ఐటిఐలు నెలకొల్పారు. ప్రస్తుతం దేశ వ్యాపితంగా ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో దాదాపు 15,000 ఐటిఐలు ఉన్నాయి. పరిశ్రమలు నెలకొల్పినప్పుడు భూములు కోల్పోయిన వారి పిల్లలకు శిక్షణ ఇచ్చి ఆయా పరిశ్రమల్లో నియమించడం కోసం 1950వ దశకంలో వీటిలో అనేక ఐటిఐలను నెలకొల్పారు. కానీ ఈ రోజు ఐటిఐ చదివిన వారికి ఉద్యోగాలు వస్తాయన్న గ్యారెంటీ లేకపోవడంతో వాటిలో చేరడానికి అనేక మంది నిరాకరిస్తున్నారు. ఐటిఐలో ఫిట్టర్, ఎలక్ట్రిషియన్ ట్రేడ్ ప్రధానమైనవి. కానీ దేశ వ్యాప్తంగా ఫిట్లర్ సీట్లు 71.5 శాతం, ఎలక్ట్రిషియన్ సీట్లు 64.8 శాతం సీట్లు ఖాళీగా ఉండిపోతున్నాయని నీతి ఆయోగ్ 2023 నివేదికలో తెలిపింది. మరోవైపు చిన్నతరహా పరిశ్రమలకు ప్రోత్సాహం కరువయ్యింది. బ్యాంకుల నుండి అరువు పుట్టాలంటే డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ ఉండాలి, సిబిల్ రేటింగ్ ఉండాలి, బ్యాంక్ అధికారులతో సత్సంబంధాలు ఉండాలి, లిక్విడ ష్యూరిటీ ఉండాలి. దాదాపు ఎనభై శాతం దరఖాస్తులు తిరస్కరించ పడుతున్నాయి.

ప్రజాధనంతో లావాదేవీలు జరిపే ఈ బ్యాంకులు బడా పారిశ్రామికవేత్తలు, రాజకీయ నాయకులతో బంధం ఉన్న వారికి లక్షల కోట్ల రూపాయలు మాఫీ చేస్తున్నారు. వాటిని వసూళ్లు చేయలేక, కనీసం వారిని ప్రశ్నించడం కూడా చేతకాక ప్రజాధనాన్ని ప్రభుత్వం మాఫీ చేస్తున్నారు. సామాన్యుల విషయంలో బ్యాంకులు ప్రవర్తించే తీరు దారుణంగా ఉంటుంది. రైతులు, కిరాణా వ్యాపారస్తులు, చిన్న పారిశ్రామికవేత్తలు తాము చెల్లించాల్సిన వాయిదా సక్రమంగా లేకపోతే విరుచుకుపడే బ్యాంకులు బడాబాబుల పారు బకాయిల విషయంలో ఎందుకు నోరు మెదపలేదు. ప్రతి రోజూ కనీసం పది నుంచి ఇరవై వరకు చిన్న, మధ్య తరహా పరిశ్రమలను మూసివేస్తున్నట్టు లేదా వేలం వేస్తున్న ప్రకటనలు హిందూ పత్రికలో కనిపిస్తాయి. ఒక్క హిందూ దినపత్రిక దక్షిణ భారత ఎడిషన్‌లో నెలకు వెయ్యికి పైగా పరిశ్రమలకు ఉరితాడు వేస్తున్నట్టు బ్యాంకుల ప్రకటనలు కనిపిస్తాయి. మొత్తం ఆంగ్ల పత్రికల్లో ప్రకటనలు లెక్కిస్తే ఈ సంఖ్య 2000 కి తక్కువేమీ కాదు. కానీ నరేంద్ర మోడీ ప్రభుత్వం సూక్ష్మ, మధ్య తరగతి పరిశ్రమల తాము అందిస్తున్న సహకారం చాలా ఉందని, బాలీవుడ్ స్టార్ అమితాబ్ బచ్చన్, అనుపమ్ ఖేర్ ఫోటోతో పూర్తి పేజీ ప్రకటనలతో అప్పుడప్పుడు దేశంలోని అన్ని భాషలలో గొప్పగా చెబుతుంటుంది. సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు గొప్ప అవకాశం అంబుడ్స్‌మెన్ ఈ తరహా విధానమని, తక్షణ పరిష్కారానికి వినియోగించుకోవాలని రిజర్వు బ్యాంకు తరపున ప్రకటనలలో సారాంశంగా ఉంటుంది. ఈ ప్రకటనలలో వాగాడంబరం తప్ప చిన్న పరిశ్రమలు నెలకొల్పే వారికి ప్రోత్సాహకాలు ఏమీ లేవని తేలుతున్నది. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చాక ఓ లెక్క ప్రకారం 60 లక్షల చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మూతకు గురైనట్టు సమాచారం. పెద్ద నోట్ల రద్దు, కోవిడ్ కారణంగా ఈ సంఖ్య తీవ్రంగా పెరిగింది. కేంద్రంలో ఎవరు అధికారంలో ఉన్నా వీరికి ఒరిగింది ఏమీ లేదు. స్వయంకృషితో పది మందికి ఉపాధి కల్పించేందుకు ముందుకు వచ్చి పరిశ్రమలు స్థాపిస్తున్న వారికి ప్రోత్సాహం లేనేలేదు. ఈ పరిస్థితి మారితేగానీ దేశం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లదు.

## గిగ్ వర్కర్లకు సౌకర్యాలు...



కేంద్ర ప్రభుత్వం ఈనెల ఒకటో తేదీన లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో, గిగ్ వర్కర్ల గురించి ప్రస్తావించడం కొంత ఊరటనిచ్చే అంశం. వీరికి సంబంధించిన నిబంధనలను మారుస్తున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా, కొత్త నిబంధన కింద గిగ్, ఆన్లైన్ ప్లాట్ఫామ్ వర్కర్లకు గుర్తింపు కార్డు, ఇ శ్రమ్ పోర్టల్లో రిజిస్ట్రేషన్ చేసుకునే సదుపాయం లభిస్తుంది. వీటితో పాటు ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన(పిఎంజెఎవై) కింద వారికి ఆరోగ్య బీమా సదుపాయం కూడా లభిస్తుంది. దీని వల్ల దాదాపు కోటి మంది గిగ్ వర్కర్లకు నేరుగా లబ్ధి చేకూరనుంది. ప్రస్తుత కాలంలో ఫుడ్ డెలివరీ, క్యాబ్ డ్రైవర్లు, ఫ్రీలాన్సర్లు, లాజిస్టిక్స్, ఆన్లైన్ సేవల్లో లక్షలాది మంది గిగ్ వర్కర్లుగా పనిచేస్తున్నారు. వారి ఉపాధి తాత్కాలికమే తప్ప కంపెనీలు ఎలాంటి అదనపు భద్రత, ప్రయోజనాలు ఇవ్వవు. దీన్ని దృష్టిలో ఉంచుకుని, గిగ్ వర్కర్లకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాన్ని పొందేందుకు వీలుగా ప్రభుత్వం ఇశ్రమ్ పోర్టల్లో నమోదు చేయనుంది. అసంఘటిత రంగ కార్మికుల కోసం ఇప్పటికే పనిచేస్తున్న ఈ పోర్టల్లో ఇకపై గిగ్ వర్కర్లను కూడా చేర్చనున్నారు. ఫుడ్ డెలివరీ ఎగ్జిక్యూటివ్స్ (జొమాటో, స్విగ్గీ వంటివి), క్యాబ్ డ్రైవర్లు (ఉబెర్, ఓలా వంటివి), ఫ్రీలాన్స్ డిజైనర్లు, కంటెంట్ క్రియేటర్లు, లాజిస్టిక్స్ సిబ్బంది, ఇతర ఆన్లైన్ సేవలకు సంబంధించిన ఉద్యోగులకు ఈ పథకం వర్తిస్తుంది. 'పే ఫర్ వర్క్' ప్రాతిపదికన నియమించిన ఉద్యోగులను గిగ్ వర్కర్స్ అంటారు. అయితే ఇలాంటి ఉద్యోగులు కంపెనీలతో సుదీర్ఘకాలం పాటు అనుబంధం కలిగిన వారూ ఉన్నారు. ఇందులో కాంట్రాక్ట్ పద్ధతిలో స్వతంత్రంగా పనిచేసే ఉద్యోగులు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌లో పనిచేసే ఉద్యోగులు, కాల్ ఆన్ వర్క్స్ ఉద్యోగులు, తాత్కాలిక కార్మికులు ఉన్నారు. కొత్త విధానం గిగ్ వర్కర్లకు ఇది సామాజిక భద్రతను అందిస్తుంది. ఆరోగ్య సమస్యల ఉన్నవారు ఆరోగ్య బీమా వాడుకోవచ్చు. ఈ నిర్ణయం గిగ్ వర్కర్లకు ఒక పెద్ద అడుగుగా కాబోతుంది. ఈ మార్పులను ప్రభుత్వం కేవలం మాటల్లో గాక, చేతల్లో కూడా చూపితేనే గిగ్ వర్కర్లకు కొంతైనా మేలు జరుగుతుంది.

## చాదస్తం తగ్గాలి



వయసు మీదపడుతున్న కొద్దీ, జీవితంలో ఎదుర్కొన్న ప్రతి అనుభవాన్ని ఇతరులకు ఆపాదించి, ఉచిత సలహాలు ఇవ్వడం పెరుగుతుంది. అంతేకాదు... చెప్పిందే చెప్తూ, ఎదుటివారిని విసిగించడం సామాన్యమవుతుంది. ఈ చాదస్తాన్ని ఎంత తగ్గించుకుంటే అంత మంచిది. వయసును ప్రాతిపదికగా తీసుకొని, అన్నీ మాకే తెలుసు అనే ధోరణిని విడిచిపెట్టినప్పుడే వృద్ధాప్యం ప్రశాంతంగా గడుస్తుంది. సాధ్యమైనంత తక్కువగా మాట్లాడుతూ, పిల్లలు చెప్పింది ఆలకిస్తూ, మరీ అత్యవసర మనుకుంటే మాత్రమే సలహాలిస్తూ రోజులు దొర్లించాలి. అంతేగానీ, 'నేను పట్టుకున్న కుందేలుకు మూడే కాళ్లు' అన్నట్టు వ్యవహరించకూడదు. వయసులో పెద్దవాళ్లమైనంత మాత్రాన, అందరూ మన మాటే వినాలనుకోవడం తప్పు. పెద్దతనం నిలబెట్టుకోవాలంటే, మొండితనాన్ని తగ్గించుకోవాలి. పిల్లలకూ ఆలోచనలు ఉంటాయనీ, వారిని ఎల్లకాలం వేలు పట్టుకొని నడిపించలేమనీ గ్రహించడం మంచిది. ప్రతి పనికీ వంకలు పెట్టడం... సవాలక్ష అనుమానాలతో వేధించడం కూడదు. 'మా రోజుల్లో.... ' అంటూ మొదలుపెట్టడాన్ని తగ్గించుకోవాలి. పిల్లల ఇష్టాయిష్టాలతో సంబంధం లేనట్టు వ్యవహరించడం మానసిక ఆరోగ్యానికి ఏమాత్రం క్షేమం కాదు. ప్రతి విషయంలోనూ కలగచేసుకొని, అభిప్రాయాలు చెప్పడం కూడా తగ్గాలి. మితంగా మాట్లాడాలి. పిల్లలకు తెలిసిన వాళ్లు లేదా స్నేహితులు వచ్చినా, అక్కడే కూర్చొని మరీ పెద్దరికాన్ని ప్రదర్శించడం భవిష్యత్తుకు మంచిదికాదు. 'మీ ఆరోగ్యం ఎలా ఉంది' అనే అత్యంత సాధారణమైన పరామర్శకు తీవ్రంగా స్పందించి, ఆరోగ్య సమస్యలను ఏకరువు పెట్టకండి. అది పిల్లల మనస్సులో మీ పట్ల వ్యతిరేక భావాన్ని పెంచిపోషిస్తుంది. కాలం మారుతున్నది... పరిస్థితులు మారుతున్నాయి... మన అనుభవాలే తదుపరి తరాల్లోనూ పునరావృతమవుతాయని అనుకోవడాన్ని మించిన మూర్ఖత్వం లేదు. పిల్లల ముందు పరువు తీసుకోకుండా ఉండాలంటే, అనవసర భయాలను బయటపెట్టి, వారిని ఇబ్బంది పెట్టడం మానుకోవాలి. గౌరవం దక్కాలంటే, మన గౌరవం మనం కాపాడుకోవాలి. అవుననుకున్నా... కాదనుకున్నా... దిగాల్సిన స్టేజీ ఎంతో దూరంలో లేదు. కాబట్టి, సాధ్యమైనంత వరకూ చాదస్తాలను వదులుకోక తప్పదు.

## లూయిస్ బ్రెయిలీ

**యూత్ ఐకాన్స్**

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింప చేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

అన్నీ అవయవాలు సక్రమంగా ఉన్నప్పటికీ, నిరంతరం ఏదో కోల్పోయినట్టు బాధపడేవారు... జీవితంలో ఏమీ సాధించలేమని నిరాశచెందేవారు తప్పక తెలుసుకోవాలి...

లూయిస్ బ్రెయిలీ తన తండ్రి వర్క్‌షాప్‌లో జరిగిన ప్రమాదం కారణంగా మూడేళ్ళ వయసులో అంధుడైన లూయిస్ బ్రెయిలీ ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నాడు. అయినా అధైర్య పడకుడలేదు. సమస్యలతో రాజీ పడకుండా, వాటిని ఎదిరించాడు. యుక్త వయసులోనే అంధుల కోసం లిపిని అభివృద్ధి చేశాడు. అదే 'బ్రెయిలీ లిపి'గా లక్షలాది మంది అంధులకు విద్యాదానం చేస్తున్నాడు. స్పర్శ ద్వారా రాయడం, చదవడం సాధ్యమవుతుందని ఊహించడం కూడా కష్టమే. అలాంటి ఊహాతీతమైన ఆవిష్కరణతో బ్రెయిలీ చరితార్థుడయ్యాడు.



## ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు

ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి ప్రీతం డిమాండ్



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని సంబంధిత విద్యాధికారులను ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్పొరేట్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న టీచర్స్‌కు టార్గెట్స్ ఇచ్చి ముందస్తు అడ్మిషన్స్ చేయాలని, లేకపోతే జీతం కట్ చేస్తామని, ఉద్యోగం నుండి తీసేస్తామని భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు మోసపూరితమైన మాటలకు, ప్రలోభాలకు లొంగకుండా పాఠశాలలకు అనుమతులు ఉన్నాయా! లేవా! అని తెలుసుకొని పాఠశాలలో అడ్మిషన్ తీసుకోవాలన్నారు. విద్యాధికారుల అండదండలతోనే కార్పొరేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. నిబంధనలను పాటించని, ముందస్తు అడ్మిషన్స్ చేస్తున్న కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రామగుండం కార్పొరేషన్ అధ్యక్షుడు మాతంగి సాగర్, నాయకులు గాజుల వినయ్, గంద్రేటి శివ,పూదరి సాయి చరణ్, అనవేణి శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

## స్కావెంజర్ల వేతనాలు చెల్లించండి

ఎఐటియుసి వరంగల్ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు



**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే స్కావెంజర్ల వేతనాలను వెంటనే చెల్లించాలని ఎఐటియుసి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు ప్రభుత్వాన్ని డిడ్డ్ చేశారు. ఈ మేరకు సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో డిఆర్ఓ విజయలక్ష్మి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చెన్నకేశవులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్నటువంటి స్కావెంజర్ల ఉద్యోగాలు క్రమబద్ధీకరణ అయి జీవితాలు చక్కబడతాయి అనుకుంటే, వారి ఆశలు మరింత దుర్భరంగా మారాయన్నారు. 2024 జూన్ నుండి నేటి వరకు బిల్లులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కనీస వేతన సవరణ చట్టం ప్రకారం నెలకు రూ.26000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్కావెంజర్లు, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యల పరిష్కారం చేయాలని, వారికి ఇవ్వాల్సిన వేతనాలను అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి మియాపురం గోవర్ధన చారి, జిల్లా కార్యవర్గ సభ్యులు బొట్ల శ్రీనివాస్, స్కావెంజర్స్ ఎండి సైదాబీ, రామారావు, ఎండి పాషా, ఎండి సుభాన, విజయ, మేకల కవిత, సూరయ్య, వినోద్, పద్మ, సునీత, విజయ, సిహెచ్ రమ, ధోనికెల లక్ష్మి , శ్వేత, భట్టు స్వరూప, పుష్పమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# మద్దతు ధర చట్టం అమలుకు పోరాటం

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

మార్చి30న వైరాలో రైతు సంఘం సభ

సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం



**ప్రజాపక్షం/వైరా :** కనీసం మద్దతు ధర చట్టం కోసం పోరాటాలకు సిద్ధంకావాలని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు, రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. సోమవారం వైరా పట్టణంలోని కమ్మవారి కళ్యాణ మండపంలో బాగం మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం మరో రూపంలో నల్లచట్టాలను అమలు చేసి కార్పొరేట్ సంస్థలకు వ్యవసాయ రంగాన్ని కట్టబెట్టాలని చూస్తున్నారన్నారు. దేశవ్యాప్తంగా స్వామినాథన్ కమిషన్ సిఫార్సు అమలు చేసి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు.పెట్టిన పెట్టుబడులు రాక రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో రైతు రుణమాఫీ సక్రమంగా జరగలేదన్నారు. ప్రభుత్వం వందశాతం రైతు రుణమాఫీ చేశామని చెబుతుందని, అది కేవలం మాటలకే తప్పా చేతల్లో అమలు కాలేదన్నారు. ఖమ్మం జిల్లాలో 40% రైతులకు రుణమాఫీ అయిందని, మిగతా 60%రుణమాఫీ కాలేదన్నారు. ఆర్ఎస్ఆర్ పేరుతో రుణమాఫీకి లింకు పెట్టడం సరైంది కాదన్నారు. గత పాలకులు చేసిన తప్పును ప్రస్తుత కాంగ్రెస్ పాలకులు చేయకుండా రైతులకు న్యాయం చేయాలన్నారు. కృష్ణాజలాలకు సంబంధించి వివాదం మొదలైందని, తెలంగాణకు రావాల్సిన వాటాను రప్పించుకోవాలని, దానికి సంబంధించి రాష్ట్ర ముఖ్యమంత్రి అన్ని రాజకీయ పార్టీలను ఏకతాటిపై తెచ్చి కేంద్రంతో పోరాడి కృష్ణా జలాల్లో న్యాయబద్ధమైన తెలంగాణ వాటాన్ని రక్షించాలని కోరారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్ట్‌లు నత్తనడకన కొనసాగుతున్నాయని, ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో పనులు జరగడం లేదన్నారు. సీతారామ ప్రాజెక్ట్ ప్రారంభమైన సంవత్సరాలు గడుస్తున్నా నేటికి పూర్తి కాలేదన్నారు. వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించి సీతారామను త్వరగా పూర్తి చేసి ఈ ప్రాంతం రైతాంగానికి సాగునీరు అందించాలని బాగం హేమంతరావు కోరారు. ఖమ్మం జిల్లాలో మొక్కజొన్న పెద్దఎత్తున సాగు చేశారని, మార్పుపై మాట్లాడి రైతులకు నష్టం రాకుండా చూడాలన్నారు. ఇప్పటికే కోళ్ల ఫారం రైతులు తీవ్రంగా నష్టపోయారని గుర్తు చేశారు. రైతన్న సమస్యలు పరిష్కారం కోసం కనీసం మద్దతు ధర చట్టం అమలు చేయడం కోసం మార్చి30న వైరాలో జరిగే తెలంగాణ రైతు సంఘం మహాసభల్లో నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని, రైతులు పక్షాన పోరాటం జరుగుతుందని బాగం తెలిపారు. కార్యక్రమంలో అడపా రామకోటయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొండపర్తి గోవిందరావు, దొండపాటి రమేష్, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జమ్ముల జింతేందర్‌రెడ్డి, యర్ర బాబు, సిపిఐ మండల కార్యదర్శి యామాల గోపాలరావు, రైతు సంఘం ఆఫీస్ మెడికంటి వెంకటరెడ్డి, బండారుపల్లి ముత్తయ్య, కొండా రామకృష్ణ, అమరనేని పరశురామయ్య, యామాల వెంకటరత్నం, కూచిపూడి రజిని, పవన్, వెంగళ ఆనందరావు, మిట్టపల్లి రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

## 'స్థానిక' ఎన్నికల్లో పోటీకి సిద్ధం

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి




**ప్రజాపక్షం/డిండి :** రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి కోరారు. సోమవారం డిండి సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే ఎర్ర జెండా గ్రామ గ్రామానికి విస్తరించాలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడేది సిపిఐ మాత్రమేనని, ఆ పార్టీ అవసరాన్ని ప్రజలు గుర్తించి కమ్యూనిస్టు పార్టీలో చేరాలని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు అన్ని గ్రామాలు తిరిగి కొత్త శాఖలు ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వం ఇస్తున్న రైతు బంధు, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు సంక్షేమ పథకాలు ఇచ్చే ప్రక్రియ వెంటనే చేపట్టి అర్హులైన వారికి ఇవ్వాలన్నారు. ఎస్ఎల్‌బిసి సంఘటన దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం అన్నిరకాల సహాయక చర్యలు చేపట్టి కార్మికుల ప్రాణాలను కాపాడాలని కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ, జిల్లా సమితి సభ్యులు తూం బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మైనోద్దీన్, మండల కార్యదర్శి కనకాచారి, మండల సహాయ కార్యదర్శులు శైలేష్, విజేందర్‌రెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు రవీంద్రశర్మ, కేశవులు, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, హుస్సేన్, శ్రీనయ్య, నాయకులు నవీన్, వినయ్, శాఖ కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, చక్రి, శ్రీను, గోవర్ధన్, శంకర్, రాములు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## షరతులు లేకుండా రుణమాఫీ

రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజయ్య డిమాండ్



**ప్రజాపక్షం/గుండాల :** షరతులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీని ఏకకాలంలో చేయాలని రైతుసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి రాజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని తుర్కలషాపురం గ్రామంలో నిర్వహించిన రైతు సంఘం మండల మహాసభ ఉప్పుల కొమరయ్య అధ్యక్షతన నిర్వహించగా సమావేశానికి ముఖ్యఅతిధిగా రాజయ్య, ప్రజా నాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు హరిచంద్రలు హాజరై మాట్లాడారు. కేంద్రప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పనిదినాలను 200రోజులు కల్పించి, దినసరి కూలీ రూ.600 చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం షరతులు లేకుండా రూ.2లక్షల రుణ మాఫీ చేయాలన్నారు. నవాబుపేట రిజర్వాయర్ నుంచి గుండాల మండలానికి పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలన్నారు. మండలంలో ఎండిన వరిపొలాలకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతు సంఘం మండల అధ్యక్షుడిగా బొయిని బక్కయ్య, ఉపాధ్యక్షునిగా బద్దుల స్వామి, మండల ప్రధాన కార్యదర్శిగా కొమురయ్యతో పాటు 9మందితో కూడి కమిటీని ఎన్నికున్నారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య, సహాయ కార్యదర్శి సత్యనారాయణ, వెంకన్న, జోసెఫ్, స్వామి, బిక్షం, బాలనర్సయ్య, ఆంధ్రయ్య, చంద్రయ్య, ఎఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన దివ్యాంగుడిపై దాడిచేసిన హెచ్‌ఎంపై చర్యలు

ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రావణ్ డిమాండ్

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** గిరిజన దివ్యాంగుడు, కిందిస్థాయి ఉద్యోగిపై దాడిచేసిన హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వెలుగు శ్రావణ్, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి మాలోతు రవీందర్ మాట్లాడుతూ పత్తిపాక బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలలో అటెండర్ హలావత్ లింగ్యానాయక్‌పై ఆదివారం పాఠశాల హెచ్‌ఎం దాడి చేయడంపై అధికారులు విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా హెచ్‌ఎం ఇలానే చేసినా కింది స్థాయి ఉద్యోగులు వారి బాధను చెప్పుకోలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయకార్యదర్శి మేక వెంకటేష్, ఆబోతు అశోక్, చిలివేరు వికాస్, మోత్కూరి హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



# క్రీడ

## స్పిన్ బలహీనతను కింగ్ ఛేదించాడిలా..!



విరాట్ కోహ్లీ ఇటీవల కాలంలో స్పిన్నర్లకు తరచూ వికెట్లు సమర్పించుకోవడం ఫ్యాన్స్‌ను ఆందోళనకు గురిచేసింది. గత ఆరు మ్యాచ్‌ల్లో ఐదుసార్లు రిస్ట్ స్పిన్నర్లకే వికెట్లు సమర్పించుకొన్నాడు. ఈ బలహీనతను అధిగమించేందుకు కింగ్ తన టెక్నిక్‌ను మెరుగుపర్చుకోవడంతో పాటు.. తీవ్రస్థాయిలో శ్రమించాడు. ఈ టోర్నమెంట్‌లో అతడి బ్యాటింగ్ శైలిలో మార్పు స్పష్టంగా కనిపించింది. ముఖ్యంగా ఫుట్‌వర్క్, స్వీప్ షాట్లలో మరింత పరిణతి కనిపిస్తోంది. తాజాగా పాక్‌తో జరిగిన మ్యాచ్ సందర్భంగా నెట్స్ సెషన్‌కు అతడు దాదాపు రెండు గంటల ముందే చేరుకొన్నాడు. ముఖ్యంగా స్థానిక స్పిన్నర్లను పిలిపించుకొని సుదీర్ఘ సమయం ప్రాక్టీస్ చేశాడు. ముఖ్యంగా స్వీప్ షాట్ కొట్టడంపై దృష్టిపెట్టాడు. దీంతోపాటు క్రీజ్ లోపలికి వెళ్లి ఆడుతూ బ్యాక్‌ఫుట్ గేమ్‌కు పదునుపెట్టాడు.

దీనిపై స్టార్‌స్పోర్ట్స్‌లో మాజీ ఆటగాడు ఆకాశ్‌చోప్రా మాట్లాడుతూ.. "కొన్ని షాట్లు ఆడటంలో, రిస్ట్ స్పిన్‌ను ఎదుర్కోవడంలో కోహ్లీ సమస్యలను ఎదుర్కొంటున్నాడు. ఈవిషయాన్ని అతడు కూడా గ్రహించాడు. పాక్‌తో జరిగిన మ్యాచ్‌లో అబ్రార్‌ను ఎదుర్కోవాల్సి ఉంటుందని అతడికి తెలుసు. అందుకే స్లాగ్ స్వీప్, స్వీప్, బ్యాక్‌ఫుట్‌లో కట్స్ ఆడటంపై ఎక్కువ దృష్టిపెట్టాడు. ఇక దుబాయ్‌లో పిచ్ ఎలా స్పందిస్తోందో అతడికి తెలుసు'' అని పేర్కొన్నాడు.

మ్యాచ్‌లో 14వ ఓవర్‌లో అబ్రార్ అహ్మద్ బౌలింగ్‌కు రావడంతో కోహ్లీ అప్రమత్తమయ్యాడు. సింగిల్స్‌తో మొదలుపెట్టాడు. ఆ తర్వాత కొన్ని డాట్‌బాల్స్ ఆడినా.. మంచి ఫుట్‌వర్క్‌తో మ్యాచ్ చివరివరకు అతడిని ఎదుర్కొన్నాడు. సింగిల్స్, డబుల్స్‌తో భారీ ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. అవసరమైనప్పుడు సీమర్ల నుంచి బౌండరీలు రాబట్టాడు.



## సచిన్ రికార్డుకు 15 ఏళ్లు

సచిన్ తెందూల్కర్ ఆట గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. క్రీజులో కుదురుకున్నాడంటే ప్రత్యర్థి బౌలర్లపై బౌండరీలతో విరుచుకుపడటం లిటిల్ మాస్టర్ నైజం. గ్రౌండ్ ఏదైనా, ఏ టీమ్ అయినా సచిన్ పరుగుల వరద పారించేవాడు. సచిన్ తన సుదీర్ఘ కెరీర్‌లో అద్భుతమైన ఆటతీరుతో ఎన్నోరికార్డులు నెలకొల్పాడు. అందులో ఒక రికార్డు మాత్రం ప్రత్యేకమైనది అని చెప్పొచ్చు. అదే వన్డేల్లో డబుల్ సెంచరీ. సాధారణంగా 50 ఓవర్ల ఫార్మాట్‌లో సెంచరీ చేస్తేనే గొప్పగా భావిస్తారు. అలాంటిది సచిన్ ఏకంగా డబుల్ సెంచరీ బాదేసి క్రీడాలోకాన్ని ఆశ్చర్యానికి గురిచేశాడు. అప్పటికి సచిన్ వయసు 36 ఏళ్ల 10 నెలలు.

### వన్డేల్లో తొలి 'డబుల్'

2010, ఫిబ్రవరి 24.. భారత్, సౌతాఫ్రికా మధ్య గ్వాలియర్‌లో రెండో వన్డే జరిగింది. ఈ మ్యాచ్‌లో సచిన్ (200*; 147 బంతుల్లో 25 ఫోర్లు, 3 సిక్స్‌లు) ద్వి శతకం బాదేసి అజేయంగా నిలిచాడు. ఈ మేటి ఇన్నింగ్స్‌తో వన్డే క్రికెట్‌లో డబుల్ సెంచరీ చేసిన తొలి ఆటగాడిగా రికార్డు సృష్టించాడు మాస్టర్ బ్లాస్టర్. తర్వాత చాలామంది ఈ ఫీట్‌ను సాధించినా సచిన్ డబుల్ సెంచరీ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోయింది. సచిన్ డబుల్ సెంచరీకితోడు దినేశ్ కార్తిక్ (79), ధోనీ (68) రాణించడంతో టీమ్‌ఇండియా 50 ఓవర్లలో 401/3 భారీ స్కోరు చేసింది. అనంతరం సఫారీలు 42.5 ఓవర్లలో 248 పరుగులకు ఆలౌటయ్యారు. డివిలియర్స్ (114) ఒక్కడే పోరాడాడు. సచిన్ 24 ఏళ్ల కెరీర్‌లో 200 టెస్టులు ఆడి 15,921 పరుగులు చేశాడు. 463 వన్డేల్లో 18,425 రన్స్ చేశాడు. వన్డేలు, టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసింది సచినే.

## ఇండియా-బీ టీమ్‌తో కూడా పాక్ గెలవదు

ప్రస్తుత పాకిస్థాన్ క్రికెట్ టీమ్ భారత ద్వితీయ శ్రేణి జట్టుతో కూడా గెలవదని క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ అన్నాడు. పాకిస్థాన్‌లో ప్రతిభ కలిగిన ఆటగాళ్లకు కొదవ ఉండదని, కానీ వారి బెంచ్ బలంగా లేకపోవడం తనను ఆశ్చర్యానికి గురిచేసిందని తెలిపాడు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో భాగంగా ఆదివారం జరిగిన హైఓల్టేజ్ మ్యాచ్‌లో టీమిండియా 6 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌ను చిత్తు చేసిన విషయం తెలిసిందే. విరాట్ కోహ్లీ శతకంతో చెలరేగడంతో ఈ మ్యాచ్ ఏకపక్షంగా ముగిసింది. ఈ ఓటమితో పాకిస్థాన్ ఈ టోర్నీ నుంచి నిష్క్రమించేందుకు సిద్ధమైంది.

**భారత్-బీ టీమ్‌తో గెలవదు..**

తాజాగా పాకిస్థాన్ జట్టు ప్రదర్శనపై ఓ జాతీయ ఛానెల్‌తో మాట్లాడిన గవాస్కర్.. ఆ జట్టు యువ ఆటగాళ్లను తయారు చేసుకోలేకపోయిందన్నాడు. భారత్ మ్యాచ్‌ల్లో పాకిస్థాన్ బ్యాటింగ్ అప్రోచ్ సరిగ్గా లేకనే ఓటమిపాలైందని అభిప్రాయపడ్డాడు. 'భారత బీ టీమ్‌తో కూడా ప్రస్తుత పాకిస్థాన్ జట్టు గెలవలేదు. భారత సీ టీమ్ ఓడిస్తుందా? అంటే కచ్చితంగా చెప్పలేను. కానీ బీ టీమ్ మాత్రం పాకిస్థాన్ను ఓడిస్తోంది. ఇరు జట్ల బ్యాటింగ్‌లో వ్యత్యాసం అప్రోచ్ మాత్రమే. తొలి బంతినే రిజ్వాన్ బౌండరీ కొట్టడంతో పాక్ మంచి అప్రోచ్‌తో ఆడుతుందని అనుకున్నాను. కానీ భారత స్పిన్నర్లు త్వరగా ఓవర్లు ముగించడంతో పాకిస్థాన్ బ్యాటర్లు తడబడ్డారు. వేగంగా పరుగులు చేయలేకపోయారు. ఇది పాకిస్థాన్‌కు నష్టం చేసింది.



**బెంచ్ బలహీనంగా..**

పాకిస్థాన్ జట్టు బెంచ్ బలంగా లేకపోవడం నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది. పాకిస్థాన్‌లో సహజ నైపుణ్యానికి కొదవలేదు. పాక్ ఆటగాళ్లు సాంకేతికంగా సరికాకున్నా.. వారికి బ్యాట్, బంతిపై మంచి అవగాహన ఉంటుంది. ఇంజమామ్ ఉల్ హక్ ఆటను పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతోంది. అతని స్టాన్స్‌ను అనుసరించాలని యువ బ్యాటర్లకు చెప్పలేం. కానీ అతనికి మంచి టెంపర్‌మెంట్ ఉంది. ఆ తరహా టెంపర్‌మెంట్‌తోనే టెక్నికల్ లోపాలను సరిచేసుకున్నాడు.

ఈ తరహా నైపుణ్యం కలిగిన ఆటగాళ్లను పాకిస్థాన్ తయారు చేసుకోకపోవడం ఆశ్చర్యం కలిగించింది. వారికి పాకిస్థాన్ సూపర్ లీగ్ ఉంది. ఐపీఎల్ ద్వారా భారత్ ఎలాంటి వైట్‌బాల్ ఆటగాళ్లను తయరు చేసిందో మనం చూస్తున్నాం. ఐపీఎల్‌తో పాటు రంజీ క్రికెట్, టీమిండియాకు ప్రాతినిథ్యం వహించారు. ఈ విషయాన్ని పాకిస్థాన్ విశ్లేషించుకోవాలి. ఒకప్పుడు ఉన్న బలమైన బెంచ్ ఇప్పుడు ఎందుకు లేదో అర్థం చేసుకోవాలి.'అని సునీల్ గవాస్కర్ చెప్పుకొచ్చాడు.

## కుస్తీ కోసం చరణ్ సన్నద్ధం!



'మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా దర్శకుడు బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రాబోతున్న 'ఆర్ సి 16' సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. కాగా ఈ సినిమా తాజాగా హైదరాబాద్‌లో ఓ కీలక షెడ్యూల్ పూర్తి చేసుకున్నట్లు తెలిసింది. దీనిలో భాగంగా చరణ్ – దివ్యేందులపై క్రికెట్ నేపథ్య సన్నివేశాలను షూట్ చేశారు. ఇక, తదుపరి షెడ్యూల్ మార్చి తొలి వారం నుంచి ఢిల్లీలో స్టార్ట్ చేయనున్నారు. ఆ షెడ్యూల్‌లో రామ్‌చరణ్‌తో పాటు ప్రధాన తారాగణంపై కుస్తీ నేపథ్య సన్నివేశాలు చిత్రీకరించనున్నారు. అన్నట్టు కథ రీత్యా ఈ సినిమాలో క్రికెట్, కుస్తీతో పాటు మరికొన్ని ఆటలకు ప్రాధాన్యముంది. చరణ్ దీంట్లో అందర్నీ ఆశ్చర్యపరిచేలా ఓ కొత్త క్యారెక్టరైజేషన్‌లో కనిపించబోతున్నాడు. మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సినిమాకి 'పెద్ది' అనే పేరుతో పాటు మరో రెండు టైటిల్స్ పరిశీలనలో ఉన్నాయి. మార్చి 27న రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా టైటిల్ టీజర్ రిలీజ్ చేయనున్నారు.

# రీల్

## రావణ్ పాత్ర పోషించడానికి కారణమదే: యశ్



రామాయణాన్ని ఆధారంగా చేసుకొని బాలీవుడ్‌లో 'రామాయణ' అనే భారీ బడ్జెట్ చిత్రం రూపొందుతోన్న విషయం తెలిసిందే. నితేశ్ తివారీ దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్రంలో రావణ్ పాత్రలో కనిపించనున్నారు కన్నడ నటుడు యశ్. ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం గురించి యశ్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. 'ఇదొక అద్భుతమైన పాత్ర. ఈ కథలో నటించడానికి ప్రత్యేకమైన కారణాలు అంటూ ఏమీ లేవు. కేవలం ఆ పాత్రలో నటించాలనే ఉద్దేశంతోనే ఓకే చెప్పాను. రామాయణానికి సంబంధించి ఇదికాకుండా వేరే ఏదైనా పాత్ర చేస్తారా అంటే.. నేను తప్పకుండా నో అనే చెబుతా. ఒక నటుడిగా ఇది నాకు సవాలుతో కూడుకున్న పాత్ర. ఆ పాత్రలో ఎన్నో షేడ్స్ ఉంటాయి. యాక్టింగ్‌కు ఎంతో స్కోప్ ఉంటుంది'' అని యశ్ చెప్పారు. రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి జంటగా నటిస్తోన్న చిత్రమిది. ప్రస్తుతం ఇది చిత్రీకరణ దశలో ఉంది. వచ్చే ఏడాదిలో ఇది విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి సహ నిర్మాతగా యశ్ వ్యవహరిస్తున్నారు. ఇదే విషయం గురించి ఇటీవల ఓ చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ''డీనెగ్' సీఈవో నమిత్ మల్హోత్రాను గతంలో కలిశా. ఆయన 'రామాయణ' గురించి నాతో చెప్పారు. ఎన్నోఏళ్లుగా ప్రయత్నిస్తున్నా పలు కారణాల వల్ల సాధ్యపడట్లేదని చెప్పారు. భారతీయ చిత్రాలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలన్న ఆయన విజన్ నన్ను ఆకర్షించింది. దాంతో, ఈ ప్రాజెక్టుకు సహ నిర్మాతలుగా వ్యవహరించాలని నిర్ణయించుకున్నా' అని తెలిపారు.

## 'ఊర్వశి రౌతేలా'కి మరో బంపర్ ఆఫర్ ?



బాలయ్య బాబు 'డాకు మహారాజ్' సినిమాలో ఊర్వశి రౌతేలాకి మంచి పాత్ర దక్కింది. ఆమె పాత్రలో గ్లామర్‌తో పాటు యాక్షన్ కూడా బాగానే హైలైట్ అయింది. ఈ నేపథ్యంలో ఊర్వశి రౌతేలాకి మరో బంపర్ ఆఫర్ తగిలినట్టు తెలుస్తోంది. ప్రశాంత్ నీల్ – ఎన్టీఆర్ కలయికలో రాబోతున్న సినిమాలో ఊర్వశి రౌతేలాకి ఛాన్స్ దొరికిందట. ఇప్పటికే, ఈ సినిమా రెగ్యులర్ చిత్రీకరణ మొదలైంది. వచ్చే షెడ్యూల్‌లో ఊర్వశి రౌతేలా కూడా షూట్‌లో జాయిన్ కానుంది. కాగా ప్రస్తుతం జరుగుతున్న తొలి షెడ్యూల్‌లో తారక్ లేని సన్నివేశాల్ని చిత్రీకరిస్తున్నారు. మార్చి నుంచి ఎన్టీఆర్ ఈ చిత్ర సెట్స్‌లోకి అడుగు పెడతారని తెలుస్తోంది. ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో ఓల్ కోల్‌కతా బ్యాక్‌డ్రాప్‌లో ఓ ప్రత్యేక సెట్‌ను రెడీ చేస్తున్నారు. ఈ సెట్ లోనే ఈ సినిమా రెండో షెడ్యూల్ స్టార్ట్ కాబోతుంది. ఈ పీరియాడిక్ మాస్ యాక్షన్ డ్రామాలో ఎన్టీఆర్‌కు జోడీగా రుక్మిణీ వసంత్ కనిపించబోతుంది. మలయాళ యువ హీరో టొవినో థామస్ కీలక పాత్రలో నటించనున్నాడు. ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఆ మధ్య ఈ సినిమా గురించి ప్రశాంత్ నీల్ మాట్లాడుతూ.. 'ఆడియన్స్ ఊహించని స్థాయిలో ఈ మూవీని తీస్తున్నాను. ఎన్టీఆర్ పై అభిమానంతో ఈ సినిమా చేస్తున్నాను అని ఆయన పేర్కొన్నారు.

## నా ఖాతా ఎందుకు లాకైంది..?

బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ ఎక్స్ ఖాతా కొంతసమయంపాటు లాకైంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ తాజాగా ఆయన పోస్ట్ పెట్టారు. ఎలాన్ మస్క్‌ను ట్యాగ్ చేస్తూ ఈ స్క్రీన్ షాట్ షేర్ చేసిన అనుపమ్ ఖేర్.. ''డియర్ ఎక్స్.. నా ఖాతాకు సంబంధించి సేవలు పునఃప్రారంభమైనప్పటికీ ఇది ఎందుకు లాకైందో అర్థం కావడం లేదు. 2007 సెప్టెంబర్ నుంచి నేను ఈ ప్లాట్‌ఫామ్‌లో ఖాతా కలిగి ఉన్నా. ఎక్స్‌కు సంబంధించిన రూల్స్‌పై నాకంటూ ఒకింత అవగాహన ఉంది. కాబట్టి ఈ విషయం నన్ను కాస్త ఇబ్బందిపెట్టింది. మీ నిబంధనలకు విరుద్ధంగా నేను చేసిన పోస్ట్ ఏది? దీని గురించి తెలుసుకోవాలనుకుంటున్నాను'' అని రాసుకొచ్చారు.





## మైలార్ దేవ్‌పల్లిలో ఎసిబి దాడులు

**బిల్ కలెక్టర్ మధు, అసిస్టెంట్ రమేష్‌ను అదుపులోకి తీసుకున్న అధికారులు**

**రూ.45,000 లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు**

**ప్రజాపక్షం/ గండిపేట:** రాజేంద్రనగర్, సర్కిల్ పరిధిలోని మైలార్ దేవ్ పల్లి వార్డు ఆఫీస్‌లో ఏసీబీ అధికారులు దాడులు చేశారు. బిల్ కలెక్టర్ మధు, ఆయన అసిస్టెంట్ రమేష్ 45 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాలు.. రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని ఇందిరా గాంధీ సొసైటీలో అక్రమంగా నిర్మించిన షెడ్డుకు సంబంధించి ఆస్తి పన్ను పెంచకూడదంటే లక్ష రూపాయలు ఇవ్వాలని బిల్ కలెక్టర్ మధు డిమాండ్ చేశాడు. లంచం ఇస్తేనే డోర్ నెంబర్ ఇస్తాను అని బెదిరింపులకు పాల్పడ్డాడు. చివరగా యజమాని 45000 ఇచ్చేందుకు అంగీకరించాడు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు 45000 రూపాయలను బిల్ కలెక్టర్ మధు సహాయకుడు రమేష్ స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడికి రసాయనిక పరీక్ష నిర్వహించగా లంచం తీసుకున్నట్లు నిర్ధారణ అయింది. ఈ మేరకు ఏసీబీ అధికారులు బిల్ కలెక్టర్‌తో పాటు మధు తోపాటు అతడి సహాయకుడు రమేష్ ను అరెస్టు చేసి నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో హాజరు పరిచారు.

## మార్చి 28న నిర్మాణ కార్మికుల ఢిల్లీ చలోకు ఎఐటియుసి పిలుపు

**న్యూఢిల్లీ :** తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ మార్చి 28వ తేదీన నిర్మాణ రంగ కార్మికులు ఢిల్లీ చలో కార్యక్రమాన్ని చేపడతారు. ఎఐటియుసి అనుబంధ సంస్థ అఖిలభారత భవన–నిర్మాణ కార్మికుల సమాఖ్య (ఎఐసిబిసిడబ్ల్యు) ఢిల్లీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారంనాడు జరిగిన సమావేశంలో ఢిల్లీ చలోకు పిలుపు ఇచ్చింది. ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ అమర్‌జీత్ కౌర్‌తోపాటు పలువురు ఎఐటియుసి జాతీయ నాయకులు, పార్లమెంటు సభ్యులు పాల్గొంటారు. ఈ మేరకు ఎఐసిబిసిడబ్ల్యు డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ గౌడ్ సోమవారంనాడు ఒక ప్రకటన చేశారు.

1996 నాటి బిఒసిడబ్ల్యు (భవన,ఇతర నిర్మాణ కార్మికుల చట్టం) చట్టాన్ని మరింత పటిష్టవంతంగా తీర్చిదిద్దాలని సమావేశం కోరింది. బిఒసిడబ్ల్యు చట్టాన్ని, సంబంధిత కార్మికుల సంక్షేమ మండలిని సంరక్షించి మరింత బలోపేతంగా తీర్చిదిద్దేందుకు ఎఐటియుసితో సహా కేంద్ర కార్మిక సంఘాల ప్రతినిధులను కూడా వాటిల్లో భాగస్వాములను చేయాలని ఎఐసిబిసిడబ్ల్యు సమావేశం డిమాండ్ చేసింది. సుంకం మొత్తాన్ని ఒక శాతం నుండి రెండు శాతానికి పెంచాలని,పెన్షన్ బకాయిలను చెల్లించడానికి సుంకాల వసూళ్ళను తప్పనిసరిగా సకాలంలో వసూలు చేయాలని, ఇతర లబ్దిదారులకు మొత్తం నిర్మాణ కార్మికులందరికీ రూ.6000 పెన్షన్ వర్తింపజేయాలని, నిర్మాణ కార్మికులందరికీ ఇఎస్ఐ సదుపాయం అందుబాటులోకి తేవాలని, బోర్డు ద్వారానే యజమాని, ఉద్యోగి మొత్తాన్ని చెల్లించాలని, అన్ని రాష్ట్రాలలోని లబ్ధిదారులకు సంక్షేమ బోర్డు ప్రయోజనాలను పంపిణీ చేయాలని, కేంద్ర చట్టంలోని 281 ఎ ప్రకారం నిర్మాణ కార్మికులందరికీ పండుగ అలవెన్సులను ప్రవేశపెట్టాలని, పండుగ సమయంలో ఈ అలవెన్సులను బట్వాడా చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ మార్చి 28న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రవీణ్ కుమార్ గౌడ్ కోరారు. ప్రసంగంతో ఈ ఢిల్లీ చలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షులు కామ్రేడ్ రామకృష్ణ పాండా, మరో జాతీయ ఉపాధ్యక్షుడు, ఎంపి కామ్రేడ్ సుబ్రాయన్, జాతీయ కార్యదర్శి సుకుమార్ దామ్లే, అఖిలభారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు, పార్లమెంటు సభ్యులు పి.సంతోశ్ కుమార్, డబ్ల్యుఎఫ్‌టియు ప్రాంతీయ కార్యదర్శి సి.శ్రీకుమార్, ఎఐటియుసి ప్రాంతీయ కార్యదర్శి వహీదా నిజామ్, ఎఐటియుసి జాతీయ కార్యదర్శి ఆర్.ప్రసాద్, ఎఐసిబిసిడబ్ల్యు అధ్యక్షుడు కె.రవి, ప్రధాన కార్యదర్శి విజయన్ కునిస్సెరీ తదితరులు ఈ చలోఢిల్లీ కార్యక్రమ సభలో పాల్గొంటారు.

సోమవారం ఢిల్లీలో జరిగిన సమావేశంలో ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షుడు కామ్రేడ్ విద్యాసాగర్ గిరి, ఎఐసిబిసిడబ్ల్యు–ఎఐటియుసి ఢిల్లీ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి ముకేశ్ కాశ్యప్, ఎఐటియుసి ఢిల్లీ ఉపాధ్యక్షుడు రాజేశ్ కాశ్యప్ పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్ ఆర్‌టిసి కార్మిక సంఘాలకేనా!

**యాజమాన్యానికి ఎలక్షన్ కోడ్ వర్తించదా?**

**బూచిగా ఎన్నికల కోడ్ పేరుతో సమస్య పరిష్కారంలో జాప్యం**

**టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి ఛైర్మన్ ఈదురు వెంకన్న**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎంఎల్‌సి ఎన్నికల ప్రవర్తన నియమావళి కేవలం కార్మిక సంఘాలకే వర్తిస్తుందా?, యాజమాన్యానికి వర్తించదా? అని టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి ఛైర్మన్ ఈదురు వెంకన్న ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని కార్మిక శాఖ కమిషనర్‌కు టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి ఛైర్మన్ ఈదురు వెంకన్న నేతృత్వంలో సోమవారం జెఎసి ప్రతినిధి బృందం వినతిపత్రం అందచేశారు. అనంతరం వెంకన్న మాట్లాడుతూ ఆర్‌టిసి కార్మికుల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం జనవరి 27న టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి సమ్మె నోటీసు ఇచ్చిందన్నారు. ఫిబ్రవరి 7 తేదీన కార్మిక శాఖ కమిషనర్ చర్చలకు ఆహ్వానించారని, ఫిబ్రవరి 10వ తేదీన ఎన్నికల కోడ్ కారణంతో చర్చలు వాయిదా వేసి, మార్చి 8 తర్వాత చర్చలకు పిలుస్తామని కార్మిక కమిషనర్ లేఖ ఇచ్చారన్నారు. కానీ ఆర్‌టిసి యజమాన్యం మాత్రం ఎన్నికల కోడ్‌ను ఉల్లంగించి, ఔట్‌సోర్సింగ్ పేరుతో నాలుగు నెలల కాలపరిమితితో డ్రైవర్‌లను నియమించేందుకు ఎం.డి. ఉత్తర్వులు జారీ చేశారన్నారు. వరంగల్, హైదరాబాద్‌లలో బదిలీలు చేయడం పట్ల జెఎసి తరపున వెంకన్న తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. జెఎసి యజమాన్యం ముందుంచిన డిమాండ్లన్ని పాతవేనని, ఎన్నికల కోడ్ పరిధిలోకి రావని తెలిసినా కూడా ప్రభుత్వ యజమాన్యాలు కావాలని ఎన్నికల కోడ్ బూచి చూపెట్టి సమస్యలు పరిష్కారం చేయకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. వెంటనే యాజమాన్యం చర్చల ద్వారా కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో సమ్మె తప్పదని ఈదురు వెంకన్న హెచ్చరించారు. ఈ విషయాన్ని ఎన్నికల కమిషనర్, కార్మిక శాఖ కమిషనర్‌లకు వినతిపత్రం ద్వారా ఫిర్యాదు చేశామన్నారు. ఈ విషయంలో ఎన్నికల కమిషనర్ సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారన్నారు. ప్రభుత్వంలోని ఉన్నతాధికారులతో జెఎసి లేవనెత్తిన అంశాలను క్షుణ్ణంగా చర్చించి, మంగళవారం మళ్లీ జెఎసి నాయకులను పిలుస్తానని, తదుపరి శాఖపరమైన చర్యలను తీసుకుంటామని కార్మిక శాఖ కమిషనర్ తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ ఎన్. కమలాకర్ గౌడ్, కోకన్వీనర్ కత్తుల యాదయ్య, కో కన్వీనర్ సుద్దాల సురేష్ బి.డి. రావు, ఎం.ఎ. మాజీద్, బి. శ్రీనివాస్, జి. రాములు, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



## బంగ్లాదేశ్ ఎన్నికల కోసమా?

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి ఎస్.జై శంకర్ శనివారం ఈ అంశంపై స్పందిస్తూ ట్రంప్ ప్రభుత్వ యంత్రాంగం నుంచి వచ్చిన సమాచారం ఆందోళనకరమనదని, ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు.

**ఆ నిధులు బంగ్లాదేశ్‌కు?**

బిజెపి దేశ వ్యతిరేక కార్యంలో మునిగితేలిందని, అమెరికా నుంచి బూటకపు వార్తలు వ్యాప్తి చేస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. ట్రంప్, మస్క్ భారత్‌ను పదే పదే అవమానిస్తుంటే మోదీ, జై శంకర్‌లు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించింది. ఎఐసిసి ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ మాట్లాడుతూ ''బిజెపి అబద్ధాలకోరుల,నిరక్షరాసుల ప్రదర్శకులు. 21 మిలియన్ డాలర్లపై వార్తలు బిజెపి, వారి బూట్లు నాకే వారు చెబుతున్న మాటలు బూటకమని తేలింది. 2022లో 21 మిలియన్‌ల డాలర్లు భారతదేశం కోసం కాదు బంగ్లాదేశ్ గురించి'' అని ఆయన వ్యాఖ్యానించారు.

## ఆప్ ఎమ్మెల్యేలు

(మొదటి పేజీ తరువాయి)

నాతో 32మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారు. ఎమ్మెల్యేలు మాత్రమే కాదు.. వీరిలో కొందరు మంత్రులూ ఉన్నారు. పంజాబ్ ఆప్ చీఫ్ అమన్ అరోడాకు కూడా ఈ విషయం తెలుసు. ఆప్ ఎమ్మెల్యేలందరికీ ఇదే చివరి ఛాన్స్ అని అర్థమైంది. అందుకే టికెట్ల కోసం వారు కొత్త పార్టీల వైపు చూస్తున్నారు. సిఎం భగవంత్ మాన్ సైతం బిజెపితో టచ్‌లో ఉన్నారు. కేజ్రీవాల్ ఆయన్ను తొలగిస్తే బిజెపిలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. నా 45 ఏళ్ల రాజకీయ అనుభవంలో ఏనాడూ తప్పుడు ప్రకటన చేయలేదు. ఆప్ సర్కార్‌ను పడగొట్టే ఉద్దేశం కాంగ్రెస్‌కు లేదని గతంలోనే చెప్పాం. ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ఆలోచన మాకు లేదు. ఆ పని బిజెపినే చేస్తుంది' అని బజ్వా వ్యాఖ్యానించారు. అయితే బజ్వా చేసిన వ్యాఖ్యలపై ఆప్ పంజాబ్ రాష్ట్ర చీఫ్, మంత్రి అమన్ అరోడా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రతాప్ సింగ్ బజ్వానే బిజెపిలో చేరతారంటూ తిప్పికొట్టారు. కాంగ్రెస్ నేత బజ్వా బిజెపిలో చేరడం దాదాపు ఖాయమైంది. కాషాయ పార్టీలో ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్ చేసుకున్నారు. కొద్ది రోజుల క్రితం బెంగళూరులో ఏం చేశారో, ఏ బిజెపి సీనియర్ నేతలను కలిశారో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బజ్వాను అడగాలి అని కోరారు.

## జర్మనీ ఎన్నికల్లో కన్జర్వేటివ్ సిడియు గెలుపు

(మొదటి పేజీ తరువాయి)

జర్మనీలో 30 శాతం పురుషులు, 27 శాతం స్త్రీలు ఓట్లు వేశారు. ఈసారి ఎన్నికల్లో భారీగా బలం పెంచుకున్న ఎఎఫ్‌డి పార్టీతో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసే ఉద్దేశం లేదని, వీలైతే ఓలాఫ్ షుల్జ్ నాయకత్వంలోని సోషల్ డెమోక్రటిక్‌పార్టీనే తమ ప్రభుత్వంలో భాగస్వామిగా చేసుకుంటామని ఆ దిశగా చర్చలు జరుపుతామని ఫ్రెడరిక్ మెర్జ్ ప్రకటించారు. ఆ ఆలోచనను ఎఎఫ్‌డి పార్టీ ఛాన్సలర్ అభ్యర్థి ఆలీస్ వీడెల్ తీవ్ర ఆక్షేపణ తెలిపారు. జర్మనీలో ఆర్థిక,సామాజిక సమస్యలన్నింటికీ షుల్జ్ ఎస్‌డియు కూటమి ప్రభుత్వమే కారణమని వారిని ప్రభుత్వంలో ఎలా భాగస్వాములుగా చేర్చుకుంటారని ప్రశ్నించారు. సాధారణంగా జర్మనీలో కూటమి ప్రభుత్వాలే ఉంటాయి. భాగస్వామ్యపార్టీని నిర్ణయించుకున్న తర్వాత మెర్జ్ ఛాన్సలర్‌గా ప్రమాణస్వీకారం చేస్తారు. కాగా ఈసారి ఎన్నికల్లో టిక్‌టాక్ ప్రచారం ద్వారా బాగా లాభపడిన ఎఎఫ్‌డిపార్టీ 20.8 శాతం ఓట్లు సంపాదించి తన బలాన్ని 158 సీట్లకు పెంచుకుంది. అధికార సోషల్ డెమోక్రటిక్ యూనియన్ (ఎస్‌డియు)పార్టీ 16.4 శాతం ఓట్లు సాధించి 121 సీట్లకు పరిమితమై మూడోస్థానానికి దిగజారింది. నిన్నటిదాకా ఆయన కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న గ్రీన్స్‌పార్టీ 11.6 శాతం ఓట్లు సంపాదించి 85 సీట్లతో సరిపెట్టుకుంది. ఇక జర్మనీ వామపక్ష కమ్యూనిస్టుల డీ లింకే పార్టీ 8.8 శాతం ఓట్లు సంపాదించుకుని బుందేస్టాగ్‌లో 64 గెలుచుకుంది. వామపక్ష సహరా వాగన్‌కనెచ్ట్ పార్టీ ఐదుశాతం ఓట్లను మాత్రమే సంపాదించింది. ఎన్నికల్లో ఐదుకంటే ఎక్కువశాతం ఓట్లు పొందితే తప్ప బుందేస్టాగ్‌లో ఏ పార్టీకీ సభ్యత్వం లభించదు. బిఎస్‌డబ్ల్యుపార్టీ 4.97 శాతం ఓట్లు, ఎఫ్‌డిపి 4.3 శాతం ఓట్లు, ఇతరులు 4.5 శాతం ఓట్లు సంపాదించుకున్నారు.

**ఫ్రెడరిక్ మెర్జ్‌కు ప్రపంచనేతల అభినందనలు**

జర్మనీ పార్లమెంటు ఎన్నికల్లో విజయం సాధించిన కన్జర్వేటివ్ సిడియు–సిఎస్‌యుపార్టీ (బవారియా) నాయకులకు ప్రపంచదేశాధిపతులు అభినందనలు తెలియజేశారు. బ్రిటన్ ప్రధానమంత్రి ఖైర్ స్టార్‌మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ సహా యూరప్ దేశాధిపతులు, ఇతర ప్రపంచ నాయకులు ఫ్రెడరిక్ మెర్జ్‌ను అభినందనల్లో ముంచెత్తుతున్నారు. స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో శాంఛెజ్ తన సందేశంలో రాబోయే ఉమ్మడి సవాళ్ళను ప్రతిఘటించేందుకు ఒక బలమైన యూరప్‌ను నిర్మించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జెకొస్లొవేకియా ప్రధానమంత్రి పీటర్ ఫియాలా తన సందేశంలో ఫెడరల్ ప్రభుత్వ ఏర్పాటుకు సిడియు–సిఎస్‌యు మంచి విజయం సాధించిందన్నారు. కొత్త ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు తామెంతో ఆసక్తిగా ఉన్నామని పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ తన సందేశంలో పేర్కొన్నారు.

**ఎఎఫ్‌డికి ఎలాన్ మస్క్, హంగేరీ అభినందన**

ఈ సారి ఎన్నికలో బ్రహ్మాండంగా లాభపడిన ఎఎఫ్‌డిపార్టీకి కూడా ప్రపంచ నేతలు అభినందనలు చెబుతున్నారు. మొదటినుండీ ఎఎఫ్‌డికి మద్దతు ఇస్తున్న ప్రపంచ కుబేరుడు ఎలాన్‌మస్క్‌తోపాటు హంగేరీ ప్రధానమంత్రి విక్టర్ ఆర్బన్‌లు రెండోస్థానంలో నిలిచిన ఎఎఫ్‌డిపార్టీ ఛాన్సలర్ అభ్యర్థి ఆలీస్ వీడెల్‌కు అభినందనలు తెలియజేశారు. ఎఎఫ్‌డిపార్టీ తన బలాన్ని రెండింతలు పెంచుకుందని ప్రశంసించారు. దీనిపై వీడెల్ స్పందిస్తూ అమెరికన్ల నుండి తనకు పెద్దసంఖ్యలో ఫోన్‌కాల్స్‌ద్వారా అభినందనలు వెల్లువెత్తాయన్నారు. ఈ ఫోన్‌కాల్సే తనను ఉదయం నిద్రమేల్కొలిపాయన్నారు. ఇది తమకెంతో విశ్వసనీయమైన విజయమని అన్నారు. ఎఎఫ్‌డికి 20 శాతం ఓట్లు లభించాయి.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com